Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

సంపుటి : 01 సంచిక : 268 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శుక్రవారం 24-10-2025 పేజీలు : 12 వెల : 2/-

## మాగంటి సునీత గెలుపు ఖాయం



**-భారీ మెజారిటీ కోసం ప్రయత్నించాలన్న కేసీఆర్**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును అక్కడి ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీత గెలుపే లక్ష్యంగా కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి

మిగతా 2లో

## గోవధ జరిగితే చేతులు కట్టుకొని కూర్చోం



**-పోలీసులు చేయలేని పని చేసి చూపిస్తామన్న బండి సంజయ్**

హైదరాబాద్ గోవులను రక్షించిన ప్రశాంత్ సింగ్పై కాల్పులు జరిపిన ఎంఐఎం నేత ఇబ్రహీంకు రివాల్వర్ ఎలా వచ్చిందని ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. గోవధ చట్టాన్ని అమలు చేయడంలో పోలీసులు విఫలమైతే ఆ పని చేస్తున్న ప్రశాంత్ సింగ్పై పోలీసులే అభాండాలు మోపడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పాలనలో గూండాలు, రౌడీలకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు చేయలేని పనిని భజరంగ్ దళ్ కార్యకర్తలు చేస్తే తప్పా? అని ప్రశ్నించారు. తక్షణమే డీజీపీ

మిగతా 2లో

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

**- కేబినెట్ నిర్ణయం, త్వరలో ఆర్డినెన్స్**
**-ఇద్దరి క్నా ఎక్కువ పిల్లలున్నా స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులే!**
**-పంచాయతీరాజ్ చట్టంలో కీలక సవరణ దిశగా రేవంత్ సర్కారు**
**-త్వరలో అమలులోకి రానున్న కొత్త విధానం**



హైదరాబాద్ తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులకు ఇప్పటివరకు అమల్లో ఉన్న "ఇద్దరు పిల్లల నిబంధన"ను ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయ, పరిపాలనా రంగాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. అందులో ప్రధానంగా, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3) తొలగింపుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సెక్షన్ ప్రకారం, మూడు లేదా అంతకంటే ఎక్కువ పిల్లలు ఉన్న వ్యక్తులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయరాదు. ఇప్పుడు ఈ పరిమితిని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్డినెన్స్ ద్వారా

మిగతా 2లో




## అబుదాబిలో సీఎం చంద్రబాబు వన్ టూ వన్ సమావేశాలు

**-ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్ పై ఫోకస్**

అమరావతి ఆంధ్రప్రదేశ్కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనలో భాగంగా అబుదాబిలో కీలక పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పర్యటన రెండో రోజున ఆయన వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో విడివిడిగా భేటీ అయి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించారు. ముఖ్యంగా ఇంధన, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆయన వారిని ఆహ్వానించారు. యూఏఈలోని రెండోరోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అబుదాబిలోని వివిధ పారిశ్రామికవేత్తలతో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏయే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయనే అంశాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు.అపెక్స్ ఇన్వెస్ట్మెంట్స్, మస్దార్, అగ్తియా గ్రూప్, లులు గ్రూప్ వంటి సంస్థలకు చెందిన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు విడివిడిగా భేటీ అయ్యారు. ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని అపెక్స్ ఇన్వెస్టిమెంట్ ఛైర్మన్ ఖలీఫా ఖౌరీ, మస్దార్ సీఈఓ మొహమ్మద్ జమీల్ అల్ రమాహీని ముఖ్యమంత్రి కోరారు. విశాఖలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని అపెక్స్, మస్దార్ సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. ఈ క్రమంలో బ్యాటరీ స్టోరేజ్ రంగంలో పెట్టుబడులపై అపెక్స్ ప్రతినిధులు చర్చించారు. సూపర్ కెపాసిటర్స్ రంగంలో పేరొందిన అపెక్స్ సంస్థను ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం ఆహ్వానించారు. ఈ మేరకు సూపర్ కెపాసిటర్ ఉత్పత్తులను రాష్ట్రానికి పంపాలని



## వందేళ్లైనా జంగల్ రాజ్యాన్ని బిహార్ ప్రజలు మరిచిపోరు : ప్రధాని మోదీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఆ రాష్ట్ర చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. అందులో యువత ప్రముఖ పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. విపక్షాలు చేసిన పాపాలను ఎంత దాచాలని చూసినా, జంగల్ రాజ్యాన్ని వందేళ్లైనా బిహార్ ప్రజలు మరిచిపోరని వెల్లడించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉద్దేశించి ఆడియో కాన్ఫరెన్స్లో మాట్లాడిన ప్రధాని, జంగిల్ రాజ్యంలో జరిగిన ఆకృత్యాలను యువతకు వృద్ధులు చెప్పాలని బీజేపీ శ్రేణులకు

మిగతా 2లో

## రూ.79వేల కోట్లతో ఆయుధాల కొనుగోలు- ఆపరేషన్ సిందూర్ తర్వాత రెండో అతి పెద్ద నిర్ణయం







## బీహార్లో ఇండీ కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవే

**-లాలూ చాణక్యానికి తలొగ్గిన కాంగ్రెస్**

పాట్నా బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఇండీ కూటమి తన సీఎం అభ్యర్థిని ప్రకటించింది. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) నేత తేజస్వి యాదవ్ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా, వికాస్శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అధినేత ముకేష్ సహానిని డిప్యూటీ సీఎం అభ్యర్థిగా గురువారం అధికారికంగా ప్రకటించింది. ఇంకా ఒక డిప్యూటీ సీఎం అభ్యర్థిని తర్వాత ప్రకటిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ తెలిపారు. పాట్నాలో జరిగిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తేజస్వి యాదవ్, ముకేష్ సహాని సహా కాంగ్రెస్ బీహార్ ఇన్చార్జ్ కృష్ణ అల్లవరు, బీహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ రామ్, లెఫ్ట్ పార్టీల నేతలు హాజరయ్యారు. వారం రోజులుగా సీటు పంపకాలు, సీఎం

మిగతా 2లో

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

ఈ సవరణలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే కొత్త ఆర్డినెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంది.ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే ఈ చట్ట సవరణ దస్త్రంపై సంతకం చేశారు. ఆ ప్రతిపాదనను అధికారులు సిద్ధం చేసి మంత్రివర్గానికి సమర్పించగా, అది ఇప్పుడు ఆమోదం పొందింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో గతంలో జరిగిన సవరణలను తెలంగాణ అధికారులు పరిశీలించారు. ఆ అనుభవం ఆధారంగా తెలంగాణ పంచాయత్ రాజ్ యాక్ట్ లో మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిబంధన వల్ల చాలా మంది అర్హులైన అభ్యర్థులు పోటీ చేయలేకపోయారని పలు రాజకీయ వర్గాలు అభిప్రాయపడ్డాయి. దీనిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను విస్తరించాలనే ఉద్దేశ్యంతో ఈ పరిమితిని తొలగించింది. ఈ నిర్ణయంతో భవిష్యత్తులో గ్రామ, మండల, జిల్లా పంచాయతీలతో పాటు పురపాలక సంస్థల ఎన్నికల్లో కూడా అభ్యర్థులు ఇకపై పిల్లల సంఖ్య ఆధారంగా అనర్హతకు గురి కావడం జరగదు. అలానే కేబినెట్ సమావేశంలో ఎస్‌ఎల్‌బీసీ (సాగర్ లెఫ్ట్ బ్యాంక్ కాలువ) టన్నెల్ పునరుద్ధరణపై సుదీర్ఘంగా చర్చించి, దీన్ని వేగవంతంగా పూర్తి చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సంబంధించిన సాంకేతిక వివరాలు, నిధుల కేటాయింపు అంశాలు కూడా చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి.

**గవర్నర్ ఆమోదిస్తే.. అమల్లోకి**

మంత్రివర్గం ఆమోదం లభించిన నేపథ్యంలో ఆర్డినెన్స్ బిల్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్గరకు వెళ్లనుంది. గవర్నర్ ఆమోదిస్తే వచ్చే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేయొచ్చు. కాగా, పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని సవరించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. దీంతో ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్‌లో చేసిన చట్ట సవరణను తెలంగాణ పంచాయతీరాజ్ అధికారులు అధ్యయనం చేశారు. రాష్ట్రంలోనూ చట్టాన్ని సవరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించారు. ఆ దస్త్రంపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే సంతకం చేశారు. తాజాగా మంత్రివర్గ సమావేశంలో సమర్పించడంతో చట్ట సవరణకు ఆర్డినెన్స్ జారీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

**నిషేధం అందుకే విధించారు..**

1994లో కుటుంబ నియంత్రణను ప్రోత్సహించడంలో భాగంగా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించారు. ఈ నిషేధంపై గతంలో పలు సందర్భాల్లో హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కూడా వ్యాజ్యలు దాఖలయ్యాయి. ఈ నిబంధన రాజ్యాంగంలోని సమానత్వ హక్కుకు విరుద్ధమనే వాదనలు వినిపించాయి. కుటుంబ నియంత్రణపై అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చాలని పలు రాజకీయ పార్టీలు కోరాయి. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి కూడా పోటీ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశాయి. దీంతో 2024 డిసెంబర్ 20న జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ఈ ప్రతిపాదన వచ్చింది. కానీ అప్పుడు ఈ అంశానికి కేబినెట్ ఆమోదం లభించలేదు. తాజాగా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**స్థానిక ఎన్నికలు ఎప్పుడు..**

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈనెల 9నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నా బీసీ రిజర్వేషన్ల అంశంతో వల్ల ఎలక్షన్స్‌కు బ్రేక్ పడింది. హైకోర్టు ఎన్నికలను నిలిపివేస్తూ 4 వారాలకు విచారణ వాయిదా వేసింది. ఇక సుప్రీం కోర్టు కూడా 50 శాతం రిజర్వేషన్లు మించకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని చెప్పింది.

# అబుదాబిలో సీఎం చంద్రబాబు వన్ టూ వన్ సమావేశాలు

అపెక్స్ ప్రతినిధులను సీఎం కోరిన మీదట సముద్ర మార్గం ద్వారా సూపర్ కెపాసిటర్ ప్రొడక్ట్సును పంపేందుకు అపెక్స్ ప్రతినిధులు అంగీకరించారు. ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు పెట్టాలని అపెక్స్ సంస్థను సీఎం ఆహ్వానించారు.ఇక సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని మస్దార్ సీఈఓను చంద్రబాబు ఆహ్వానించారు. అగ్రియా గ్రూప్ సీఈఓతో సల్మీన్ అలమేరీ, లులు గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీతో జరిపిన వేర్వేరు భేటీల్లో ఫుడ్ ప్రాసెస్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆ రెండు సంస్థలను సీఎం ఆహ్వానించారు. ఏపీలో కోకో ఉత్పత్తి బాగుంటుందని తమ దగ్గర చాక్లెట్ పరిశ్రమ పెట్టే అంశంపై ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి అగ్రియా గ్రూప్ కు సూచించారు. అలాగే గల్ఫ్ దేశాల నుంచి పారిశ్రామిక వేత్తలను తీసుకుని విశాఖ పెట్టుబడుల సదస్సుకు రావాలని సీఎం ఆహ్వానించారు.నికి కేబినెట్ ఆమోదం లభించలేదు. తాజాగా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**స్థానిక ఎన్నికలు ఎప్పుడు..**

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈనెల 9నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నా బీసీ రిజర్వేషన్ల అంశంతో వల్ల ఎలక్షన్స్‌కు బ్రేక్ పడింది. హైకోర్టు ఎన్నికలను నిలిపివేస్తూ 4 వారాలకు విచారణ వాయిదా వేసింది. ఇక సుప్రీం కోర్టు కూడా 50 శాతం రిజర్వేషన్లు మించకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని చెప్పింది.

# వందేళ్లైనా జంగల్ రాజ్యాన్ని బిహార్ ప్రజలు మరిచిపోరు : ప్రధాని మోదీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఆ రాష్ట్ర చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. అందులో యువత ప్రముఖ పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. విపక్షాలు చేసిన పాపాలను ఎంత దాచాలని చూసినా, జంగల్ రాజ్యాన్ని వందేళ్లైనా బిహార్ ప్రజలు మరిచిపోరని వెల్లడించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉద్దేశించి ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని, జంగిల్ రాజ్యంలో జరిగిన ఆకృత్యాలను యువతకు వృద్ధులు చెప్పాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బిహార్‌లోని సోదరి సోదరమణుల కంటే బాగా ప్రజల ఓటు శక్తిని ఎవరు అర్థం చేసుకుంటారని వివరించారు. బిహార్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యపరచాలని యువతకు మోదీ విజ్ఞప్తి చేశారు. విపక్షాల కూటమి గఠ్ బంధన్ కాదని, నేరస్థుల బంధన్ అని విమర్శించారు. విపక్ష కూటమిలో దిల్లీ, బిహార్‌లోని నేతలందరూ బెయిల్‌పై ఉన్నారని మోదీ దుయ్యబట్టారు.

"2014లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చాక బిహార్‌లో అభివృద్ధి పనుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. విద్యుత్ సరఫరా చాలా మెరుగుపడింది. సరిపడా విద్యుత్ ఉంటే పరిశ్రమలు, వ్యాపారం పెరిగి నిరుద్యోగులకు అవకాశాలు వస్తాయి. బిహార్‌లోని ప్రతి రంగంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆస్పత్రులు, పాఠశాలలు నిర్మిస్తున్నారు. కొత్త రైల్వే మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటన్నింటికి ప్రధాన కారణం బిహార్‌లో సుస్థిర ప్రభుత్వం ఉండడం. స్థిరమైన ప్రభుత్వాలు ఉన్నప్పుడే అభివృద్ధి పుంజుకుంటుంది. బిహార్‌లో టెక్నాలజీ, స్టార్టప్ హబ్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. బిహార్ యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం తగ్గుతుంది. అయోధ్యలో రామమందిరం నిర్మించాం. శత్రువులపై ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. నక్సలిజం అంతం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. ఇదంతా మీరు వేసిన ఒక్క ఓటుతోనే సాధ్యం. ఆ ఓటుతోనే ఇవన్నీ చేయగలిగాం."

"అనేక దశాబ్దాలుగా దేశంలో, బిహార్‌లోని ప్రజలను నక్సలిజం ఇబ్బందులకు గురి చేసింది. మావోయిస్టుల సాయంతో ఎన్నికల్లో గెలిచారు. బిహార్ అభివృద్ధిని అడ్డుకోవడ నక్సలిజం కీలక పాత్ర పోషించింది. పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రులు తెరిచేందుకు నక్సలైట్లు అనుమతించలేదు. అప్పటికే ఉన్న వాటిని సైతం కూల్చివేశారు. పరిశ్రమలు వచ్చేందుకు అనుమతించలేదు. ఇలాంటి పరిస్థితుల నుంచి బిహార్‌ను బయటకు తెచ్చేందుకు చాలా కష్టపడుతున్నాం. 2014 నుంచి తీవ్రంగా శ్రమిస్తున్నాం. బిహార్‌ను జంగిల్ రాజ్ అంధకారం నుంచి ఎన్‌డీఏ బయటకు తెచ్చి అభివృద్ధి చేసింది. నక్సలిజాన్ని అంతం చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. బిహార్ యువత భవిష్యత్‌ను కాపాడడం మా కర్తవ్యం. దాని కోసం మేము చాలా పట్టుదలతో పనిచేస్తున్నాం." అని నరేంద్ర మోదీ అన్నారు. బిహార్‌లో మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి వస్తే మహిళ సాధికారతలో కొత్త యుగం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జంగిల్ రాజ్‌లో మహిళలను నాలుగు గోడల మధ్యలో ఉంచారని ఆరోపించారు. అందుకే వారిని అధికారం నుంచి దూరంగా ఉంచడం చాలా ముఖ్యమని అన్నారు. తమ పాలనలో కోటి మందికి పైగా మహిళలు రూ. 10వేలు అందుకుని వ్యాపారాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇంకా అందుకోని మహిళల పేర్లు తీసుకుని వారితో చర్చించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నవంబర్ 14న ప్రభుత్వం వచ్చాక వారందరికీ ఇస్తామని హామీ ఇవ్వాలని తెలిపారు.

# మోదీ నాయకత్వంలో ఒక్క ఏడాదిలోనే 200కి పైగా కీలక మైలురాళ్లు : ఇస్రో

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత అంతరిక్ష రంగం 2025లో అద్భుత పురోగతిని సాధించిందని ఇస్రో ఛైర్మన్ వీ నారాయణన్ అన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే ఏకంగా 200కిపైగా కీలక మైలురాళ్లను అధిగమించామని తెలిపారు. బెంగళూరులో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ 2025 (%జుూ×జ%-2025) కర్టన్ రైజర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూ. 400 కోట్లతో మూడో లాంచ్ ప్యాడ్‌ను తమిళనాడులో నిర్మించేందుకు ఆమోదం పొందామని వెల్లడించారు. ప్రయోగాల సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు."ప్రధాని మోదీ నేతృత్వంలో జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు 200కి పైగా కీలక మైలురాళ్లను సాధించాం. జనవరి 6న ఆదిత్య ఎల్ 1 మిషన్ నుంచి సేకరించిన 10 టెరాబైట్ల సాంకేతిక డేటాను విడుదల చేశాం. ఆ తర్వాత ఫిబ్రవరిలోనే మరికొంత డేటాను రిలీజ్ చేశాం. ఇప్పటి వరకు ఆదిత్య మిషన్ నుంచి దాదాపు 15 టెరాబైట్ల డేటాను ప్రచురించాం. తొలిసారిగా ఆర్బిట్ డాకింగ్ ప్రయోగం స్పేడెక్స్‌ను జనవరి 16న చేపట్టాం. గంటకు 28,400కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రెండు ఉపగ్రహాలను డాకింగ్ చేశాం. ఆల్గారిథమ్స్, కెమెరాలుతో పాటు వివిధ వ్యవస్థలను ఉపయోగించి ఈ రెండు శాటిలైట్లను విజయవంతంగా డాకింగ్ చేశాం. ఫలితంగా ప్రపంచంలోనే స్పేస్ డాకింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ రికార్డ్ సృష్టించింది. జనవరి 29న జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 మిషన్ ప్రయోగించాం. ఇది శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చేసిన వందో ప్రయోగం.గగన్‌యాన్ ప్రాజెక్ట్ ప్రస్తుతం చివరి దశకు వచ్చిందని, దాదాపు 85-90 పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. వీటిపై ప్రస్తుతం అంతర్గత పరీక్షలు, సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలిస్తున్నామని చెప్పారు. దీనికంటే ముందుగా మూడు మానవ రహిత మిషన్‌లు చేపడతామని వెల్లడించారు. బ్లూబర్డ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం ఇస్రోకు అందిందని, ప్రయోగానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

## బీహార్‌లో ఇండీ కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవే

పాట్నా బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఇండీ కూటమి తన సీఎం అభ్యర్థిని ప్రకటించింది. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా, వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ (వీఐపీ) అధినేత ముకేష్ సహనిని డిప్యూటీ సీఎం అభ్యర్థిగా గురువారం అధికారికంగా ప్రకటించింది. ఇంకా ఒక డిప్యూటీ సీఎం అభ్యర్థిని తర్వాత ప్రకటిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ తెలిపారు. పాట్నాలో జరిగిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తేజస్వి యాదవ్, ముకేష్ సహని సహా కాంగ్రెస్ బీహార్ ఇన్‌చార్జ్ కృష్ణ అల్లవరు, బీహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ రామ్, లెఫ్ట్ పార్టీల నేతలు హాజరయ్యారు. వారం రోజులుగా సీటు పంపకాలు, సీఎం ఫేస్ ప్రకటనపై చర్చలు జరిగిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. కూటమి నేతలతో చర్చల తర్వాత తేజస్వి యాదవ్‌ను సీఎం ఫేస్‌గా నిర్ణయించాం. ఆయనకు దీర్ఘకాలిక భవిష్యత్ ఉందని అశోక్ గెహ్లాట్ అన్నారు. ముకేష్ సహని నిషాద్ వర్గంలో ప్రభావం కలిగిన నేత కావడంతో డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారు. మరో వెనుకబడినవర్గాల నేతను డిప్యూటీ సీఎంగా ప్రకటిస్తామని కూటమి ప్రకటించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదా సీఎం కావడం మాత్రమే లక్ష్యం కాదని బీహార్ అభివృద్ధి కోసం మేము ఏకమయ్యాం. 20 ఏళ్ల 'ఉపయోగం లేని' డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి" అని తేజస్వీ యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్నికలు జరుగుతున్నాయో లేదో చెప్పాలన్నారు. నితీష్ కుమార్‌కు ఎన్‌డీఏలో అన్యాయం జరుగుతోంది. ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదన్నారు. సీటు పంపకాలలో ఆలస్యం కారణంగా ఆర్‌జేడీ, కాంగ్రెస్, వీఐపీలు మొదటి దశలో ఏకపక్షంగా నామినేషన్లు దాఖలు చేశాయి. కనీసం 7 సీట్లలో అలయన్స్ భాగస్వాముల మధ్య పోటీ ఉంది. మొత్తం సీట్లలో ఆర్‌జేడీ 143, కాంగ్రెస్ 61 సీట్లలో పోటీ చేస్తున్నాయి. మిగిలిన సీట్లు సీపీఐ(ఎమ్ఎల్), వీఐపీ, ఇతర చిన్న పార్టీలకు కేటాయించారు. మొత్తం 243 సీట్లకు 253 మంది అభ్యర్థులను ప్రకటించారు. పది చోట్ల ఫ్రెండ్లీ ఫైట్ జరగనుంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరుగుతాయి. మొదటి దశ నవంబర్ 6న 121 సీట్లకు, రెండో దశ నవంబర్ 11న 122 సీట్లకు పోలింగ్. ఫలితాలు నవంబర్ 14న వెలువడతాయి.

## మాగంటి సునీత గెలుపు ఖాయం

ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాగంటి సునీత, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థి మాగంటి సునీతగెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి కేసీఆర్ సమీక్షించారు. అనంతరం పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల గుల్ల అయ్యిందని అన్నారు. జూబ్లీహిల్స్‌లో తన అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఓ రౌడీషీటర్‌ను నిలబెట్టి హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందని చెప్పుకొచ్చారు. విజ్ఞులైన జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన రౌడీ షీటర్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అభ్యర్థిని చిత్తుగా ఓడించి జూబ్లీహిల్స్ గౌరవాన్ని, హైదరాబాద్‌లో శాంతి భద్రతలను కాపాడుకుంటారని విశ్వాసం తనకు ఉందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును జూబ్లీహిల్స్ ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు ప్రజల వద్దకు వెళ్లి వారితో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలన పట్ల మరింత అవగాహన కల్పించి భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాల్సి ఉందని పార్టీ నేతలకు కేసీఆర్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి గురించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన ప్రమాదకర పరిస్థితులను గురించి వారికి ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనాకాలంలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, మానవీయ కోణంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు మాయమయ్యాయనే విషయాన్ని ప్రజలతో కలిసి చర్చించాలని ఆదేశించారు.

## గోవధ జరిగితే చేతులు కట్టుకొని కూర్చోం

క్షమాపణ చెప్పడంతో పాటు ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన కామెంట్స్‌కు వ్యతిరేకంగా డీజీపీ కార్యాలయాన్ని ముట్టిడికి బీజేపపీ నాయకులు యత్నించారు. వాళ్లను మార్గమధ్యలోనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. తమను అరెస్టు చేయడంపై నేతలు మండిపడ్డారు.

అంతకంటే ముందు బీజేపీ సీనియర్ నేతలు సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్ సింగ్‌ను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సోనూ సింగ్ వైద్యానికి అయ్యే ఖర్చును పార్టీ భరిస్తుందని, అతనికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయా నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. గోవులను చట్టానికి విరుద్ధంగా కబేళాకు తరలిస్తున్నారని గోవులను రక్షించే ధర్మ కార్యం కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రశాంత్ సింగ్ పై కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం, పోలీసులు చేయాల్సిన పనిని చేతులెత్తేస్తే ఆ పనిని నెరవేరుస్తున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు చట్టానికి లోబడి గోమాతలను రక్షిస్తుంటే దాడులు చేసి చంపాలని చూస్తున్నారన్నారు. గతంలో సంజయ్ అనే వ్యక్తిపై కార్లు పైకి ఎక్కించి చంపాలని చూశారన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేస్తే ముస్లిం ఓట్లు పోతాయని కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయని నేతలు మండిపడ్డారు. ఆనాడు బీఆర్ఎస్ పాలనలో ఎంఐఎం నేతలు గోవులను వధించారన్నారు. అడ్డుకున్న వాళ్లపై కాల్పులు జరుపుతున్నారని దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. సహనానికి హద్దు ఉంటుందని పరికితనంగా భావిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. గోవులను గోశాలకు తరలిస్తామని చెప్పడం కాదని గోవధ చట్టాన్ని అమలు చేసి చేతల్లో చూపాలని సీఎంకు సవాల్ చేశారు. సోనూ సింగ్ (ప్రశాంత్ సింగ్) రూ. 5 లక్షలు డిమాండ్ చేశారని చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇబ్రహీం వ్యాపారానికి రూ.కోటి నష్టం వాటిల్లిందని చెప్పడం సిగ్గు చేటు అన్నారు. గోవులను వధించడం తప్పని చెప్పకుండా, గన్ ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పకుండా నిందితుడికి వత్తాసు పలకడం దుర్మార్గమని విమర్శించారు. హిందువుల మనోభావాలను, హిందూ ధర్మాన్ని హేళన చేస్తే, గోరక్షకులను అవమానిస్తే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని అన్నారు బీజేపీ నేతలు.

## బీహార్‌లో ఇండీ కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవే

ఫేస్ ప్రకటనపై చర్చలు జరిగిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. కూటమి నేతలతో చర్చల తర్వాత తేజస్వి యాదవ్‌ను సీఎం ఫేస్‌గా నిర్ణయించాం. ఆయనకు దీర్ఘకాలిక భవిష్యత్ ఉందని అశోక్ గెహ్లాట్ అన్నారు. ముకేష్ సహని నిషాద్ వర్గంలో ప్రభావం కలిగిన నేత కావడంతో డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారు. మరో వెనుకబడినవర్గాల నేతను డిప్యూటీ సీఎంగా ప్రకటిస్తామని కూటమి ప్రకటించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదా సీఎం కావడం మాత్రమే లక్ష్యం కాదని బీహార్ అభివృద్ధి కోసం మేము ఏకమయ్యాం. 20 ఏళ్ల 'ఉపయోగం లేని' డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి" అని తేజస్వీ యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్నికలు జరుగుతున్నాయో లేదో చెప్పాలన్నారు. నితీష్ కుమార్‌కు ఎన్‌డీఏలో అన్యాయం జరుగుతోంది. ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదన్నారు. సీటు పంపకాలలో ఆలస్యం కారణంగా ఆర్‌జేడీ, కాంగ్రెస్, వీఐపీలు మొదటి దశలో ఏకపక్షంగా నామినేషన్లు దాఖలు చేశాయి. కనీసం 7 సీట్లలో అలయన్స్ భాగస్వాముల మధ్య పోటీ ఉంది. మొత్తం సీట్లలో ఆర్‌జేడీ 143, కాంగ్రెస్ 61 సీట్లలో పోటీ చేస్తున్నాయి. మిగిలిన సీట్లు సీపీఐ(ఎమ్ఎల్), వీఐపీ, ఇతర చిన్న పార్టీలకు కేటాయించారు. మొత్తం 243 సీట్లకు 253 మంది అభ్యర్థులను ప్రకటించారు. పది చోట్ల ఫ్రెండ్లీ ఫైట్ జరగనుంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరుగుతాయి. మొదటి దశ నవంబర్ 6న 121 సీట్లకు, రెండో దశ నవంబర్ 11న 122 సీట్లకు పోలింగ్. ఫలితాలు నవంబర్ 14న వెలువడతాయి.

## సత్యమేవ జయతే ఆరోగ్యమే మహాభాగ్యం

సత్యమేవ జయతే : సంగారెడ్డి పక్షవాతం (స్ట్రోక్) రావడానికి ముందు కొన్ని లక్షణాలు కనిపించవచ్చు, వాటిని సకాలంలో గుర్తించి త్వరగా స్పందిస్తే నష్టాన్ని చాలా వరకు తగ్గించవచ్చు.

◈▯◈ పక్షవాతం రావడానికి ముందు కనిపించే ముఖ్య లక్షణాలు.

◈ముఖం ఒక వైపు వాలిపోవడం (%ఖీుఎవ ుతీశీశీజూఱఅస్త్ర%): నవ్వమని అడిగినప్పుడు ముఖం ఒక వైపు లాగినట్లుగా లేదా వాలిపోయినట్లుగా ఉండటం.

◈చేతులు లేదా కాళ్ళు బలహీనపడటం (%ూతీఎ షఱుూఅవంం%): ఒక చేయి లేదా కాలు బలహీనంగా అనిపించడం లేదా పైకి లేపలేకపోవడం. రెండు చేతులను ఒకేసారి పైకి లేపమని అడిగినప్పుడు, ఒక చేయి కిందికి జారిపోవడం.

◈మాట తడబడటం లేదా మాట రాకపోవడం (%ూజూవవషష్ట్ర ుఱటటఱషబశ్రీఎ%): మాటలు స్పష్టంగా లేకపోవడం (స్లర్రింగ్), లేదా పూర్తిగా మాట రాకపోవడం, లేదా ఎదుటివారు చెప్పేది అర్థం చేసుకోలేకపోవడం. "నీ పేరు ఏమిటి?" వంటి సాధారణ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోవడం.

◈తీవ్రమైన తలనొప్పి: అకస్మాత్తుగా, మునుపెన్నడూ లేనంత తీవ్రమైన తలనొప్పి, దీనికి ఎటువంటి స్పష్టమైన కారణం ఉండదు.

◈చూపు సమస్యలు: ఒకటి లేదా రెండు కళ్ళలో అకస్మాత్తుగా దృష్టి మసకబారడం, లేదా చూపు కోల్పోవడం.

◈నడవడంలో సమన్వయం కోల్పోవడం: అకస్మాత్తుగా మైకం రావడం, సమతౌల్యం కోల్పోవడం, నడవడానికి ఇబ్బంది పడటం.

▯◈▯ నష్ట నివారణ తగ్గించడానికి సత్వర ఏర్పాట్లు

▯వెంటనే 108 కు కాల్ చేయండి. వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి కారులో వెళ్లడం కంటే అంబులెన్స్‌లో వెళ్లడం శ్రేయస్కరం.

▯వ్యక్తిని విశ్రాంతిగా, సురక్షితమైన ప్రదేశంలో పడుకోబెట్టండి. కింద పడకుండా చూసుకోండి.

▯బిగుతుగా ఉన్న దుస్తులను వదులు చేయండి.

▯శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటే, వారి తలను ఒక వైపుకు తిప్పండి, తద్వారా వాంతి వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లోకి వెళ్లకుండా ఉంటుంది.

▯ఏమి తినిపించవద్దు లేదా త్రాగనివ్వవద్దు. స్పృహ కోల్పోతే ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడవచ్చు.

▯వ్యక్తికి ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలు (బీపీ, షుగర్, గుండె జబ్బులు మొదలైనవి) మరియు వారు ప్రస్తుతం వాడుతున్న మందుల గురించి వైద్య సిబ్బందికి తెలియజేయండి.

### కెసిఆర్ తో ప్రత్యేకంగా సమావేశమైన వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్..



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇన్చార్జిలతో గురువారం సమావేశం అయిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ . సమావేశం తర్వాత కేసీఆర్ డాక్టర్ ఆనంద్ ను ప్రత్యేకంగా ఇంటికి పిలుచుకొని పలు రాజకీయ విషయాలపై చర్చించడం. జరిగింది. జూబ్లీహిల్స్ గెలవడమే గాక భవిష్యత్తులో కూడా వికారాబాద్ లోని అన్ని నియోజకవర్గాలలో గెలుస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లా అధ్యక్షుడిగా బాగా పనిచేస్తున్నావని చెప్పడం జరిగింది...

### ప్రాణాలైనా అర్పిస్తాం %-% మా భూములు ఇవ్వం"

### అంటున్న త్రిబుల్ ఆర్ బాధితులు.



. సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా...వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం చించల్ పేట్ వికారాబాద్ మండలంలోని పులుసుమామిడి గ్రామ పరిధిలోని రైతులు తమ భూములను కాపాడుకునేందుకు ఆగ్రహంతో కదిలారు.
త్రిబుల్ ఆర్ ప్రాజెక్ట్ కోసం భూములు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలపై రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు."మా భూములు మా ప్రాణాల్లాంటివి. ప్రాణాలైనా పోయినా భూములు మాత్రం ఇవ్వం" అని కరకండిగా చెబుతున్నారు బాధిత రైతులు.
ఇప్పటికే చాలామంది రైతులు తమ భూములు కోల్పోతామన్న ఆందోళనతో మానసికంగా కుంగిపోతున్నారని, కొందరు అనారోగ్యానికి గురవుతూ ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ వార్త బయటకు వచ్చినప్పటి నుండి రైతులు భయాందోళనకు గురై పొలాల్లోకూడా వెళ్లలేకపోతున్న పరిస్థితి నెలకొంది.
రైతుల మనోభావాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే స్పందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు..

# ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..ముఖ్య

# అతిథి గా వచ్చిన డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి..

# వికారాబాద్ టౌన్ సిఐ భీమ్ కుమార్.





సత్య మేవ జయతే : వికారాబాద్ జిల్లా : ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ పట్టణ సిఐ భీమ్ కుమార్ అన్నారు.ఓపెన్ హౌస్ కార్యక్రమలో భాగంగా వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో వికారాబాద్ సి ఐ భీమ్ కుమార్ ఆధ్వర్యంలో వికారాబాద్ డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై సిద్ధార్థ పాఠశాల విద్యార్థులకి చట్టాలు, పోలీస్ విధుల పై అవగాహనా కలిపించారు. ప్రతి విద్యార్థి పోలీస్ స్టేషన్లో పరిసరాల వివరిస్తూ పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి కూడా ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు.ఈ సందర్బంగా డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కలిగివుండాలని,ప్రజా భద్రతను కాపాడటం, చట్టాలను పాటించడం, మరియు పౌరుల హక్కులను గౌరవించడం వంటివి సమాజం లో ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.చట్టబద్ధమైన ఉత్తర్వులను పాటించడం, నేరాలను నివారించడం, ప్రజలకు సహాయం చేయడం పోలీసుల ముఖ్య విధులు పైన విద్యార్థి దశ నుండి తెలుసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ లు గిరన్న, ప్రవీణ్, మీనాక్షి లు పాల్గొన్నారు..

# కేసారం రైతు వేదికలో హార్టికల్చర్ అవగాహన సదస్సు %-

### ్ర %-% రైతుల ఆదాయానికి కొత్త దారులు చూపిన

### మండల హార్టికల్చర్ అధికారి అక్షిత రెడ్డి.





సమస్త ప్రక్షాళన మోమిన్ పేట్: మండల పరిధిలోని కేసారం గ్రామ రైతు వేదికలో రైతులతో విశాల స్థాయి హార్టికల్చర్ అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీ సత్తార్ ప్రధాన వక్తగా హాజరై, రైతులకు ఉద్యాన రంగంలో ఉన్న అవకాశాలు, ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, పట్టు పరిశ్రమ ప్రాధాన్యత వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు.సత్తార్ మాట్లాడుతూ ు
"వ్యవసాయ రంగంలో హార్టికల్చర్ అనేది రైతు జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శక్తివంతమైన సాధనం. ఒక ఎకరా పొలంలో కేవలం పంటలు కాకుండా పండ్లు, కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు, తేనె ఉత్పత్తి వంటి విభాగాలను అనుసంధానిస్తే రైతు ఆదాయం మూడింతలు పెరగవచ్చు" అని పేర్కొన్నారు.
పండ్ల తోటలలో మామిడి, జామ, బత్తాయి, సీతాఫలం, గువ్వ, ద్రాక్ష వంటి పంటలు వాతావరణానికి అనుగుణంగా సాగు చేయాలి.
కూరగాయల సాగులో టమోటా, మిర్చి, వంకాయ, దోసకాయ, బెండకాయ, గోంగూర పంటలను డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో సాగు చేస్తే నీటి వినియోగం తగ్గి ఉత్పత్తి పెరుగుతుంది.
పుష్ప సాగులో జాస్మిన్, మల్రి, గులాబీ, గ్లాడియోలస్, చామంతి వంటి పూలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందని చెప్పారు.తేనెటీగల పెంపకం ద్వారా సహజ పరాగసంపర్కం జరుగుతుంది, పంట దిగుబడి పెరుగుతుంది మరియు అదనంగా తేనె అమ్మకం ద్వారా లాభాలువస్తాయి.
రైతులకు ప్రభుత్వ పథకాలపై వివరించి ు
"హార్టికల్చర్ శాఖ ద్వారా రైతులకు ఉచిత మొక్కలు, నాణ్యమైన నాట్లు, నీటి తాగునీరు మరియు డ్రిప్ ఇరిగేషన్‌పై సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుంటే గ్రామీణ ఆర్థిక స్థితి మారిపోతుంది" అని తెలిపారు.
పట్టు పరిశ్రమ (%ూవతీఱఎబశ్రీబతీవ%)పై మాట్లాడుతూ ు
"తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఇచ్చే రంగం ఇది. పట్టు పురుగుల పెంపకం ద్వారా పట్టు గుడ్లు, దారాలు ఉత్పత్తి చేయడం రైతులకు అదనపు ఉపాధిని కల్పిస్తుంది. ఈ రంగంలో ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాలు, సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయి" అని వివరించారు.
సత్తార్ ఆధునిక వ్యవసాయ సాంకేతికతల ప్రాముఖ్యతను కూడా వివరించారు ు
మల్చింగ్ షీట్స్ ఉపయోగించడం ద్వారా కలుపు మొక్కలు నియంత్రణలో ఉంటాయని, నేల తేమ కాపాడబడుతుందని చెప్పారు.
ఇంటిగ్రేటెడ్ న్యూట్రియెంట్ మేనేజ్‌మెంట్ (%×చీవీ%) మరియు ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ (%×జూవీ%) ద్వారా పంటలు రసాయనాలకు బదులు సహజ పద్ధతుల్లో రక్షణ పొందుతాయని వివరించారు.
మార్కెటింగ్ సదుపాయాల కోసం కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, రైతు సమూహాలు (%ఖీూం%) ఏర్పాటుపై రైతులు ముందుకు రావాలని సూచించారు.
మండల హార్టికల్చర్ అధికారి అక్షిత రెడ్డి మాట్లాడుతూ...
అంతిమంగా
"రైతు కష్టపడితేనే దేశం ముందుకు సాగుతుంది. కానీ కష్టానికి సాంకేతికత జోడిస్తేనే ఫలితం పదింతలు పెరుగుతుంది. హార్టికల్చర్ రంగం రైతు జీవితాన్ని మార్చగల శక్తివంతమైన మార్గం. ప్రతి రైతు ఈ రంగంలో భాగస్వామ్యం కావాలి" అని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల హార్టికల్చర్ అధికారులు అక్షిత రెడ్డి, వ్యవసాయ విభాగ సిబ్బంది ఏ ఈ ఓ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి రవి , మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు సత్తార్ మార్గదర్శకాలను ఎంతో ప్రేరణాత్మకంగా స్వీకరించారు.
హార్టికల్చర్ రంగం రైతు భవిష్యత్తుకు కొత్త వెలుగు %-% కేసారం అవగాహన సదస్సు రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది అని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఉన్నత విద్యాభివృద్ధికి ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిష్లు దోహదం

### జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి



(సత్య మేవ జయతే బినారాయణ ఖేడ్ )పట్టుదలతో చదివి ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ సాధన దిశగా విద్యార్థులు నిరంతరం ప్రయత్నం చేయాలని జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి అన్నారు . గురువారం నాడు జడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్ పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవా వాలంటీర్ చంద్ర శేఖర్ ఆచార్య ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రిని అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులకు వివిధ స్కాలర్షిప్లు అందజేయడం కోసము అనేక పరీక్షలు ఉంటాయని అలాంటి పరీక్షలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ముందుకు సాగాలన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు 12వ తరగతి వరకు ప్రతి సంవత్సరం స్కాలర్షిప్లు అందజేస్తారన్నారు . ఈ కార్యక్రమంలో ఎంఈఓ విశ్వనాథ్ ,పాఠశాలల హెచ్ఎంలు మన్మధ కిషోర్ , యాదవ రెడ్డి , ఉపాధ్యాయులు యాదగిరి, రాజయ్య, రాజశేఖర్ ,చంద్రశేఖర్ ఆచార్య, ధన్ సింగ్ ,చరణ్ సింగ్ , సత్తయ్య,శంకర్ తదితరులు పాల్గొన్నారు .

సత్యమేవ జయతే



## డాక్టర్ డి. ఓంప్రకాష్‌కు ఘన సన్మానం



సత్య మేవ జయతే-నారాయణ ఖేడ్)ఇటీవల గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్న డాక్టర్ డి. ఓంప్రకాష్ గారిని గురువారం నారాయణఖేడ్ పట్టణంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ డిగ్గే బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ డిగ్గే బాబు మాట్లాడుతూ..డాక్టర్ ఓంప్రకాష్ గారు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండి పనిచేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు, రక్తదానం, మానవ హక్కుల పరిరక్షణ, సేవా కార్యక్రమాలతో పాటు అన్ని రంగంలో ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. నారాయణఖేడ్‌లో సామాజిక సేవ అనగానే గుర్తుకొచ్చేది ఓంప్రకాష్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ ఆనంద్, ఖైసార్, సురేష్ గౌడ్, పండరి, రాహుల్, నవీన్, రాకేష్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు

## రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు - ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి.



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..పూడూరు మండల కేంద్రంలో,రాకంచెర్ల గ్రామంలో మరియు సోమనుగుర్తిలో పత్తి కొనుగోలు కేంద్రాలను పరిగి ఎమ్మెల్యే %ద% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, వ్యవసాయ అధికారులు,రైతు సంఘ నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు పండించిన పత్తి పంటలను తప్పనిసరిగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని,ఎవరూ ప్రైవేట్ దళారుల వలలో పడకూడదని సూచించారు.రైతుల సమస్యలను అర్థం చేసుకుని, సరైన మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అహర్నిశలు కృషి చేస్తున్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రైతులకు ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని అన్నారు..

## దిల్లీలో 'కృత్రిమ వర్షం' ట్రయల్ సక్సెస్- ఎలా కురిపిస్తారు? కాలుష్యాన్ని ఆపొచ్చా?

: కాలుష్య కాసారంగా మారిన దేశ రాజధాని దిల్లీలో అతి త్వరలోనే కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు తొలి సారిగా ఆర్టిఫిషియల్ రెయిన్ కోసం ట్రయల్ సక్సెస్ అయినట్లు దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా వెల్లడించారు. అక్టోబర్ 28, 29,30 తేదీల్లో కృత్రిమ వర్షం కురిపించేందుకు అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకూలంగా జరిగితే దిల్లీలో తొలిసారిగా అక్టోబర్ 29న తొలిసారిగా కృత్రిమ వర్షం కురుస్తుందని ఆమె వెల్లడించారు. మరి ఇన్ని రోజులుగా కృత్రిమ వర్షానికి అడ్డంకిగా నిలుస్తున్న అంశాలు ఏమిటి? కృత్రిమ వర్షాన్ని ఎలా కురిపిస్తారు? ఎంత ఖర్చవుతుంది? దీని కురిపించే క్రమంలో ఏయే సవాళ్లు ఎదురవుతాయి? ఈ కథనంలో తెలుసుకుందాం.ఏటా దీపావళి పండుగ వచ్చిందంటే చాలు దిల్లీలో గాలి నాణ్యత బాగా తగ్గిపోతుంది. ఈసారి కూడా దీపావళి బాణసంచాల ఎఫెక్ట్‌తో దేశ రాజధానిలో గాలి నాణ్యత తీవ్ర ప్రతికూల స్థాయికి దిగజారింది. అక్కడి ప్రజలు పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి కూడా కరువైంది. దీంతో శ్వాసకోశ సమస్యలు, ఉబ్బసం, అలర్జీలు కలిగిన వారు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఈనేపథ్యంలో ప్రతీ ఏడాదిలాగే ఈసారి సైతం వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (జీఆర్‌ఏపీ)ను అమలు చేస్తున్నారు. దిల్లీలో నిర్మాణ పనులపై తాత్కాలిక నిషేధం విధించారు. వాహనాల రాకపోకలను పరిమితం చేయడానికి అనేక చర్యలు తీసుకున్నారు. కానీ ఈ కంటి తుడుపు చర్యలతో వాయుకాలుష్యం తగ్గేది అంతంత మాత్రమే. వాయుకాలుష్యాన్ని గణనీయ స్థాయిలో తగ్గించాలంటే, ప్రజలకు ఊరట కల్పించాలంటే కృత్రిమ వర్షాన్ని కురిపించాల్సిందే. గత కొన్ని దశాబ్దాల్లో దిల్లీలో ఏర్పడిన ప్రభుత్వాలన్నీ కృత్రిమ వర్షం ప్రతిపాదనపై చర్చించాయి. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేకపోయాయి. సాంకేతిక సమస్యలు, సంక్లిష్టమైన అనుమతి ప్రక్రియల వల్లే ఇలా జరిగింది.%ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో దిల్లీ అధికార పీఠాన్ని బీజేపీ చేపట్టింది. దిల్లీ పర్యావరణ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంజీందర్ సింగ్ సిర్సా కృత్రిమ వర్షాన్ని కురిపించి తీరుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎట్టకేలకు ఈ ఏడాది జూన్ మూడోవారంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గుడ్ న్యూస్ చెప్పింది. దిల్లీలో కృత్రిమ వర్షాన్ని కురిపించే ప్రతిపాదనకు ఐఎండీ పచ్చజెండా ఊపింది. ఉత్తరప్రదేశ్‌లోని ఐఐటీ కాన్పూర్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని మంజీందర్ సింగ్ సిర్సా అప్పట్లో వెల్లడించారు. ఈక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులనూ ఆయన పొందారు. దీనిపై విపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ నేత, దిల్లీ మాజీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ ఘాటుగా స్పందించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు దిల్లీలో కృత్రిమ వర్షాన్ని కురిపించే అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ మంత్రికి ఎన్నో లేఖలు రాశానని, వాటికి అస్సలు స్పందన రాలేదన్నారు.

"గత కొన్ని సంవత్సరాలుగా ఏటా దీపావళి తర్వాత దిల్లీలో గాలి నాణ్యతా సూచిక (ఏక్యూఐ) 500 దాటుతోంది. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో శ్వాస తీసుకోవడానికి కూడా జనం ఇబ్బందిపడతారు. ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలుగుతుంది. ఒకవేళ దిల్లీలో కృత్రిమ వర్షాన్ని కురిపిస్తే పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం) 2.5 కణాలు, పీఎం 10 కణాలు, సల్ఫర్ ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, బెంజీన్ వంటి విషపూరిత కారకాలు నేలపై పడిపోతాయి. దీనివల్ల వాయు కాలుష్య స్థాయిలు తాత్కాలికంగానైనా తగ్గుతాయి" అని కేంద్ర కాలుష్య నియంత్రణ కమిటీ సభ్యుడు, పర్యావరణ నిపుణుడు డాక్టర్ అనిల్ గుప్తా 'ఈటీవీ భారత్'కు వివరించారు.ఐఐటీ కాన్పూర్ ప్రకారం కృత్రిమ వర్షం కురిపించడానికి 11 ప్రభుత్వ విభాగాల అనుమతులను పొందాల్సి ఉంటుంది. ఈ జాబితాలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, రక్షణ శాఖ, హోం శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ), పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖ, దిల్లీ ప్రభుత్వం ఉన్నాయి. భారత విమానాశ్రయ అథారిటీ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, భారత వాతావరణ శాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, భారత పురావస్తు సర్వే విభాగం, విమానయాన శాఖ - పౌర భద్రతా బ్యూరోల నుంచి సైతం అనుమతులు తీసుకోవాలి.

# జల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయంం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.





**లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన పరిగి ఎమ్మెల్యే. రామ్మోహన్ రెడ్డి...**

సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా : పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో పరిగి ఎమ్మెల్యే%ద%డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ.24,02,784 విలువగల కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను స్థానిక నాయకులు, అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి. మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పలు ప్రజాప్రయోజన పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.అలాగే, అర్హులందరికీ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు..

## ప్రజా ప్రభుత్వం %-% పేదల ప్రభుత్వం, దొరలది కాదు : పల్వనూరి

**- వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ గారి కృషిని ప్రశంసించిన భీమ్ సోల్జర్స్ రాష్ట్ర అధ్యక్షులు**

**- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం %-% పేదల అభివృద్ధికి నిరంతరం కృషి**

**- ప్రజా సంబంధాల విభాగం**

**భీమ్ సోల్జర్స్ ఆర్గనైజేషన్, తెలంగాణ రాష్ట్రం**



సత్యమేవ జయతే - సంగారెడ్డి సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా మెరుగైన విద్య, వైద్యం అందించాలనే దిశగా ప్రభుత్వం అంకితభావంతో ముందుకు సాగుతోందని భీమ్ సోల్జర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపకులు పల్వనూరి శేఖర్ తెలిపారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు గౌరవ దామోదర రాజనర్సింహ గారు ప్రజా ఆరోగ్య రంగ అభివృద్ధి కోసం 540 కోట్ల రూపాయల బడ్జెట్‌ను తెచ్చి వైద్య రంగానికి కొత్త ఊపునిచ్చారని ఆయన ప్రశంసించారు. "ఇది ప్రజా ప్రభుత్వం ం పేదల ప్రభుత్వం, దొరలది కాదు" అంటూ పల్వనూరి శేఖర్ పేర్కొన్నారు.

**- పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి వాగ్దానాన్ని అంచెలంచెలుగా నెరవేర్చుతూ ముందుకు సాగుతోందని ఆయన అన్నారు.

"పేదలు, కార్మికులు, విద్యార్థులు, రైతులు %-% వీరందరి జీవిత స్థాయిని పెంచడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. దామోదర రాజనర్సింహ గారు ఈ దిశగా కృషి చేస్తున్నారు," అని తెలిపారు.

- బిఆర్‌ఎస్ పాలన పేదలపై నిర్లక్ష్య ధోరణి

- బిఆర్‌ఎస్ పార్టీపై విమర్శలు చేస్తూ పల్వనూరి శేఖర్ అన్నారు

-"బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి నియోజకవర్గంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామని హామీ ఇచ్చినా, ఆ హామీలను పూర్తిగా మర్చిపోయారు. పేదల సంక్షేమం కంటే వ్యక్తిగత అభివృద్ధికే ప్రాధాన్యత ఇచ్చారు. మాజీ మంత్రి హరీష్ రావు గారు కూడా సిద్దిపేట అభివృద్ధిని మాత్రమే గుర్తు చేసుకున్నారు, కానీ ఇతర జిల్లాలను పూర్తిగా విస్మరించారు."

"బిఆర్‌ఎస్ పాలనలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ లేకుండా, ప్రజల సమస్యలను వినే వ్యవస్థ స్తబ్ధమైపోయింది. అందుకే ప్రజలు బిఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారు," అని అన్నారు.

- ప్రతి జిల్లాలో ఆధునిక ఆసుపత్రులు ఏర్పాటు %-% మంత్రి సంకల్పం

ప్రస్తుత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారు ప్రతి జిల్లాలో 600 పడకలతో కూడిన ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని సంకల్పించి, అందుకు కావలసిన నిధులను కూడా కేటాయించడం అభినందనీయమని శేఖర్ పేర్కొన్నారు."మంత్రివర్యులు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కృతనిశ్చయంతో ఉన్నారు. ఆయన ఇచ్చిన మాట ఎప్పుడూ నిలబెట్టుకునే నాయకుడు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ-ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకురావడం దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిర్ణయం," అని శేఖర్ గుర్తు చేశారు.

**- దేశానికి ఆదర్శనేత దామోదర రాజనర్సింహ**

"బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ తర్వాత దేశం మెచ్చిన నేతగా ప్రజల సేవలో అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడు దామోదర రాజనర్సింహ గారే," అని పల్వనూరి శేఖర్ పేర్కొన్నారు.

"ప్రజల సమస్యల పరిష్కారానికి రాత్రింబవళ్లు కష్టపడే ఆయన నాయకత్వం రాష్ట్రానికి ఆశీర్వాదం. ఆయన చూపిస్తున్న మార్గం పేదలకు ఆశాజ్యోతి," అని అన్నారు.

**- బిఆర్‌ఎస్ నాయకులకు హితవు**

"అధికారం కోల్పోయిన నిరాశతో బిఆర్‌ఎస్ నాయకులు పిచ్చివాగుడు మానుకోవాలి. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విశ్వసించారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రంగంలో అభివృద్ధి సాధిస్తోంది," అని శేఖర్ స్పష్టం చేశారు.

- ప్రజా సేవే మా ధర్మం

"భీమ్ సోల్జర్స్ ఆర్గనైజేషన్ తరపున మేము పేదల సంక్షేమం కోసం ఎప్పుడూ ప్రజలతో ఉంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న ప్రజామార్గం ప్రతి వర్గానికి ఆశ కలిగిస్తోంది," అని పల్వనూరి శేఖర్ తెలిపారు.

## ఎకమామిడి - నవాబుపేట్ రోడ్డుపై దుమ్ము దూళి ధాటికి వాహనదారులు విసుగు - తక్షణ మరమ్మతులకు ప్రజల డిమాండ్





సత్యమేవ జయతే - వికారాబాద్ జిల్లా / నవాబుపేట్, అక్టోబర్ 23 : ఎకమామిడి నుండి నవాబుపేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం తీవ్రమైన దుస్థితిలో ఉంది. రోడ్డంతా గుంతలతో నిండిపోయి, రాళ్లు, కంకరలు చెల్లాచెదురుగా పడి ఉండటంతో వాహనదారులు ప్రతీ రోజు నరకయాతన అనుభవిస్తున్నారు. దుమ్ము దూళి కారణంగా రహదారి మొత్తం పొగమంచు మాదిరిగా మారి ప్రయాణం కష్టసాధ్యమైంది.

**ప్రజల శ్వాసకోశ సమస్యలు తీవ్రం:**

ఈ మార్గం గుండా ప్రతిరోజూ ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "రోజూ ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తుంటే శ్వాస తీసుకోవడమే కష్టంగా మారింది. కనీసం దుమ్ము తగ్గేందుకు నీళ్లు పోయే చర్యలు తీసుకోవడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు పక్కనుంచి వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు," అంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అధికారుల నిర్లక్ష్యం పట్ల తీవ్ర అసంతృప్తి:**

స్థానికులు చెబుతున్నారు - ఈ రోడ్డు దుస్థితిపై పత్రికల్లో అనేకసార్లు వార్తలు వచ్చినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత శాఖలు ఎటువంటి చర్యలు తీసుకోలేదని. "ఎన్ని సార్లు మన సమస్యను చెప్పినా స్పందన లేదు. అధికారులు ప్రజల సమస్యలపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు," అని వారు మండిపడ్డారు.

**తక్షణ చర్యలకు ప్రజల విజ్ఞప్తి:**

రోడ్డు మరమ్మతులు చేయించి, దుమ్ము తగ్గించే చర్యలు తక్షణమే చేపట్టాలని ప్రభుత్వం, రోడ్డు భద్రతా శాఖలకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.ప్రతిరోజూ వందలాది వాహనాలు సంచరించే ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు జరగకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వారు హెచ్చరించారు.స్థానిక ప్రజలు అధికారులను వెంటనే స్పందించి రహదారిని సరిదిద్దాలని, ప్రజా సమస్యలను పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బచ్చన్నపేటలో ఉపాధిహామీ-సామాజిక తనిఖీ ప్రజావేదిక



సత్యమేవ జయతే - బచ్చన్నపేట బచ్చన్నపేట : బచ్చన్నపేట మండలం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. 2024 ఆగస్ట్ 2025 వరకు రూ.5 కోట్లతో జరిగిన వివిధ పనులపై బృందాలు తనిఖీలు నిర్వహించారు. డీఆర్డీవో చంద్రశేఖర్ సామాజిక తనిఖీ వేదికలో పలు అంశాలపై మాట్లాడారు. సభ్యులు తనిఖీ నివేదికలను అధికారులకు చదివి వినిపించారు. పంచాయతీ కార్యదర్శులు, టీఏలు సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్నారు.

పలు గ్రామాల్లో అన్ని రిజిష్టర్‌లను మెయింటైన్ చేయడం లేదని తెలిపారు. అనంతరం డీఆర్డీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తనిఖీల్లో పనులు జరిగిన చోట ఫీల్డ్ అసిస్టెంట్లు మొబైల్ ఆన్‌లైన్ చేయడంపై కొందరు 85 శాతం వరకు పనిచేస్తే.. మరికొన్ని గ్రామాల్లో కొందరు 10 శాతం పనులను మాత్రమే ఆన్‌లైన్ చేశారు. నిర్లక్ష్యం చేసిన కార్యదర్శులకు, సీసీలు ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు.

రికార్డుల పరంగా రూ.2,78,651 పెనాల్టీ రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అంబికా సోనీ, ఎంపీడీవో మమతా బాయ్, ఎంపీవో మల్లికార్జున్, డీవీసీ సంధ్యా ప్రణయ్, క్యూసి శాఖ రాజవర్ధన్, ఎస్ఆర్పి నరేందర్, ఈసీ శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో కృష్ణ , కార్యదర్శిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### పదవ తరగతి పరీక్షల ఫీజు షెడ్యూల్



సత్య మేవ జయతే - తెలంగాణహైదరాబాద్:అక్టోబర్ 23

తెలంగాణ రాష్ట్రంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి-2026 కు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ప్రభుత్వం షెడ్యూల్ గురువారం విడుదల చేసింది.పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్ విద్యార్థులు, అలాగే ఇదివరకు ఫెయిల్ అయిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవడానికి ఈ గడువులను ప్రకటించారు.

లేట్ ఫీజు లేకుండా ఫీజు చెల్లించడానికి అక్టోబర్ 30, నుండి నవంబర్ 13, వరకు గడువుగా నిర్ణయించారు. విద్యార్థులు కట్టిన మొత్తా న్ని పాఠశాల హెచ్ఎంలు ఈ ఫీజును నవంబర్ 14 లోపల ట్రెజరీకి అంద చేయాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు హెచ్ఎంలకు నవంబర్ 18, 2025 వరకు గడువు ఇవ్వబడింది.

వీటితోపాటు లేట్ ఫీజు చెల్లింపులకు సంబంధించిన గడువులు కూడా ప్రకటించారు. రూ. 50 లేట్ ఫీజుతో నవంబర్ 15 నుండి నవంబర్ 25 వరకు ఫీజు చెల్లించవచ్చు. రూ. 200 లేట్ ఫీజుతో నవంబర్ 29 నుండి డిసెంబర్ 12 వరకు చెల్లింపులు చేయవచ్చు. ఇక రూ. 500/- లేట్ ఫీజుతో అయితే, డిసెంబర్ 15 నుండి డిసెంబర్ 29 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. డీజీఈ కార్యాలయం ఈ గడువు లను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించబోమని స్పష్టంగా త

## ఎంజీయూ బీఈడీ పలు సెమిస్టర్ ఫలితాలు విడుదల



సత్యమేవ జయతే - నల్గొండ నల్గొండ : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ బీఈడీ పలు సెమిస్టర్ ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఈడీ కళాశాలలో చదివే బీఈడీ ఛాత్రోపాధ్యాయులకు సెప్టెంబర్ 2025లో నిర్వహించిన పలు సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను వర్సిటీలో వీసీ ప్రొ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్టర్ ప్రొఫెసర్ అల్వాల రవితో కలిసి సీవోఈ డా.జి.ఉపేందర్‌రెడ్డి విడుదల చేశారు. 4వ, 2వ సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్, 1, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ %ఎ.ఎమ్యుఎజబవఠీంఉ.ఎ.ఐ అఅ% లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీవోఈ మాట్లాడుతూ.. రివాల్యూయేషన్ కోసం దరఖాస్తు ఫలితాలు వెల్లడించిన నాటి నుండి 15 రోజుల్లో కళాశాలల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సీవోఈలు డా.లక్ష్మీప్రభ, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ ప్రవళిక, డాక్టర్ రామచంద్రం, పరీక్షల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులతో యువత భాగస్వామ్యం కావాలి : సీపీ అంబర్ కిషోర్ ఝూ

సత్యమేవ జయతే - మంచిర్యాల

మంచిర్యాల : యువత పోలీసులతో భాగస్వామ్యం కావాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించి రిసెప్షన్ కానిస్టేబుల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్సై, సిబ్బందికి సూచించారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసే విభాగం పోలీస్ విభాగం ఒక్కటేనని అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఆనంతరం సీపీ మాట్లాడారు.

నేటితరం యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాలను విడనాడాలని కోరారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఎ బాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ



రవికుమార్, తాండూర్ సీఐ దేవయ్య, తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య, సిబ్బంది ఉన్నారు.

## కోటగిరిలో తరుగుపేరిట కోతలు విధిస్తున్నారని ప్రధాన రహదారి పై రైతుల ధర్నా రాస్తారోకో

- తరుగు పేరిట రైతులను నష్ట పరిస్తే సహించేది లేదంటూ హెచ్చరిక
- రెండు గంటల పాటు రోడ్డు పై బైఠాయించిన రైతులు.. స్తంభించిన రాకపోకలు
- పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన రైతు
- పురుగుమందు డబ్బా లాక్కున్న పోలీసులు



సత్యమేవ జయతే - నిజామాబాద్ నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లో వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో రైతులకు జరుగుతున్న మోసం పట్ల రైతులు మరోసారి రోడ్డు ఎక్కారు.. కోటగిరి మండల కేంద్రంలో సుమారు 200 మంది రైతులు కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలలో తరుగు పేరిట రైతులకు దోపిడీ చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కోటగిరి-పోతంగల్ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించారు.

సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో బస్తా 41 కిలోల వడ్లు తూకం పెట్టాల్సి ఉండగా అదనంగా అర కిలో చొప్పున తరుగు తీస్తున్నారాని దింతో పాటు లారీ రైస్ వెళ్లిన తర్వాత కూడా అక్కడ రైతును పిలిచి, బియ్యం ఉతారు రావడంలేదని మళ్లీ అదనంగా తరుగు తీస్తామని నిబంధనలు పెట్టి మిల్లర్లు రైతులకు బెదిరిస్తున్నారని రైతులు వాపోయారు. తహసీల్దార్ మా రైతుల దగ్గరికి వచ్చి తమకు న్యాయం జరిగేలా భరోసా కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. ఇంతసేపటికి తహసీల్దార్ రాకపోవడం వల్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రాకపోకలు స్తంభించాయి. ఈ విషయం తెలుసుకున్న కోటగిరి ఎస్సై సునీల్ పోలీసు సిబ్బంది తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు.

ఆందోళన విరమించాలని ఎస్సై రైతులు నచ్చజెప్పినా వినకుండా తమకు అన్యాయం జరిగిందని, తరుగు పేరిట రైతులకు దోపిడీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ వచ్చి తమకు న్యాయం చేయాలని, పూర్తి హామీ కల్పించాలని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. అంతలోనే ఓ రైతు పురుగుల మందు తాగేందుకు యత్నం చేశారు. అంతలోనే పోలీస్ లు మందు డబ్బా లాక్కున్నారు. అనంతరం ఎస్సై సునీల్ తహసీల్దార్ తో మాట్లాడడం తో తహసీల్దార్ గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకొని రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. మొన్నటి వరకు 41 కిలోలు కాంట చేశారని, నాలుగు రోజుల నుండి తరుగు పేరిట 41.500 కాంట చేస్తున్నారని బస్తాకు అదనంగా 500 గ్రా. తరుగు తీస్తున్నారని రైతులు మండిపడ్డారు.

రైస్ మిల్లర్లతోసమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడి తరుగు లేకుండా చేస్తామని తహసీల్దార్ గంగాధర్ హామీ ఇవ్వడం తో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో తెల్ల రవికుమార్, ఏముల నవీన్, మామిడి శ్రీనివాస్, తెల్ల చిన్న అరవింద్, అంబాటి గంగ ప్రసాద్ గౌడ్, రమణ, వాసుబాబు, సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి : కలెక్టర్ సంతోష్

సత్యమేవ జయతే - జోగులాంబ గద్వాల్

జోగులాంబ గద్వాల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. ఇటిక్యాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు నాణ్యమైన సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. ఓపీ , ఐపీ రోగుల వైద్య సేవలు మరింత మెరుగ్గా పరచాలని తెలిపారు. ఆసుపత్రుల్లో వంద శాతం నార్మల్ డెలివరీలు చేయాలన్నారు. గర్భిణీలకు అవగాహన కల్పించి, అవసరమైన ఐరన్, కాల్షియం టాబ్లెట్లు సమయానికి అందించాలన్నారు.హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న గర్భిణీలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణీల పల్స్ రేట్ చెకప్, స్కానింగ్ సమయానికి జరిగేలా చూసి, వారిని సమయానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చేలా ఉండేలా ప్రోత్సహించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలను



సమర్థవంతంగా వినియోగించాలన్నారు. బేబీ వార్డ్, స్టెరిలైజేషన్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. గ్రామాల్లో 30 సంవత్సరాలకు పైబడిన వారిని గుర్తించి వారిలో లో బీపీ, షుగర్ లాంటి వ్యాధులను గుర్తించి అవసరమైన మందులు అందజేయాలన్నారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి భూ భారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర భద్రప్ప, డాక్టర్ అనిరుధ్, రెవిన్యూ, వైద్య సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ నరసింహ

సత్యమేవ జయతే - హుజూర్‌నగర్ హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 25న ప్రభుత్వ ఆధ్వర్యంలో 250 కంపెనీలతో నిర్వహించే మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. జాబ్ మేళాకు సంబంధించి పోలీస్ బందోబస్తు, భద్రత ఏర్పాట్లను గురువారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 వేలకు పైగా యువతీ యువకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎక్కడా అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. యువత నైపుణ్యం ఉన్న రంగం వైపు వెళ్లి విజయం సాధించాలని తెలిపారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ప్రతాప్ లింగం, సర్కిల్ ఎస్ఐలు మోహన్ బాబు, నరేశ్, రవీందర్, బాబు, కోటేశ్ ఉన్నారు.



### ఎయిమ్స్ డైరెక్టర్‌గా అమితా అగర్వాల్ బాధ్యతల స్వీకరణ






సత్యమేవ జయతే – బీబీనగర్ బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్‌గా అమితా అగర్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డైరెక్టర్‌గా పనిచేసిన వికాస్ భాటియా బదిలీపై వెళ్లగా అమె పూర్తిస్థాయి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అమితా అగర్వాల్‌కు ఎయిమ్స్ అధ్యాపకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎయిమ్స్ అభివృద్ధితో పాటు విద్య, ఆరోగ్య సంరక్షణలో సంస్థాగత వృద్ధి సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎయిమ్స్ వైద్యులతో ఆమె సమావేశం నిర్వహించారు.

### లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.
పరిగి పట్టణంలోని ప్రజాభవన్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరిగి ఎమ్మెల్యే%ఠ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పరిగి మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన 10 మంది లబ్ధిదారులకు రూ.10,01,160 విలువగల 'కళ్యాణ లక్ష్మి' మరియు 'షాదీ ముబారక్' చెక్కులను స్థానిక నాయకులు, అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు.

### నవంబర్ 6వ తేదీలోగా అన్ని డిగ్రీ కోర్సుల ఇంటర్నల్, ప్రాక్టికల్ పరీక్షలు : ప్రొఫెసర్ శశికాంత్



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల ఇంటర్నల్, ప్రాక్టికల్ పరీక్షలను వచ్చే నెల 6వ తేదీలోగా నిర్వహించాలని ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ తదితర అన్ని కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెండవ ఇంటర్నల్ పరీక్షలతో పాటు ప్రాక్టికల్, ప్రాజెక్ట్, వైవా పరీక్షలను త్వరితగతిన నిర్వహించాలని సూచించారు.
వచ్చే నెల 6వ తేదీ సాయంత్రం అయిదు గంటలలోగా ప్రాక్టికల్ మార్కుల జాబితాను ఓయూ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఆ తరువాత కళాశాల లాగిన్ ముగిసిపోతోందని చెప్పారు. ఏవైనా సందేహాలుంటే టెక్నికల్ సపోర్ట్ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

### హైదరాబాద్‌లో రూ. 2.70 కోట్ల విలువైన గంజాయి సీజ్



సత్యమేవ జయతే – హైదరాబాద్
హైదరాబాద్ : బండ్లగూడలో గంజాయి సరఫరా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 2.70 కోట్ల విలువైన 908 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులు మొహమ్మద్ ఉద్దీన్, షేక్ సోహైల్, మొహమ్మద్ అఫ్జల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన మహేశ్ గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయిని సంచుల్లో నింపి జీడిపప్పు కింద దాచిపెట్టి తరలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గంజాయి సరఫరాలో రెహమాన్ ప్రధాన రవాణాదారుడిగా గుర్తించారు. నిందితుల నుంచి కారు, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా చిన్ననాటి స్నేహితులుగా దర్యాప్తులో తేలింది.

## విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి : అడిషనల్ కలెక్టర్ సుధీర్

సత్యమేవ జయతే – రంగారెడ్డి
రంగారెడ్డి : విద్యార్థులకు అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను డీఈవో రేణుకాదేవి, డీటీడబ్ల్యూవో కమలాకర్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు అన్ని విధాలుగా వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. అన్ని వసతులు సక్రమంగా ఉన్నప్పుడే విద్యార్థులు చక్కగా



చదువుతారని పేర్కొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంకేమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. డార్మెం టరీ, క్లస్‌మెంట్, కిచన్ వంటి వాటిలో ఏమైన రిపేర్లు ఉంటే ఫైల్ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌వో దేవి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కులకచర్ల కేవీఎం పాఠశాలను సందర్శించిన వారు పాఠశాలలో విద్యార్థుల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబీబ్‌హైమద్, పాఠశాల కరస్పాండెంట్ కరణం ప్రహ్లాద్‌రావు పాల్గొన్నారు.

## రక్తహీనత, పోషణా లోపం లేని మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్ రాహుల్ రాజ్

సత్యమేవ జయతే – మెదక్
మెదక్ : పోషన్ అభియాన్ జాతీయ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషణ్ మాసం కార్యక్రమాన్ని శ్రీ శిశు సంక్షేమ శాఖ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంపూర్ణ ఆహారం, పిల్లలు ఆడుకునే బొమ్మలు, ప్రకృతిలో దొరికే ఆకుకూరలు, పిండి పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. రక్తహీనత, పోషణ లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తే పెళ్లికొడుకు, తల్లిదండ్రులు, బంధుమిత్రులు, అంగన్‌వాడీ ఏఎన్‌ఎంలను జైల్లో వేస్తామన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుండి ప్రసవం అయిన తర్వాత వైద్య పరంగానే కాకుండా.. పోషణ పరంగా కూడా ప్రభుత్వం శ్రద్ధ పెడుతుందన్నారు. అంగన్వాడీ సెంటర్లలో ప్రతి రోజు కోడిగుడ్లు, పాలు ఇస్తున్నారని%ొ% వాటి ద్వారా కడుపులో ఉన్న బిడ్డలకు పోషకాహారం అందాలని%ొ% తెల్లటి అన్నం మాత్రమే తినడం వల్ల రక్తం రాదని.. ప్రతి మహిళ ప్రసవానికి బిడ్డకు.. బిడ్డకు కనీసం మూడు సంవత్సరముల గ్యాప్ ఉండాలన్నారు.
– ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో..
గర్భిణీలు,బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రంలోని పాలు, గుడ్లు ఆహారం తీసుకోవాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, మహిళలు, కిషోర బాలికలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోషణ మాసం నిర్వహిస్తున్నమన్నారు.





ఇందులో భాగంగా ఆరోగ్యజీవనానికి కావాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ మహిళలు, గర్భిణీల శిశువుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.
రక్త హీనత లేకుండా చూడడంలో మరింత దృష్టి పెట్టాలని..
గర్భిణీ లకు ఇస్తున్న ఆహారాన్ని వారు మాత్రమే తినాలని..
ఇతరులు తీసుకోవద్దన్నారు. నిర్ణీత గడువులోపు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న చిన్న పిల్లలను చూసుకోవడంలో అంగన్వాడీ టీచర్లు బాధ్యతయుతంగా ఉంటారని.. అందుకు వారిని అభినందించాలన్నారు. ప్రీ ప్రైమరీ విద్యకు సంబంధించి.. ఎలా భోదిస్తే పిల్లలకు సులభంగా అర్థమవుతుందో.. అలాగే అంగన్వాడీ టీచర్లు చెప్పాలన్నారు.
– గర్భిణీలకు, శిశువులకు ఆరోగ్యం పట్ల అవగాహన పెరగాలి..
పోషణ మాసంలో భాగంగా జరిగే కార్యక్రమాల ద్వారా గర్భిణీలకు, శిశువులకు మంచి ఆరోగ్యం పట్ల అన్ని అంశాల మీద అవగాహన పెరగాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, ఐరన్ టాబ్లెట్లు వేసుకోవడం, ఫీడింగ్ విషయంలో జాగ్రత్తల మీద అందరికి అవగాహన ఉండాలన్నారు. గర్భిణి స్థాయి నుండి బిడ్డకు 3 సంవత్సరాలు వచ్చే వరకు ఆ మహిళను జాగ్రత్తగా చూసుకుంటేనే వారి ఆరోగ్యానికి మంచి పునాది వేసినట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చివరగా శ్రీశిశు సంక్షేమ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. బాల్య వివాహాలు నిలిపివేయాలంటూ బ్యానర్‌ను ఆవిష్కరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలకు శ్రీమంత కార్యక్రమము నిర్వహించారు.
ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, అడిషనల్ డిఆర్డిఓ , ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని, విజయలక్ష్మి, ఎంసిహెచ్‌డీఎంఈ లు, విజయనిర్మల, జయలక్ష్మి , జిల్లాలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్యాలకు చుట్టాలుగా కార్మిక చట్టాలు.. కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ పోరాటాలు : అతిమేల మానిక్

సత్యమేవ జయతే – పటాన్ చెరు పటాన్ చెరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ కార్మికుల ఉరితాళ్లుగా మారుతున్నాయని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్ అన్నారు. గురువారం పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ లో జరిగిన సీఐటీయూ కార్యకర్తల సమావేశానికి అతిమేల మానిక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.
కార్మిక పోరాటాల సారథి సీఐటీయూ సంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు అక్టోబర్ 19న సదాశివపేట పట్టణంలో విజయవంతంగా జరిగాయి. ఈ మహాసభల్లో జిల్లాలో కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవడం జరిగిందని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో 14 తీర్మానాలు చేసామని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులకు ఉరితాళ్లుగా మారుతున్నాయని అన్నారు. కార్మికులకున్న చట్టాలను హక్కులను రద్దుచేసి లేబర్ కోడ్స్ గా మార్చి పెట్టబడుదారుల ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమల్లో కనీస వేతనాలు గత 11 సంవత్సరాలుగా సవరించడం లేదని అన్నారు. ఈ కాలంలో 200 శాతం పైగా నిత్యవసర సరుకుల ధరలు పెరిగి కార్మికుల బ్రతుకులపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26,000 పెంచాలని సీఐటీయూ డిమాండ్ చేస్తుంది అని అన్నారు.
**– యాజమాన్యాలకు చుట్టాలుగా కార్మిక చట్టాలు..**
జిల్లాలో సుమారు 1375 పరిశ్రమల్లో లక్ష 80 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని అందులో అత్యధికంగా లక్ష ఇరవై వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. వీరికి కనీసవేతనాలు వీడీఏ ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, ఈఎల్స్, గ్రాట్యుటీ, యూనిఫామ్, షూ, క్యాంటీన్ ట్రాన్స్ఫోర్ట్ గుర్తింపు కార్డులు,





పేస్లిప్పులు వంటి చట్టపరమైన సౌకర్యాలు ఎక్కడ అమలు కావడం లేదని అన్నారు.కార్మికులకు చట్టాలు ఉన్నా యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులకు 12 గంటలు పనిచేస్తూ చట్టపరమైన సౌకర్యాలు కల్పించకుండా ఓటీ డబుల్ కట్టివ్వకుండా యాజమాన్యాలు తీవ్ర శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయని అన్నారు. సిగాచి ఘోర ప్రమాదం జరిగి నాలుగు నెలలు అవుతున్నా బాధిత కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందలేదని అన్నారు. తక్షణమే ఒకే విడతలో మిగతా 75 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులపై పని ప్రదేశాల్లో జరుగుతున్న లైంగిక వేధింపులతో దినదిన గండంగా బతుకుతున్నారని అన్నారు.మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమాన వేతనం, ప్రసూతి సెలవులు అమలు కావడం లేదని అన్నారు. స్కీమ్ వర్కర్లు, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, ఎన్ఆర్‌ఎచ్‌ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు వివిధ ప్రభుత్వ శాఖల్లో గత అనేక సంవత్సరాలు పనిచేస్తున్నా చట్టపరమైన సౌకర్యాలు అమలు కావడం లేదని, నెల నెల జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.
– ఏడు డిస్పెన్సరీలో సరిపోను డాక్టర్లు లేరు..
సంగారెడ్డి జిల్లాలో రామచంద్రపురం ఈఎస్ఐ హాస్పిటల్, ఏడు డిస్పెన్సరీలో సరిపోను డాక్టర్లు లేరని, తీవ్రమైన మందుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ గ్రామపంచాయతీ మిషన్ భగీరథ కార్మికులకు నెలనెల జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భవన నిర్మాణం ట్రాన్స్‌పోర్ట్ హమాలి వంటి అసంఘటిత రంగ కార్మికుల సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికుల హక్కుల సాధన కోసం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.సదాశివపేటలో జరిగిన సీఐటీయూ జిల్లా 4వ మహాసభలో 58 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నాం. 17 మందితో జిల్లా ఆఫీస్ బేరర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం నుండి సీఐటీయూ నూతన జిల్లా కమిటీ సభ్యులుగా శాంత కుమార్, సుధాకర్, రాజు ఎన్నికైనారని అన్నారు. ఈ సమావేశంలో పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ నాయకులు రాజు, సుధాకర్, వెంకటేష్, మహేశ్వర్ రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్, రోషన్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాథాలజిస్టుకు కొత్త జీవితం.. నిమ్స్‌లో విజయవంతంగా పీఏడీఎన్ చికిత్స

సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : సంవత్సరాల తరబడి గుండె జబ్బు, ఆయాసంతో బాధపడుతున్న ఓ మహిళకు నిమ్స్ వైద్యులు అత్యాధునిక వైద్య విధానంతో కొత్త జీవితాన్ని ప్రసాదించారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైకి చెందిన వెంకటనాగ శార్వాణి (30) పాథాలజిస్టుగా పనిచేస్తున్నారు. చిన్నప్పుడే ఆమె గుండెకు రంధ్రం పడింది. సరైన చికిత్స తీసుకోకపోవడంతో కొంత కాలంగా గుండె నొప్పి, ఆయాసంతో బాధపడుతున్నారు. గత పదేండ్లుగా నిమ్స్ దవాఖానలోని కార్డియాలజి విభాగంలో చికిత్స తీసుకుంటున్నారు. వైద్య పరిభాషలో ఆమెకు ఎసిమెంజర్స్ సింద్రోమ్, సబ్‌సిస్టమిక్ పల్మనరీ హైపర్‌టెన్షన్ అంటారు. ఈ సమస్య ఉన్న వారికి శాశ్వత చికిత్స కేవలం గుండె మార్పిడిమాత్రమేనని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య వల్ల రోగి ఊపిరితిత్తులకు వెళ్లే నరాల్లో రక్త సరఫరాపై అధిక ఒత్తిడి కలుగుజేస్తుంది. ఫలితంగా హార్ట్ ఫేయిల్యూర్ అయ్యే అవకాశం కూడా ఉందంటున్నారు.
అత్యాధునిక పరికరాలు సంతరించుకున్న నిమ్స్ దవాఖానలో అరుదైన చికిత్స విధానం ద్వారా రోగి ఉపశమనం కలిగించారు. నిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రామకుమారి నేతృత్వంలో డాక్టర్ నూషా దొడ్డి, డాక్టర్ ఉమా దేవి, కరూరు, డాక్టర్



అజేయ కాశ్యమ్, డాక్టర్ ఎం. మౌనిక, డాక్టర్ పి. వినయ్ కుమార్, డాక్టర్ కె. భరత్ రెడ్డి, డాక్టర్ నరేశ్ నాయుడు, డాక్టర్ చంద్రకాంత్‌ల బృందం నాలుగు గంటల పాటు శ్రమించి విజయవంతంగా చికిత్సను నిర్వహించారు. త్రీడి మ్యాపింగ్‌ను ఉపయోగించుకొని ఆధునిక పల్మనరీ ఆర్టరీ డీనర్వేషన్ ప్రక్రియ ద్వారా గుండే నుంచి ఊపిరితిత్తులకు మధ్య ఉండే నరాలకు క్యాథటర్ ద్వారా విద్యుత్ తరంగాలను ప్రసరింప చేసి రక్త సరఫరాను క్రమబద్దీకరించి ఒత్తిడిని తగ్గించారు. దీంతో రోగి పూర్తిగా కోలుకున్నారు. ప్రపంచంలో కేవలం 200 మందికి మాత్రమే ఈ తరహా చికిత్సలు నిర్రవహించారని, భారతదేశంలో సైతం ఆరు కేసులు మాత్రమే అయ్యాయని, నిమ్స్‌లో తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఈ చికిత్స నిర్వహించామని వైద్యులు తెలిపారు.

# దట్టమైన అడవుల్లోకి సఫారీ

**అనగనగా ఓ ఊరు.. పచ్చదనం దండిగా ఉన్న ప్రాంతం.. కాలక్రమంలో ఆ ఊరు పట్టణమైంది.. మహానగరమైంది.. ఆ తర్వాత రాష్ట్ర రాజధానిగా అవతరించింది.. ఇంకేముంది.. నగరీకరణ పుణ్యాన ఆ ఊరు అందం పోయిందనుకుంటాం.. అక్కడ పచ్చదనం కనుమరుగైందని భావిస్తాం. కానీ, ఈ నగరంలో ఓ వనం వెలిసింది. దట్టమైన అడవి పుట్టుకొచ్చింది. అందులోకి పులులొచ్చాయి. ఎలుగులు వచ్చాయి. సింహాలు వచ్చాయి. ఇప్పుడు వాటిని చూసేందుకు పర్యాటకులూ వస్తున్నారు.. ఆ సంగతులు తెలుసుకుందాం..**





సాధారణంగా సఫారీ అనగానే ఎవరైనా ఎక్కడికి వెళ్తారు? దట్టమైన అడవుల్లోకి! కానీ, ఇప్పుడు మనం నగరం నడిబొడ్డున సఫారీ చేయబోతున్నాం. పులులు, సింహాలు, ఎలుగుబంట్లు, జింకలు, దుప్పులు ఇంకా ఎన్నో! అలాగని ఇది జంతు ప్రదర్శనశాల కాదు. సిసలైన, దట్టమైన అభయారణ్యం. ఓ రాష్ట్ర రాజధానిలో ఇది ఉందంటే సంభ్రమాశ్చర్యాలకు లోనవుతాం. మనం మాట్లాడుకుంటున్నది నయా రాయ్‌పూర్ గురించి. ఛత్తీస్‌గఢ్ రాజధాని నగరమిది. జనారణ్యం మధ్యలో 800 ఎకరాల్లో విస్తరించిన అడవి పేరు 'నందన్‌వన్'. రాయ్‌పూర్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఒకప్పుడు నగర శివారులో ఉండేదీ వనం. విస్తీర్ణమూ తక్కువే! ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత.. రాయ్‌పూర్ రాజధానిగా ఏర్పడిన తర్వాత.. ఈ ప్రాంతం నలుదిశలా అభివృద్ధి చెందింది. నయా రాయ్‌పూర్ రాజధాని శోభను సంతరించుకునే క్రమంలో ఖారున్ నదీ తీరంలోని నందన్‌వన్‌ని విస్తరించాలని భావించింది అక్కడి ప్రభుత్వం. అలా మానవ నిర్మిత అందాల వనం విస్తీర్ణం 800 ఎకరాలకు చేరింది. 2016లో ప్రారంభమైంది. అడవి పెరిగితే మాత్రం.. అందులోకి వన్యమృగాలు రావాలని ఏముంది? ఒకప్పుడు మినీ జూగా ఉన్న నందన్‌వన్‌లోకి గాయపడిన, దారితప్పిన జంతువులను తీసుకొచ్చి ఉంచేవారు. ఇప్పుడక్కడో జంతులోకం కనిపిస్తుంది. ప్రత్యేకంగా జోన్లు ఏర్పాటు చేసి వన్యమృగాలు స్వేచ్ఛగా విహరించే ఏర్పాటు చేశారు. అనతికాలంలోనే పులులు, సింహాలు, ఇతర జంతువులతో అరుదైన జీవ వైవిధ్యాన్ని సంతరించుకుంది. ఈ అడవిని చూసేందుకు పర్యాటకుల రాక మొదలైంది. సెలబ్రిటీలు సైతం వచ్చి సేదతీరడం మొదలైంది. అప్పట్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓ పులిని ఫొటో తీస్తున్న ఛాయాచిత్రం వైరల్ అయింది గుర్తుందా? అది నందన్‌వన్‌లోనిదే. వనంలో విహరించడానికి, జంతు ప్రపంచాన్ని చుట్టి రావడానికి నాలుగు రకాల సఫారీలు అందుబాటులోకి తెచ్చారు.

**ఎలుగుల చుట్టూ:** బేర్ సఫారీ నందన్‌వన్‌లో ప్రత్యేకం. ఐదు రకాలకు చెందిన ఎలుగులను ఇందులో చూడొచ్చు. యాభై ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎలుగుబంట్ల జోన్‌లో బస్సులో విహరిస్తూ.. వాటి విన్యాసాలను చూడొచ్చు.

**చేరుకునేదిలా:** రాయ్‌పూర్ నుంచి 25 కి.మీ. దూరంలో ఉన్న నయా రాయ్‌పూర్ మధ్యలో ఉంటుంది నందన్‌వన్. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు రైళ్లున్నాయి. అక్కడి నుంచి బస్సులు, ట్యాక్సీల్లో నందన్‌వన్ చేరుకోవచ్చు.

హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్‌కు నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి.

**సింహం ముందు బోనులో:** సాధారణంగా బోనులో ఉన్న సింహాన్ని చూడాలంటేనే కాస్త భయం కలుగుతుంది. అదే బోనులో ఉండి.. సింహాన్ని చూడాలంటే.. మన కళ్ల ముందు వనరాజు ఘనంగా విహరిస్తుంటే.. ఎలా ఉంటుందో ఊహించుకోండి. లయన్ సఫారీలో భాగంగా 50 ఎకరాల్లో విస్తరించిన సింహాల అడ్డాను చుట్టి రావొచ్చు. చిట్టి సింహాల సరదా ఆటలను చూడొచ్చు. పెద్ద సింహం దర్పాన్ని దర్శించవచ్చు. జూలు విదిల్చిన మృగరాజు హుందాతనాన్ని దగ్గరగా చూడొచ్చు.

**పులులను దగ్గరగా:** నందన్‌వన్‌లో అందరినీ ఆకర్షించేది టైగర్ సఫారీ. మృగాలు దాడి చేయకుండా ఇనుప జాలీలు ఏర్పాటు చేసిన బస్సులో సఫారీ ఉంటుంది. అయినా.. గంభీరంగా అడుగులు వేసే పులిని దగ్గరగా చూడాలంటే కాస్త ధైర్యం కావాలి. దట్టమైన అడవి మధ్యలో రాజసంగా కూర్చున్న పులి కంటపడగానే ఆశ్చర్యం కలుగుతుంది. అందులో నుంచి తేరుకోకముందే మరో పులి గాండ్రిస్తూ అటుగా వస్తుంది. ఇలా పులుల లోకంలో కాసేపు విహరించి మరపురాని జ్ఞాపకాలను తోడు తెచ్చుకోవచ్చు.

**చుట్టుపక్కల**

మనదేశంలో ప్రణాళిక బద్ధంగా నిర్మించిన నగరాల్లో రాయ్‌పూర్ ఒకటి. ఈ ఆధునిక పట్టణంలో పర్యాటక ఆకర్షణలు ఎన్నో ఉన్నాయి. వివేకానంద సరోవర్, గాంధీ ఉద్యానవనం, సెంట్రల్ పార్క్, దూధాధారీ ఆలయం తదితర ప్రాంతాలు నగర పరిసరాల్లోనే ఉంటాయి. ఛత్తీస్‌గఢ్ ఖజురహోగా పేరొందిన భోరందేవ్ ఆలయం.. రాయ్‌పూర్‌కు 135 కి.మీ. దూరంలో ఉంటుంది. అపురూప శిల్ప సంపద ఈ ఆలయం సొంతం.

**హరిణ ప్రపంచం:** ఈ వనంలో వందల సంఖ్యలో శాఖాహార జంతువులు ఉన్నాయి. జింకలు, దుప్పులు, రకరకాల హరిణాలు వందల సంఖ్యలో విహరిస్తుంటే.. చూడటానికి రెండు కళ్లు సరిపోవు. రెండు కిలోమీటర్లు సాగే హెర్బివోర్ సఫారీలో వనజీవుల స్వేచ్ఛాజీవనాన్ని చూసి మురిసిపోకుండా ఉండలేం.

సఫారీ ధర రూ.300 (ఏసీ బస్సు), రూ.200 (నాన్ ఏసీ బస్సు)

పిల్లలకు (6-12 ఏళ్లు) రూ.100 (ఏసీ బస్సు), రూ.50 (నాన్ ఏసీ బస్సు)

ఆరేళ్లలోపు చిన్నారులకు ఉచితం

ఈ వనంలోనే బోటింగ్ సౌకర్యమూ ఉంది. 130 ఎకరాలు విస్తరించిన సరస్సులో విహారం అద్భుతంగా ఉంటుంది. వలస వచ్చిన పక్షుల సోయగాలనూ చూడొచ్చు.

సఫారీ తర్వాత మొసళ్ల ఎన్‌క్లోజర్ సందర్శించవచ్చు. అడవిలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నారు.



# మలంగి.. మనసాగదండి! వారాంతంలో..





**తెలంగాణకు దక్షిణాన ఉన్న నల్లమల అడవులు ఎంతటి అందమైనవో.. ఉత్తరాన విస్తరించిన కెరమెరి కొండలూ అంతే సుందరమైనవి. ఆదిలాబాద్-కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తరించిన గిరులు నిండా తరులతో అలరిస్తాయి. ఈ గుట్టల్లో ఓ భాగం మలంగి గిరులు. ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండల పరిధిలో విస్తరించి ఉన్న మలంగి కొండలు.. పచ్చదనంతో, నీటి చెలమలతో వేసవిలోనూ వ'సంతసాన్ని' కలిగిస్తాయి.**

మలంగి లోయ గిరిజనుల ఆధ్యాత్మిక కేంద్రం. దశాబ్దాల కిందట ఫూలాజీ బాబా ఏళ్లకేళ్లు తపస్సు చేసిన ప్రాంతమిది. బాబా సిద్ధి పొందిన ప్రదేశానికి నేటికీ భక్తులు వస్తుంటారు. పట్నాపూర్ నుంచి మలంగి వరకు లోయమార్గంలో సాగే నాలుగు కిలోమీటర్ల ప్రయాణం ఓ అద్భుతం. రెండు గుట్టలు ఎక్కి దిగడంతో కలిగే అలసట.. అక్కడక్కడా తారసపడే జలపాతాలను చూడటంతో మాయం అవుతుంది. అందమైన నాలుగు జలపాతాలు 10 నుంచి 15 అడుగుల ఎత్తు నుంచి దూకుతూ చేసే నాట్యం నయన మనోహరంగా ఉంటుంది. ఈ కొండల నడుమ నేలంతా ఈనిండా అన్నట్టుగా పచ్చని పంటలు కనిపిస్తాయి.

**కాశీకుండం..** లోయలో నడవలేని వాళ్లు రోడ్డు మార్గంలో మలంగి క్షేత్రానికి చేరుకోవచ్చు. దారంతా ఎగుడు దిగుడులతో ఉన్నా.. కొండల మధ్య పాములా వంకర్లు తిరుగుతూ గమ్యానికి దారితీస్తుంది. ఈ మార్గంలోనే పలకరిస్తుంది మలంగి వాగు. మండు వేసవిలోనూ నిండుగా ప్రవహిస్తూ ఆశ్చర్యం కలిగిస్తుంది. వాగుపై ఉన్న మడుగు జలక్రీడలకు వేదికగా నిలుస్తుంది. అక్కడక్కడా ఉండే ద్వీపాలపై ఫూలాజీ బాబాకు సంబంధించిన పవిత్ర స్థలాలు దర్శనమిస్తాయి. ఇక్కడికి సమీపంలోనే బాబా ప్రార్థనా మందిరం ఉంటుంది. ఇంకాస్త ముందుకు వెళ్తే పట్నాపూర్ నుంచి వచ్చే కాలినడక మార్గం కలిసే చోటు వస్తుంది. ఇక్కడ వాగు మలుపును గంగా సంగమ స్థలంగా భావిస్తారు గిరిజనులు. సమీపంలో ఉండే కుండాన్ని కాశీకుండంగా భావించి పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. తర్పణాలు విడుస్తుంటారు. భక్తితో బాబాను ఆరాధిస్తూనే.. ప్రకృతిలోని ప్రశాంతతను ఆస్వాదిస్తారు. మధురమైన జ్ఞాపకాలతో తిరుగు ప్రయాణం అవుతారు.

పట్నాపూర్ మలంగి క్షేత్రం దర్శించడానికి హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో ప్రయాణించి గుడిహత్నూరుకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఉట్నూరు (38 కి.మీ) వెళ్లి.. హస్నాపూర్ మీదుగా పట్నాపూర్ (25 కి.మీ.) చేరుకోవచ్చు. బస్సులు, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. బాబా ఆశ్రమం నుంచి మలంగి క్షేత్ర పరిసరాలన్నీ చుట్టి రావొచ్చు.

**బాబా జయంతికి..**

ఫూలాజీ బాబా తపస్సు ఆచరించిన ప్రాంతం కావడంతో.. మలంగి లోయను పవిత్రంగా భావిస్తారు గిరిజనులు. మలంగి వాగు ఆవలి ఒడ్డున బాబా తపస్సిద్ధి పొందిన ప్రదేశం ఉంటుంది. ఏటా బాబా జయంతి (ఆగస్టు 30), గురు పౌర్ణమి, మహాశివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఇక్కడికి తరలి వస్తారు.

## కొత్తగా: కునుకులో
# కదలిక లేదిక



దూర ప్రయాణాల్లో కునుకమ్మ ఇట్టే దరి చేరుతుంది. అలా నిద్రలోకి జారుకోగానే.. తల పక్కకు ఒరుగుతుంది.. చప్పున మెలకువ వచ్చేస్తుంది. పోనీ కాసేపు భుజం వాలుద్దామనుకుంటే.. పక్కసీట్లో అపరిచితుడు కన్నెర్ర చేస్తుంటాడు. ఆ సీట్లో స్నేహితుడున్నా.. ఇంట్లోవాళ్లున్నా.. కస్సుబుస్సులు తప్పవు. ప్రయాణం పూర్తయ్యే సరికి చాలీచాలని నిద్రతో తలపట్టేసినట్టు అవుతుంది. ఈ సమస్యకు పరిష్కారం హెడ్‌రెస్ట్ కవర్. కారులో, బస్సులో, విమానంలో దీన్ని వాడుకోవచ్చు. సీటుకు దీనిని అమర్చి అందులో తల దూర్చితే సరి. తల ఏ పక్కకు ఒరిగినా.. పట్టు జారకుండా చేస్తుంది. దీంతో ఏ కదలిక లేకుండా కునుకు తీసేయొచ్చు. కళ్లపై వెలుతురు పడకుండా కవర్ చేసుకోవచ్చు కూడా. ఆన్‌లైన్ మార్కెట్‌లో ఇవి దొరుకుతున్నాయి. ధర రూ.500 నుంచి మొదలవుతోంది.

# మచ్చలేని అందమైన చర్మం కోసం కత్రినా కైఫ్ ఏంచేస్తుందంటే?




నాలుగు పదుల వయస్సులోనూ అందంలో ఏమాత్రం తక్కువ కాకుండా కుర్ర హీరోయిన్లకు పోటీ ఇస్తోంది కత్రినా కైఫ్. వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతోంది. ఈ బ్యూటీ అందానికి ఫిదా అవ్వాల్సిందే. ఈ బ్యూటీ ఎంతో అందమైన చర్మాన్ని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అలాంటి మచ్చలేని, అందమైన, మెరుపునిచ్చే చర్మం కోసం రోజూ కత్రినా కైఫ్ ఏం చేస్తుందో తెలుసా? తాజాగా ఈ బ్యూటీ తన స్కిన్ కేర్ రొటీన్ ఏంటో వెల్లడించింది. కత్రినా చర్మంలా మీకు కూడా సహజమైన మెరుపునిచ్చే ముఖం కావాలంటే కత్రీనా ఫాలో అవుతున్న ఈ సీక్రెట్స్ మీరూ ఫాలో అవండి.

**కత్రినా అందాల రహస్యం:**

**కత్రినా అందానికి ప్రధాన సోర్స్ కిచెన్.**

చర్మాన్ని ఆరోగ్యంగా, రిఫ్రెష్‌గా ఉంచడానికి వంటగదిలో దొరికే రెండు వస్తువులను ఎక్కువగా ఉపయోగిస్తుంది. ఒకటి ఓట్స్, రెండోది తేనె. ఓట్స్ ను మెత్తగా చేసి అందులో తేనె బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్ లా వేసుకుంటానని కత్రినా కైఫ్ చెప్పింది.

**కృతి సనన్ లాంటి మెరిసే చర్మం కావాలా?**

**ఈ బ్యూటీ రోజూ ఏం చేస్తుందో..**

**మీరూ అదే చేయండి ఐస్ వాష్:**

రోజూ ఉదయం నిద్రలేవగానే పఫ్ఫీనెస్ ను, మంటను తగ్గించడానికి కత్రినా కైఫ్ ప్రత్యేక ఐస్ వాష్ చేసుకుంటుంది.

నిద్రలేచిన తర్వాత ఒక పెద్ద గిన్నెలో ఐస్ క్యూబ్స్ వేసుకుంటుంది. దానిలో కొన్ని నీటిని కలిపి అందులో తన ముఖాన్ని ముంచుతుంది. దీని వల్ల మంట పోతుందని, పఫ్ఫీనెస్ తొలగిపోతుందని కత్రినా చెప్పింది.

**పుష్ప హీరోయిన్ రష్మిక మందన్న ఫ్యాషన్ సెన్స్ కు హ్యాట్సాఫ్:**

వార్డ్‌రోబ్‌లో ఖరీదైన బ్రాండెడ్ సెక్సీ దుస్తులు.. వ్యాయామం, ఆహారం: మంచి చర్మం కోసం, మెరుగైన ఆరోగ్యం కోసం మంచి ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చు. ఆరోగ్యకరమైన వ్యక్తి ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. అందుకే కత్రినా వ్యాయామం, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. తాను ఎప్పుడూ వ్యాయామం చేయకుండా ఉండదు. అలాగే కచ్చితంగా డైట్ పాటిస్తుంది. కత్రినా కైఫ్ మాక్రోబయోటిక్ డైట్ ని అనుసరిస్తుంది. ప్రతి 2 గంటలకు తాజాగా ఉడికించిన కూరగాయలు, పండ్లను తీసుకుంటుంటుంది. కార్బోహైడ్రేట్లకు పూర్తిగా దూరంగా ఉంటుంది. అలాగే ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకుంటుంది.

# చెప్పండి.. నోరు విప్పండి!




సెక్స్.. మనదేశంలో అచ్చమైన బూతుపదం. పిల్లల ముందు పలకడానికి కూడా ఇష్టపడం. కానీ, పోర్నోగ్రఫీ చూసేవాళ్ల సంఖ్య మాత్రం ఇక్కడే ఎక్కువ. అత్యాచారాలు, పసిపిల్లల మీద పాశవిక దాడులూ అధికమే. కారణం? లైంగిక విద్య లేకపోవడమే అంటారు సెక్స్ ఎడ్యుకేటర్ అంజూ కిష్. పిల్లలకు చెప్పాల్సిన వయసులో, చెప్పాల్సిన విషయాలు చెప్పకపోవడం అనేక విపరిణామాలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. 'అన్‌టబూ' అనే సంస్థను ఏర్పాటుచేసి, బాల్యానికి అవగాహన కల్పిస్తున్నారు.తోటి పిల్లలతో ఆడుకుంటూ ఏదో అనకూడని మాట అన్నాడనే కోపంతో మంజుల తన కొడుకును ఎడాపెడా వాయించేసింది. కొద్ది సేపటి తర్వాత 'పాపం చిన్న పిల్లాడు. వాడికేం తెలుసు. నేనే తొందరపడి కొట్టేశాను' అంటూ బాధపడిపోయింది.కావ్యకు పదేండ్ల కూతురు ఉంది. స్కూల్లో చాలా చురుకు. కాకపోతే ఈ మధ్య బడికి వెళ్లాలంటేనే భయపడిపోతున్నది. ఏమైందని ఆరా తీస్తే.. టీచర్ కొట్టిందని చెప్పింది. స్కూల్‌కు వెళ్లి ఎందుకు కొట్టారని నిలదీస్తే.. పిల్లలను నిక్‌నేమ్‌లతో పిలుస్తున్నదని టీచర్ ఫిర్యాదు చేసింది. అందులో తప్పేముందని కావ్య ప్రశ్నించింది. కానీ, అవన్నీ అసభ్యమైన పదాలే! కావ్య మైండ్ బ్లాంక్ అయిపోయింది. '..పై రెండు సందర్భాల్లోనూ తప్పు పిల్లలది కాదు. వారికి సరైన అవగాహన కల్పించని తల్లిదండ్రులు, టీచర్లదే' అంటారు అంజు కిష్. బూతులు మాట్లాడకూడదు అని పిల్లలకు బుద్ధులు చెప్తారు. కానీ, వాటిని బూతు పదాలని ఎందుకంటారు? దేని అర్థం ఏమిటి? అని మాత్రం విడమరచి చెప్పరు. అంతేకాదు.. చిన్నపిల్లల జననాంగాలకు నిక్‌నేమ్‌లు, పెట్ నేమ్‌లు పెట్టి పిలవడం, పిల్లలకు కూడా అలాగే అలవాటు చేయడం వల్ల.. అదే అసలు పేరేమో అనుకొని.. ఎక్కడ పడితే అక్కడ మాట్లాడేస్తుంటారు. ఇది సరికాదు. చిన్న వయసు నుంచే సెక్స్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఇవన్నీ అర్థమయ్యేలా చెప్పాలి. సరైన పదజాలాన్ని పరిచయం చేయాలి. అంజు చెప్పేదీ ఇదే.

**మనం కాక ఇంకెవరు?**

'టీవీలో ఏదైనా ప్రోగ్రామ్ చూసేటప్పుడు అశ్లీల సన్నివేశాలు, డైలాగులు వస్తే.. పిల్లలు చూడొద్దనే ఉద్దేశంతో వెంటనే ఛానల్ మార్చేస్తుంటారు. చూస్తే చెడిపోతారని భయం. నిజానికి, కట్టడి చేయాలనుకున్న ప్రతిసారీ వాళ్లకు మరింత ఆసక్తి పెరుగుతుంది. మనం ఒక మార్గం మూసేస్తే, వాళ్లు ఇంకో మార్గంలో ప్రయత్నిస్తారు. అది సహజ కుతూహలం. పిల్లల్లో పదకొండు, పన్నెండు సంవత్సరాల వయసు నుంచే సెక్స్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగిపోతుంది.

తల్లిదండ్రులు, టీచర్లు సరైన పద్ధతిలో లైంగిక విజ్ఞానాన్ని అందించలేకపోవడం వల్ల ఇంటర్నెట్ మీద ఆధారపడుతున్నారు. అక్కడ చూసినదాన్ని, స్వయంగా అనుభవించే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్లే యుక్తవయసు గర్భధారణలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సింగపూర్, ఐర్లాండ్, నైజీరియా తదితర దేశాల్లో సెక్స్ ఎడ్యుకేషన్ చట్టబద్ధం. పిల్లలకు ఏ వయసులో ఏం చెప్పాలనే కచ్చితమైన విద్యా ప్రణాళిక ఉంటుంది. అందుకే అక్కడ అత్యాచారాలు, లైంగిక దాడుల కేసులు తక్కువగా నమోదవుతాయి. మన పిల్లలకు మనమే చెప్పకపోతే ఇంకెవరు చెప్తారు?' అని ప్రశ్నిస్తున్నారు అంజు కిష్.

**ఎవరీమె?**

అంజు కిష్ న్యాయశాస్త్రం, మాస్ కమ్యూనికేషన్‌లో పట్టా అందుకున్నారు. నాగ్‌పూర్‌లో జర్నలిస్టుగా కెరీర్ ప్రారంభించారు. తర్వాత ఓ సంస్థలో కాపీ రైటర్‌గా పనిచేశారు. చైల్డ్ ఫ్రెండ్లీ బుక్స్ రాశారు. లైంగికతపై పుస్తకాలు అందుబాటులోకి తెచ్చారు. సెక్స్ ఎడ్యుకేటర్‌గా సర్టిఫికెట్ పొందిన తర్వాత, సొంతంగా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. 'పిల్లలను పెంచడం అంటే వాళ్లు అడిగిందంతా ఇవ్వడం కాదు. పెద్ద స్కూల్‌లో చదివించడం అసలే కాదు. కొన్ని విలువలు నేర్పాలి. లైంగిక విద్యలాంటి విషయాలు అర్థమయ్యేలా చెప్పాలి. సాంకేతికత దూసుకుపోతున్న ఈ రోజుల్లో కూడా లైంగిక విద్య గురించి మాట్లాడేందుకు వెనుకా ముందూ ఆలోచిస్తున్నారు. మాట్లాడితేనే కదా.. వాళ్లకు విషయం తెలిసేది, మార్పు మొదలయ్యేది. రహస్యంగా ఉంచాలనుకునే విషయాలను తెలుసుకునేందుకే పిల్లలు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. అందుకే.. మనమే చొరవ తీసుకొని విడమరిచి చెప్పాలి..' అంటున్నప్పుడు అంజు గొంతులో బాధ్యతతో కూడిన ధర్మాగ్రహం.. మార్పు మన నుంచే మొదలుకావాలనే బలమైన సంకల్పం.



# చదువుల తల్లి.. కలైసెల్వి

కీలక పరిశోధన సంస్థల అత్యున్నత విభాగం.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చి (సీఎస్ఐఆర్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్ నల్లతంబి కలైసెల్వి వ్యక్తిత్వం నిరుపమానం. ఆమె ప్రతిభ కలిగిన ఎలక్ట్రో కెమికల్ సైంటిస్ట్ కూడా. లిథియం-అయాన్ బ్యాటరీల జీవితకాలాన్ని పెంచే మార్గాన్ని కనిపెట్టి పారిశ్రామిక రంగానికి కొత్త ఉత్సాహం ఇచ్చారు. స్వరాష్ట్రం తమిళనాడులో చవకైన టాయిలెట్ల నిర్మాణానికి ఓ నమూనా అందించారు. కలైసెల్వి ప్రాథమిక విద్యాభ్యాసమంతా తమిళ మాధ్యమంలోనే సాగింది. మాతృభాషలో చదువుకోవడం వల్లే తనలో జిజ్ఞాస పెరిగిందని అంటారు. కలైసెల్వి తండ్రి ఉపాధ్యాయుడు. 'అచ్చంగా అబ్బాయిలానే పెంచారు నన్ను. దాంతో మగపిల్లలతో కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ ఆడేదాన్ని' అని నవ్వుతూ చెబుతారు. కలైసెల్వి మంచి వక్త కూడా. కాలేజీ రోజుల్లో అనేక వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు. ఉద్యోగంలో చేరాక కూడా ఆకాశవాణిలో సైన్స్ మీద ఉపన్యాసాలు ఇచ్చారు. 'ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఇప్పటికీ పిల్లలకు పాఠాలు చెప్పడం అంటేనే ఇష్టం' అంటారామె.

## వైన్ ఫేషియల్, వైన్ థెరపీతో గ్లోయింగ్ స్కిన్ మీ సొంతం? వైన్ ఫేషియల్, థెరపీ ఎలా చేయాలో తెలుసా?



ఫేషియల్ అనేది డెడ్ స్కిన్ సెల్స్ ను తొలగించి, ముఖం తాజాగా మరియు మెరుస్తూ ఉండేలా చేస్తుంది. కాబట్టి నెలకు రెండుసార్లు అంటే ప్రతి 15రోజులకొకసారి ఖచ్చితంగా ఫేషియల్ చేయించుకోవడం చాలా మంది మహిళలకు నిత్యకృత్యంగా మారింది. గోల్డెన్ ఫేషియల్ తో పాటు ఫ్రూట్ ఫేషియల్, మడ్ ఫేషియల్, ముత్యపు (సిల్వర్) ఫేషియల్, ఆయిన్ ఫేషియల్ ఇప్పుడు మహిళలకు అందాన్ని మెరుగుపరచుకునే వాటిలో ఇవి నంబర్ వన్ గా ఉన్నాయి. కాస్మోటాలజిస్ట్ ఆర్. ప్రియా స్త్రీలు తమ అందాన్ని మెరుగుపరుచుకోవడంలో స్పా మరియు థెరపీ వంటి బ్యూటీ ట్రీట్‌మెంట్‌ల గురించి ప్రాథమిక సమాచారాన్ని అందించారు. మనం రెగ్యులర్ గా తినే పండ్లలో ద్రాక్ష పండ్లు ఒకటి. ద్రాక్ష గింజలు, ఆకు, ద్రాక్షపండులోని గుజ్జు ఇవన్నీ చర్మం ఆరోగ్యానికి బాగా సహాయపడుతాయి. ద్రాక్షలో విటమిన్ ఎ, సి మరియు డి పుష్కలంగా ఉన్నాయి. ఇందులో అమినో యాసిడ్ మరియు మినరల్స్ పుష్కలంగా ఉండటం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఆరోగ్యానికి మాత్రమే ఉపయోగపడే ద్రాక్ష ఇప్పుడు అందాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

వైన్ అందించే చర్మ సౌందర్య రహస్యలను పనీర్ ద్రాక్ష అని పిలువబడే నల్ల ద్రాక్ష నిజంగా ఆరోగ్యకరమైనది. ద్రాక్షతో తయారు చేసిన ఎరుపు, గులాబీ మరియు తెలుపు వైన్లను సౌందర్య చికిత్స కోసం ఉపయోగిస్తారు. ఈ వైన్లలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలోని సాగే ఫైబర్‌లను పునరుద్ధరించి చర్మం ముడతలను తగ్గిస్తాయి. ఈ విధంగా మీరు వృద్ధాప్య రూపాన్ని అందంగా నివారించవచ్చు. ఇలా వైన్ అందించే మరిన్ని చర్మ సౌందర్య రహస్యలను గురించి ఈ కథనంలో తెలుసుకుందాం..

27నుండి బుధాదిత్య యోగంతో ఈ రాశులకి బంపర్ ఆఫర్ డబ్బేడబ్బు.. వైన్ ఫేషియల్ - ఎండ వల్ల ముఖం పాలిపోతుంది. తమ చర్మం అసలు రంగు వెలిసిపోయిందని, చర్మం డల్ గా కనిపిస్తోందని ఫిర్యాదు చేసే వారికి వైన్ ఫేషియల్ ఒక గొప్ప ఎంపిక. ఈ ఫేషియల్‌లో, ముఖాన్ని శుభ్రపరచడం, టోన్ చేయడం, స్క్రబ్ చేయడం మరియు సాధారణ ఫేషియల్ లాగా మసాజ్ చేయడం జరుగుతుంది. ఇతర ఫేషియల్స్ కంటే వైన్ ఫేషియల్ ఎక్కువ రంగును మరియు తక్షణ అందాన్ని ఇస్తుంది.

రుచిలో కాస్త చేదుగా ఉన్నప్పటికీ, ఈ చక్కెర బాదం మధుమేహం-కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది వైన్ థెరపీ వైన్‌తో మొత్తం శరీర చికిత్సను వైన్ థెరపీ అంటారు, ఇది శరీరాన్ని పునరుజ్జీవింపజేయడానికి మరియు కాంతివంతం చేయడానికి మరియు శరీరంలోని ముడతలను వదిలించుకోవడానికి. వృద్ధాప్యం వల్ల చర్మంలో ముడతలు వస్తాయి. దీనితో బాధపడేవారు వైన్ థెరపీ వల్ల ప్రయోజనం పొందవచ్చు.

ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఉల్లిపాయ రసం తాగండి, డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది! చర్మసౌందర్యానికి వైన్ ను ఎలా ఉపయోగించాలి? నల్ల ద్రాక్ష గింజ మరియు చర్మాన్ని మెత్తగా చేసి శరీరమంతా పూయాలి. ఇది స్క్రబ్బర్ లాగా పని చేయడం వల్ల శరీరంపై రుద్దితే మృతకణాలు, మురికి తొలగిపోయి చర్మం కాంతివంతంగా మారుతుంది. చర్మంలో మూసుకుపోయిన రంధ్రాలు తెరుచుకుంటాయి. దీని తర్వాత 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయాలి. దీని తర్వాత వైన్ కలిపిన జెల్లు లేదా క్రీములను శరీరమంతా అప్లై చేయాలి.

చివరగా, వైన్ సీరంను వర్తించండి. దీంతో చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఇది శరీరానికి యవ్వన రూపాన్ని మరియు మెరుపును ఇస్తుంది. వైన్ స్పా- ఒక పెద్ద కుండలో 3 కిలోల నల్ల ద్రాక్షను వేసి, 10 లీటర్ల నీరు వేసి, ద్రాక్షను మెత్తగా మెత్తగా చేయాలి. వైన్ స్పా అంటే ఆ నీటిలో మూడు పావుగంట సేపు పడుకుని విశ్రాంతి తీసుకోవడమే. దీంతో చర్మంలోని మృతకణాలు తొలగిపోతాయి. తాజా మరియు యవ్వన రూపాన్ని ఇస్తుంది. దీనికి రుసుము 2500 నుండి 3500 రూపాయల వరకు ఉంటుంది. ఇది వారి చర్మాన్ని బట్టి మారుతుంది.

వైన్ ఉపయోగించి బ్యూటీ ట్రీట్ మెంట్స్ తీసుకునేటప్పుడు గుర్తుంచుకోవల్సిన విషయాలను పొడి చర్మం ఉన్నవారు స్వీట్ వైన్ వాడాలి. వైట్ వైన్ వద్దు. సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు రెడ్ వైన్ వాడటం మంచిది. ఇది చర్మ రంధ్రాలలోకి వెళ్లి మొటిమలు మరియు వీనల్ ట్యూమర్‌లను నివారిస్తుంది. డ్రై వైన్ సాధారణ చర్మం కోసం ఉపయోగించవచ్చు. ఇందులోని టార్టారిక్ యాసిడ్ మరియు మాలిక్ యాసిడ్ చర్మంలోని జిడ్డును నిలుపుకుని అదనపు అందాన్ని అందిస్తాయి. జిడ్డు చర్మం ఉన్నవారు వారికి అదనపు మెరుపును అందించడానికి రెడ్ వైన్‌తో సమానమైన పెరుగును ఉపయోగించవచ్చు.





# మనవడు చెప్పిన కిటుకు



'గృహప్రవేశానికి రేపు తాతగారింటికి వెళ్తున్నావు. మామయ్య సాయంత్రం వస్తానని చెప్పాడు. పాఠశాలలో రెండు రోజుల సెలవు అడుగు' తల్లి చెప్పగానే పన్నెండేళ్ళ ప్రశాంత్ ఆనందానికి అవధులు లేకుండా పోయింది. గబగబా పాఠశాలకు బయలుదేరాడు. పాఠశాలకు చేరినప్పటి నుండి పల్లె ప్రయాణం గురించి మిత్రులతో చర్చించడం మొదలు పెట్టాడు. పల్లె అందాలు, పల్లె బంధుత్వాల గురించి వివరించాడు. మిత్రులు కూడా ఆసక్తిగా వినసాగారు. ప్రధానోపాధ్యాయుడితో సెలవు మంజూరు చేయించుకున్నాడు. ఇంటికి వెళ్ళటంతోనే మామయ్య కనిపించేసరికి ప్రశాంత్‌లో మరీ జోష్ పెరిగింది. పరిగెత్తుకుంటూ వెళ్ళి మామయ్య చేతుల మధ్య ఒదిగిపోయాడు. భోజనాలు పూర్తయ్యాయి. మామయ్య పక్కన చేరిన ప్రశాంత్ కబుర్లు చెబుతూనే నిద్రలోకి జారుకున్నాడు. పక్షుల అరుపులతో మేల్కొన్నాడు ప్రశాంత్. అప్పటికే మామయ్య స్నానం చేసివచ్చాడు. ప్రశాంత్ మామయ్యతోపాటు ఫస్ట్ బస్సు ఎక్కేసాడు.

రెండు గంటల ప్రయాణం తరువాత ఇద్దరూ పల్లె చేరుకున్నారు. ప్రశాంత్‌కి అందరూ పలకరింపుల స్వాగతం పలికారు. తరువాత మేడపైకి వెళ్ళాడు. చుట్టూ పొలాలు, పచ్చని పైరు చూడముచ్చటగా కనిపించింది. మనస్సుకు తెలియని ఆనందం కలిగింది. పల్లె ఎంత బాగుంది! అనుకున్నాడు. ఇంతలో పాము, పాము అంటూ గోల వినిపించింది. ఆతృతతో కిందకు దిగిన ప్రశాంత్ అటువైపు వెళ్ళాడు. ఒకతను కర్రతో పామును చంపడానికి వచ్చాడు. ప్రశాంత్ తాతగారు అడ్డుకున్నారు. శుభమా అని గృహ ప్రవేశం చేస్తున్నాం. పాముని చంపొద్దు వారించాడు. అలాగైతే ఎలా? ఇది విషజంతువు. ఇప్పుడు దారి మళ్లించినా ఏదో ఒక రోజు ప్రమాదమే చెప్పాడు కర్ర తెచ్చిన వ్యక్తి. అవి మన నివాసాలపై పడితే మనం ఊరుకోవాలా? వెనుక నుంచి మరో మనిషి వకాల్తా పుచ్చుకుని మాట్లాడాడు. ప్రశాంత్ కల్పించుకుని అవి మన నివాసాల దగ్గరకు రాలేదు. మనమే వాటి నివాసాల దగ్గర ఇల్లు కట్టుకున్నాం. పొలాలన్నీ విషపూరితం చేశాం. అందుకే ఇలా వస్తున్నాయి చెప్పాడు ప్రశాంత్. ఇలా పాములు ఇళ్ళల్లోకి రాకుండా ఉండాలంటే నా దగ్గర ఓ కిటుకు ఉంది ఊరించినట్టు అన్నాడు ప్రశాంత్‌అందరూ ఏమిటి? అంటూ ముక్తకంఠంతో అడిగారు. సాయంత్రం చెబుతాను అన్నాడు ప్రశాంత్. గృహ ప్రవేశం పూజలు పూర్తయ్యాయి, మరో పక్క భోజనాలు పూర్తయ్యాయి. ఓ పట్నం పిల్లోడా! కిటుకంటూ ఊరించావు, చెప్పకుండా తిరుగుతున్నావు అని అక్కడకొచ్చిన పెద్దలు అడిగారు. మీరందరూ ఆచరిస్తానని మాట ఇస్తే చెబుతాను షరతు పెట్టాడు ప్రశాంత్. నువ్వు చెప్పేది ఆచరించాక ఫలితం రాకపోతే గడుసుగా అడిగాడు అందులో ఒకరు. మీరంతా రైతులు. అందరి ఆకలి తీర్చే నిస్వార్థ పరులు. సంకల్పబలంతో దేనినైనా సాధించగలరు అంటూ ఆచరించవలసిన విధానాన్ని చెప్పాడు ప్రశాంత్. ఇంతేనా... అంటూ తేలిగ్గా అనేశారు పెద్దలు. ఇది చిత్తశుద్ధితో ఆచరించండి. సంవత్సరం పోయాక నేను ఇక్కడకు వస్తాను. పాముల బెడద తగ్గిందని మీరే చెబుతారు. నమ్మకంగా చెప్పాడు ప్రశాంత్. అలాగే అన్నారు. ఆరు మాసాలు గడిచాక తాతగారి నుండి ఓ ఉత్తరం వచ్చింది. ప్రియమైన మనవడికి, ఆశీస్సులు. నువ్వు పాముల నిరోధానికి వేసిన మంత్రం ఫలించింది. ఇప్పుడు ఇళ్ళల్లోకి వచ్చే పాముల బెడద తగ్గింది. నీ రాక గురించి గ్రామ పెద్దలు ఎదురు చూస్తున్నారు.

# మతిమరపు తాబేలు

ఒక తాబేలు ఆయాసంతో నడుస్తోంది. దారిలో దానికి నక్క కనిపించింది.
'ఏంటి మిత్రమా! ఎక్కడికి వెళుతున్నావు ?' అని అడిగింది నక్క.
'నా పిల్లల్ని చూసుకోవడానికి వెళుతున్నాను' అంది తాబేలు. 'నీకు పిల్లలు ఎక్కడున్నారూ? మతిమరపుకానీ రాలేదు కదా?!' ఆశ్చర్యపోయింది నక్క.
'నిజమే! నాకు ఇంతవరకూ పిల్లలు లేరు. కానీ చెరువుగట్టు మీద ఇసుక లోపల నేను గుడ్లు పెట్టాను. దాదాపు రెండు నెలల పది రోజులు అయ్యింది. అవి ఇప్పుడు పిల్లలు అవుతాయి' అంది తాబేలు.
'అవునా! కానీ నేనెప్పుడూ చెరువు ఒడ్డున గుడ్లు చూడనేలేదే..! అయినా ఇప్పటివరకూ ఉంటాయా?' అని ఆశ్చర్యపోయింది నక్క.
ఆ మాటకు తాబేలు 'నేను గుడ్లు పెట్టి, వాటిపై ఇసుక కప్పాను' అని చెప్పింది.
'అలాగా! అయితే నేనూ వస్తాను. నీ పిల్లల్ని చూస్తాను!' అంది నక్క.
తాబేలు, నక్క అలా నడుచుకుంటూ, నడుచుకుంటూ.. పోతూ ఉండగా దార్లో వాటికి కోతి కనిపించింది.
'నక్కబావా! మీరిద్దరూ ఎక్కడికి వెళుతున్నారు?' అని అడిగింది కోతి.
విషయం చెప్పింది తాబేలు.
'ఎప్పుడో గుడ్లు పెట్టావు. ఇప్పటి దాకా పొదిగాయో లేదో చూడలేదు.. అసలు పట్టించుకోలేదు.. అవి ఎప్పుడో కుళ్ళిపోయుంటాయి. నీకు ఇంత మతిమరపు అయితే ఎలా?' అంటూ వాటి వెంట చూడటానికి వెళ్ళింది కోతి.
ఆ మూడూ నడుచుకుంటూ చెరువు వైపు పోసాగాయి. కొద్ది దూరం పోయేసరికి వాటికి కుందేలు కనిపించింది.
'ఎక్కడికి వెళుతున్నారు?' అని అడిగింది కుందేలు. విషయం చెప్పింది తాబేలు.
'నీకున్నంత బద్ధకం, మతిమరపు ఎవరికీ ఉండదు. ఇన్నిరోజులు గుడ్లని మరిచిపోయి ఎలా ఉన్నావు. పైగా ఈ రోజే గుడ్ల నుంచి పిల్లలు పుడతాయని జోశ్యం చెపుతున్నావు. నీ మతిమరపుకు గుడ్లు ఎప్పుడో మురిగిపోయి ఉంటాయి' అంది కుందేలు.
అవి నాలుగూ నడుచుకుంటూ చెరువుకు చేరాయి. 'నువ్వు గుడ్లు ఎక్కడ పెట్టావో అదైనా గుర్తుందా?' ఎగతాళిగా అంది నక్క.
'అదిగో ! ఆ ఉత్తరం వైపు ఉన్న బండరాయి పక్కనే ఇసుకలో గుడ్లు పెట్టాను' అంది తాబేలు. అవి నాలుగు వేగంగా బండరాయి వద్దకు చేరాయి. తన పదునైన గోర్లతో ఇసుకను తవ్వింది తాబేలు. అప్పుడే గుడ్ల నుంచి విచ్చుకున్న బుజ్జి బుజ్జి తాబేలు పిల్లలు ఇసుకలో నుంచి బయటికి వచ్చాయి. బుజ్జి తాబేళ్లని చూసి ముచ్చటపడింది తల్లి తాబేలు. వాటిని ముద్దాడింది. అవి తల్లిని చూసి ఆనందపడ్డాయి. ఇదంతా గమనిస్తున్న నక్క, కోతి, కుందేలు ఆశ్చర్యపోయాయి.



తాబేలును అనవసరంగా ఏదేదో అన్నామని పశ్చాత్తాపం చెందాయి. తాబేలుకు మతిమరుపు లేదని, గుడ్లు ఎక్కడ పెట్టిందో కచ్చితంగా గుర్తుంచుకుందని.. పైగా అవి పొదిగే కచ్చితమైన సమయం తాబేలుకు తెలుసుననీ.. మనకే తన గురించి తెలియదని సిగ్గుపడ్డాయి.
అప్పుడు తాబేలు 'గుడ్లు మేము పొదగము. పొదిగేందుకు కావలసిన వెచ్చదనం, రక్షణ కోసం వాటిని ఇసుక లోపల దాచిపెడతాం. ఇక అవి పక్వదశకు రావడం మాకు మానసికంగా తెలుస్తుంది. అప్పుడే అవి పిల్లలై, బయటికి వస్తాయి' అంది తాబేలు.
శాస్త్రానికి అందని విషయమేదో తెలుసుకున్నామన్న భావన కలిగింది నక్క, కోతి, కుందేలుకు.
వెంటనే 'మిత్రమా! నువ్వు సష్టిలో ఓ ప్రత్యేక జీవివి. నీకు మతిమరపు లేదు. మంచి అవగాహనతోనే ఉన్నావు. నీ గురించి మేమే పొరపాటు పడ్డాం. ఏమీ అనుకోకు' అన్నాయి.
'ఫర్వాలేదు. తెలియకే కదా మీరన్నది. సరే.. ఉంటాను' అని వాటి దగ్గర సెలవు తీసుకుని తాబేలు తన బుజ్జి పిల్లలతో చెరువులోకి వెళ్ళిపోయింది.

# సముద్రంలో రహస్యమందిరం

**విక్రమార్క చక్రవర్తి కుమారుడు కీర్తికేతుడు పరమలోభి. అతడి కుమారుడు విజయభాస్కరుడు తాతలా దయాపరుడు. తండ్రి విధించిన మరణశిక్ష నుంచి తప్పించుకుని, తల్లితో కలిసి వెళ్తూ దారిమధ్యలో కలభాషిణి అనే రాచకన్యను రక్షించాడు. యశస్కరుడనే రాజు కొలువులో చేరాడు. చేయని నేరానికి ద్వీపాంతర వాస శిక్షకు గురయ్యాడు. విజయభాస్కరుణ్ని బందీగా తీసుకెళ్తున్న ఓడ.. శోభావతికి సమీపంలోని ద్వీపం వైపుగా ప్రయాణిస్తున్నది. రెండురోజుల ప్రయాణం ముగిసేసరికి.. అకస్మాత్తుగా సముద్ర తుఫాను చెలరేగింది. ఓడ మునిగిపోతుందేమోననే భయంతో అందులో ఉన్నవారంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. ఆ సమయంలో.. దూరంగా సముద్రం మధ్యనుంచి ఒక ఇనుప స్తంభం గాల్లోకి లేచి నిలబడింది. "ఆ స్తంభాన్ని చూశారా? అది నరబలి కోరుతున్నది. ఓడతోపాటు మనల్నందరినీ తనలోనికి లాగిపారేస్తుంది. అలా జరిగేలోపుగా దానికి మనలో ఎవరైనా స్వచ్ఛందంగా బలి కాగలిగితే.. మిగిలినవారందరూ ప్రాణాలతో బయటపడవచ్చు. ఎవరినీ బలవంతంగా ఒప్పించకూడదు. తోసేయకూడదు. ఈ విషయాన్ని ఓడలో ఉన్న అందరికీ చెప్పండి" అన్నాడు సరంగు.**



"నేను ఎలాగూ శిక్షపడ్డవాణ్ని. ద్వీపంలో ఒంటరిగా చనిపోయే బదులు ఇప్పుడే మరణిస్తాను. నావల్ల మీరందరూ బతికితే అంతేచాలు" అని ముందుకొచ్చాడు విజయభాస్కరుడు. అంటూనే ఒక్క ఉదుటన ఎగిరి, సముద్రంలో దూకాడు. ఓడకంటే ముందుగా ఈదుకుంటూ ఆ ఇనుపస్తంభం వద్దకు చేరుకున్నాడు. అతడు పట్టుకోగానే ఆ స్తంభం.. ఎలాగైతే పైకి లేచిందో, అలాగే సముద్రంలోకి దిగబడి పోయింది. విజయభాస్కరుడు తన ప్రాణాలు పోయాయనే అనుకున్నాడు. కళ్లు తెరిచి చూసేసరికి.. ఎటుచూసినా రత్నమాణిక్యాలు, బంగారు తాపడాలతో అక్కడంతా దేదీప్యమానంగా ఉంది.
'ఓహో! నేను చనిపోయి స్వర్గానికి వచ్చాను కాబోలు' అనుకున్నాడు విజయభాస్కరుడు. అంతలో పెద్దపెద్ద కోరలతో, వికృతమైన ముఖం, పెద్దగుహలాంటి నోటితో ఒక భయంకరమైన రాక్షసి తానున్న వైపే రాసాగింది. 'అయితే ఇది స్వర్గం కాదు.. నరకం కాబోలు' అనుకున్నాడు విజయభాస్కరుడు. దాని కంటబడకుండా ఓ మూలగా దాక్కున్నాడు. ఆ రాక్షసి అక్కడంతా వెతికి కొన్ని వంటకాలను పెద్దపెద్ద పళ్లేల్లో నింపుకొని అక్కడినుంచి బయల్దేరింది. విజయభాస్కరుడు ఆ రాక్షసిని అనుసరించాడు. అక్కడినుంచి ఆ రాక్షసి వేరొక మందిరంలో ప్రవేశించింది. అక్కడ కొండంత ఎత్తులో ఈమెకంటే భయంకరమైన ఆకారంతో మరో రాక్షసి కూర్చుని ఉంది.
"ఏమే అయోముఖీ! ఇంతాలస్యం చేశావేం?! భోజనం సిద్ధం చేశావా?" అని అడిగింది.
"ఇదిగోనమ్మా!" అంటూ పళ్లేలు రెండూ ఆమె ముందు పెట్టింది అయోముఖి. ఆ పెద్దరాక్షసి.. పళ్లేల కేసి ఒకసారి ఆకలిగా చూసి..
"నరమాంసం ఏది?! ఈవేళ సముద్రంమీదికి లోహస్తంభాన్ని విడిచిపెట్టలేదా?" అని అడిగింది.
"విడిచిపెట్టానమ్మా! కానీ నరమాంసం రాలేదు. ఇదిగో ఇవే వచ్చాయి" అని సమాధానం ఇచ్చింది అయోముఖి.
పెద్దరాక్షసి గుండెలు బాదుకుంది.
"ఏదో చేటుకాలం దాపురించింది. ఈ జ్వాలాముఖి ఆయుర్దాయం తీరిపోయినట్లుంది. నిండా మూడువేల ఏళ్లు కూడా దాటకుండానే నేను చావాలి కాబోలు" అన్నది ఆందోళనగా.
"ఏమిటమ్మా! ఎందుకీ అర్థం లేని ఆందోళన. మీలాంటి అసహాయ శూరురాలిని ఎవరేం చేయగలరు?!" అన్నది అయోముఖి ధైర్యం చెప్పే ఉద్దేశంతో. అతి ప్రయత్నంమీద ఆమెను ఊరుకోబెట్టి.. "ఎవడైనా లోహస్తంభానికి తగులుకుని వస్తేనే కదా.. ఈవేళ ఎవరూ రానేలేదమ్మా!" అన్నది అయోముఖి. "నువ్వు సరిగా చూశావా?" ఆత్రుతగా అడిగింది జ్వాలాముఖి. "చూశానమ్మా! ఎవరూ రాలేదు. ఇప్పటివరకు చేపలైనా, మనుషులైనా ప్రాణం పోయిన తరువాతనే కదా మన కూరల తట్టలో పడేది. ఇదంతా జరిగేది కాదు.. పెట్టేది కాదు. అసంభవమైన జాతకాన్ని రాసి, నిన్ను మయబ్రహ్మ చిరంజీవిని చేశాడు. మరేమీ భయపడకు. హాయిగా భోజనం చేయి" అన్నది అయోముఖి. ఆ మాటలు విని కొంత ధైర్యం తెచ్చుకుని, భోజనానికి ఉపక్రమించింది జ్వాలాముఖి. తింటున్నంతసేపూ తానెంతమంది మానవులను ఎన్నెన్నిరకాలుగా విరుచుకు తిన్నదో కథలు కథలుగా చెప్పసాగింది. అదంతా వింటున్న విజయభాస్కరుడు.. 'ఇంత హింసకు పాల్పడిన రాక్షసి కూడా తన ప్రాణాల మీదికి వస్తున్నదంటే ఎంత చిత్రంగా ఏడ్చింది?!' అని మనసులో అనుకున్నాడు. "ఇంతకూ మా హేమప్రభ ఏం చేస్తున్నదే?!" అడిగింది.. బ్రేవ్ మంటూ తేన్చి, మూతి తుడుచుకుంటూ జ్వాలాముఖి.
"చెలికత్తెతో కలిసి బొమ్మల పెళ్లి చేస్తున్నది. పిల్లలు చక్కగా ఆడుకుంటున్నారు" చెప్పింది అయోముఖి. సంతోషం కొద్దీ జ్వాలాముఖి మందహాసం చేసింది. ఆ చప్పుడు భరించలేక విజయభాస్కరుడు చెవులు మూసుకున్నాడు. కొద్దిసేపటికి అయోముఖి అక్కడినుంచి వెళ్లిపోయింది. జ్వాలాముఖి నిద్రకు ఉపక్రమించింది. విజయభాస్కరుడు మెల్లిగా ఆమె మంచం వద్దకు వెళ్లి, ఒరనుంచి సర్రున కత్తిని లాగాడు. జ్వాలాముఖిని తట్టి లేపాడు. నిద్రమత్తులో కళ్లు సరిగ్గా తెరవకుండానే విజయభాస్కరుణ్ని గమనించి.. "ఎవడవురా నువ్వు?" అని హుంకరించింది రాక్షసి.
మరొక్క క్షణంకూడా ఆలస్యం చేయకుండా, దాని తలకాయను ఆనపకాయ తరిగినట్లు తరిగేశాడు భాస్కరుడు. కొండంత దేహం కలిగిన ఆ రాకాసి కించిత్తు శబ్దం చేయకుండా కన్ను మూసింది. ఆ తరువాత అయోముఖి వద్దకు వెళ్లి, ఆమె చేత కూడా పరలోకయాత్ర చేయించాడు.
లోకకంటకులైన రాక్షసులను చంపాననే తృప్తి కలిగింది కానీ, అక్కడినుంచి బయటికి ఎలా వెళ్లాలో తెలియలేదు. ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని ఆ మందిరంలోనే తిరగసాగాడు. సముద్రం మధ్యలోని ఆ రహస్యమందిరానికి అనుబంధంగా అనేక భవంతులు, ఉద్యానవనాలు ఉన్నాయి.
ఒకచోట బొమ్మల పెళ్లిళ్లు చేస్తున్న హేమప్రభ కనిపించింది. అతిలోక సౌందర్యవతి అయిన ఆమెను చాలాసేపు కన్నార్పకుండా చూడసాగాడు విజయభాస్కరుడు. "అమ్మా గౌరీదేవీ! ఈవేళ నీ పెళ్లి చేసినందుకు మా చెలికి త్వరలోనే మంచి పెళ్లికొడుకు దొరికేలా చూడు" అన్నది హేమప్రభ సఖురాలు. ఆ మాటలతో సిగ్గు ముంచుకువచ్చి, చిరుకోపంగా మారగా.. "పోవే పిచ్చిమాటలూ నువ్వూనూ!" అంటూ ఆమెను మెల్లగా తట్టింది హేమప్రభ.
ఉద్యానంలో విహరిస్తుండగా వారి చూపులు విజయభాస్కరునిపై పడ్డాయి. తొలిచూపులోనే అతణ్ని తన మనోహరునిగా ఎంచుకుంది హేమప్రభ. ఆమె చెలికత్తె చొరవ తీసుకుని రాయబారం నడిపింది. విజయభాస్కరుడు స్వయంగా విక్రమార్కుని మనుమడని తెలుసుకుని ఎంతో సంతోషించింది.
"రాకుమారా! ఈమె విద్యాధర చక్రవర్తి విశ్వావసుని మనుమరాలు. దేవవ్రతుని కూతురు. ఈమె తల్లి రాక్షసి అయినా, ఈమెలో ఆ లక్షణాలు లేవు. నీకు తగినది" అన్నది చెలికత్తె.
హేమప్రభకు విజయభాస్కరునికి అప్పుడే గాంధర్వ వివాహం జరిగింది. దంపతులిద్దరూ ఆ రాత్రి అమరసుఖాలలో తేలారు. తెల్లవారుతూనే హేమప్రభ సఖురాలు గది తలుపులు దబదబా బాదింది.
"మీ అమ్మమ్మను, అయోముఖిని ఎవరో చంపేశారు" అని దుర్వార్త వినిపించింది.
హేమప్రభ దుఃఖిస్తూ అమ్మమ్మను చూడబోయింది. విజయభాస్కరుడు ఆమెను అనుసరించాడు.
"ఈమె లోకకంటకురాలు. చెప్పలేనంత హింసకు పాల్పడింది. అందుకని నేనే చంపాను" అని చెప్పాడు విజయభాస్కరుడు.
హేమప్రభ కళ్లు తుడుచుకుని..
"దీనికి ఇలాంటి చావు రావడం సమంజసమే! కానీ ఎంతైనా అమ్మమ్మ కదా అందువల్ల వద్దనుకున్నా దుఃఖం ఆగడంలేదు" అన్నది. ఆ తరువాత రాక్షస స్త్రీలిద్దరినీ ఖననం చేశారు.
చెలికత్తె తప్ప మరో నరమానవుడు లేని ఏకాంత లోకంలో కొత్తదంపతులు కొంతకాలం హాయిగా సుఖించారు. ఒకనాడు విజయభాస్కరుడు తన తల్లిని కలుసుకుని, త్వరలోనే తిరిగి వస్తానని.. వెళ్లడానికి మార్గం చూపమని కోరాడు.

"నిన్ను చూడకుండా ఒక్కక్షణమైనా నిలువలేను" అంటూ చాలాసార్లు అతని అభ్యర్థనను తోసిపుచ్చింది హేమప్రభ.
చివరికి.. "ఒక్కవారం రోజులు సమయం ఇస్తున్నాను. ఆలోపుగా తిరిగి రావాలి. ఇదిగో ఈ కంకణాన్ని చేతికి ధరించి, ఎదురుగా ఉన్న తటాకంలో మునిగావంటే.. నువ్వు కోరుకున్న చోటికి వెళ్లగలవు. మళ్లీ ఏదైనా తటాకంలో మునిగినప్పుడు నన్ను స్మరిస్తే ఇక్కడికే వచ్చేస్తావు" అని చెప్పింది.
ఆమె ఇచ్చిన కంకణం సహాయంతో విజయభాస్కరుడు శోభావతి పట్టణానికి వెళ్లాడు. తన తల్లిని గురించి ఆరా తీస్తే.. "కుమారుడు మరణించాడన్న వార్త విని, తీర్థయాత్రలు చేస్తూ ఈ దేశాన్ని విడిచిపెట్టి పోయింది" అని చెప్పారు.
రాజైన యశస్కరుడు ఎలా ఉన్నాడని అడిగితే.. "అమాయకుడైన విజయభాస్కరుడి చావుకు కారణం అయ్యాడన్న బాధ.. ఆయనకు వైరాగ్యం కలిగించింది. రాజ్యాన్ని మంత్రులకు విడిచిపెట్టి ఆయన కూడా తీర్థయాత్రలకు వెళ్లిపోయాడు" అంటూ చెప్పారెవరో.
విజయభాస్కరుడు తన తల్లిని వెతుక్కుంటూ అనేక క్షేత్రాలు సందర్శించసాగాడు. చివరికి ఒక శివరాత్రి రోజున శ్రీశైలానికి వెళ్లాడు. ఉపవాస, జాగరాలతో మల్లికార్జునుణ్ని సేవించాడు. మరునాడు తెల్లవారుజామున స్నానానికి వెళ్తుండగా.. కోటితీర్థమనే బావిలో ఎవరో పడ్డ చప్పుడు వినిపించింది.
వెంటనే విజయభాస్కరుడు కూడా బావిలో దూకాడు. అందులో పడ్డది ఎవరో కాదు.. చారుమతి. 'మరణము అకాలమున రాదు మహిని ఎవ్వనికిన్'.. అంటూ తాను చెప్పిన మాటలనే ఆమె కలవరిస్తున్నది. ఆమెకు ఉపచారాలు చేసి పూర్తిగా స్పృహ వచ్చేలా చేశాడు విజయభాస్కరుడు. అంతలో అక్కడికి యశస్కరుడు వచ్చాడు.
"నీ ఎడబాటుకు గురైన తల్లిని నేను స్వయంగా రక్షిస్తున్నాను" అని చెప్పాడు. "నేను చేసిన తప్పునకు పరిహారంగా నా రాజ్యాన్ని నీకు అర్పిస్తున్నాను. స్వీకరించు" అన్నాడు.
అలాకాదని అతడికేదో సర్ది చెబుతుండగా.. ఓ అందమైన అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చింది.
వేషం చూస్తే జోగినిలా ఉంది కానీ, లక్షణాలను బట్టి చూస్తే రాచకన్య. చారుమతి చేయి పట్టుకుని.. "అత్తా! చెప్పకుండా ఎందుకు వచ్చావు? నువ్వేమైపోయావో అని ఎంత కంగారు పడ్డానో తెలుసా?!" అన్నది.. తన ఆదుర్దాను మాటల్లో కనబరుస్తూ.
విజయభాస్కరుడు అయోమయంగా చూశాడు. చారుమతీదేవి నవ్వుతూ.. "ఆనాడు దొంగలబారినుంచి కాపాడావు కదా.. కలభాషిణి నువ్వే పతివి కావాలని పట్టుబట్టి కూర్చుందట. నువ్వు చనిపోయావని తెలిసి, తండ్రి వేరొక పెళ్లి చేయడానికి నిశ్చయిస్తే.. ఇంట్లోనుంచి పారిపోయి వచ్చింది. నన్ను కంటికి రెప్పలా కాపాడుతున్నది" అన్నది.
విజయభాస్కరుడు బతికే ఉన్నాడనే సంగతి తెలిసి అందరూ ఆనందించారు. అందరూ కలిసి చంద్రప్రస్థ నగరానికి ప్రయాణమయ్యారు. అక్కడికి వెళ్లేసరికి రాజ్యకాంక్షతో కీర్తికేతుడు చంద్రప్రస్థంపై దండెత్తి వచ్చాడని, యుద్ధంలో ఓడిపోయి.. చంద్రగుప్తునికి బందీగా చిక్కాడని తెలియవచ్చింది.
విజయభాస్కరుడు మామగారిని కలుసుకుని, తండ్రిని విడిపించాడు. తప్పు తెలుసుకున్న కీర్తికేతుడు తిరిగి భార్యను, కొడుకును చేరదీశాడు. ఉజ్జయినికి వెళ్లేదారిలో ఆనాడు కలభాషిణిని ఎత్తుకుపోయిన దొంగల స్థావరాన్ని ముట్టడించి.. ఆ దొంగలందర్నీ బంధించాడు విజయభాస్కరుడు. వారు కూడబెట్టిన అపార ధనరాశులను తనతోపాటు తీసుకువెళ్లాడు.
మరికొంతకాలానికి విజయభాస్కరునికి పట్టాభిషేకం జరిగింది. కలభాషిణి, హేమప్రభలతో చాలాకాలం అతడు చిరంజీవిగా వర్ధిల్లాడు.

# గీతామృత స్నానం

**'సకృద్ గీతామృత స్నానం సంసార మల నాశనం' అని 'గీతా మహాత్మ్యం' పలుకుతున్నది. అంటే, 'భగవద్గీత' అనే అమృత జలంతో స్నానం చేసేవారికి సంసార మలం నశించిపోతుంది. కామక్రోధ లోభమోహ మదమాత్సర్యాలే మనిషికి ఆరు శత్రువులు. వాటివల్లనే శోకమోహాలు కలుగుతాయి. ఫలితంగా జన్మమృత్యు పరంపర కొనసాగుతుంది. 'గీతామృత స్నానం' ఆ సంసార మలాన్ని తొలగిస్తుంది. 'గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ నవిద్యతే' అనికూడ 'గీతా మహాత్మ్యం' పలికింది. అంటే, గీతా గంగాజలాన్ని తాగేవారికి పునర్జన్మే ఉండదు.**



శ్రీకృష్ణ భగవానుడు 'గీతా సందేశం' మధ్యమధ్యలో దాని మహిమను పదేపదే చెప్పాడు. 'ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే'. 'అర్జునా! నువు నాపట్ల ఏనాడూ అసూయ లేనివాడవు. కనుక, ఈ పరమగుహ్యామైన జ్ఞానాన్ని, అనుభూతిని నేను నీకు చెబుతున్నాను' (భగవద్గీత: 9-1) అన్నాడు. అంటే, 'గీతా సందేశం అత్యంత రహస్యమైందని, అసూయా రహితుడైన కారణంగా అర్జునునికి తాను చెబుతున్నానని' భగవంతుడు అన్నాడు. 'పరం భూయ ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్' (భగవద్గీత: 14-1) అని మరొక చోట అన్నాడు. అంటే, 'దేనిని తెలిసికొని మునులందరు పరమసిద్ధిని పొందారో.. ఆ సమస్త జ్ఞానంలో ఉత్తమమైన, పరమోత్కృష్టమైన జ్ఞానాన్ని తిరిగి నేను చెప్పబోతున్నాను'.

## ఇదే గీతా మహిమ.

భగవంతుడు చేసిన గానమే భగవద్గీత. 'యుద్ధంలో బంధుమిత్రులను, గురువులను వధించి పొందే విజయం తనకు వద్దని' అర్జునుడు తీవ్ర దుఃఖితుడై కర్తవ్య విముఖతను ప్రదర్శించాడు. అప్పుడు అతనిలో తిరిగి 'కర్తవ్య పరాయణత్వాన్ని' నింపడానికి శ్రీకృష్ణ భగవానుడు చేసిన గానమే 'భగవద్గీత'. అది విన్న అర్జునుడు తన మోహాన్ని, దుఃఖాన్ని, సందేహాలను విడిచిపెట్టి యుద్ధం చేశాడు. చివరకు సంపూర్ణ విజయం సాధించాడు. అందుకే, భగవద్గీత 'విజయగీతి'గా ప్రఖ్యాతి చెందింది. ఇది అర్జునుణ్ని 'అనూహ్య విజయం వైపు'కు నడిపించింది. మానవాళిని కూడా ఓటమినుండి విజయం వైపుకు నడిపించే దివ్య సందేశమే 'భగవద్గీత'.

## సంపూర్ణ వెలుగులు

సందేహాలు, సమస్యలు చుట్టుముట్టినప్పుడు మనిషి తనకంటే ఉన్నతుడైనవాడని భావించే మరొక మనిషిని ఆశ్రయిస్తాడు. ఆ వ్యక్తి పలికే సలహాలను పాటించే ప్రయత్నమూ చేస్తాడు. అతడు బద్ధుడై ఉంటాడు కనుక, అతని మాటలు పూర్తిగా లాభకరమవుతాయనీ చెప్పలేం. మనిషి సత్త్వరజస్తమో గుణాలతో బంధితుడై ఉంటాడు. 'జన్మమృత్యు జరావ్యాధుల'నే నాలుగు కష్టాలతో బంధితుడై ఉంటాడు.

ఆకలిదప్పులు వంటి ఆరు క్లేశాలూ అతణ్ణి కట్టి పడేస్తాయి. అన్నిటికీ మించి అతడు నాలుగు దోషాల నడుమ బంధితుడై ఉంటాడు. అవి: పొరపాట్లు చేయడం (ప్రమాద), మోహానికి గురికావడం (భ్రమ), అసమగ్రమైన ఇంద్రియాలను కలిగి ఉండటం (కరణ పాటవ), మోసప్రవృత్తిని కలిగి ఉండటం (విప్రలిప్స). ఇవి బద్ధమనిషిని పీడించే నాలుగు దోషాలు. అందుకే, అతడు పలికే మాటలు సంపూర్ణం, కాలాతీతం, సార్వజనీనం కాలేవు.

అయితే, భగవంతుడు పూర్ణుడు, గుణాతీతుడు, నాలుగు దోషాలకు అతీతుడు కాబట్టి, ఆయన వాక్కు కాలాతీతం, దేశాతీతమై ఉంటుంది. సర్వకాల సర్వావస్థలకూ అది అన్వయమవుతుంది. భగవద్వాణియైన భగవద్గీత ఈ రకంగానే 'కాలాతీత సందేశం' అయింది. 'శ్రుణు మే పరమం వచః. నా ఉత్తమమైన సందేశాన్ని విను' అని శ్రీకృష్ణుడు అర్జునునికి గీతా సందేశం మధ్యలో చెప్పాడు. భగవద్వాణి మనకు జీవితంలో సంపూర్ణ వెలుగులను ప్రసాదిస్తుంది.

## మూడు రహస్య జ్ఞానాలు

'భగవద్గీత'లో మూడు రహస్యాలు వున్నాయి. అవి: రహస్యం, రహస్యతరం, రహస్యతమం. 'ఈ జగత్తులో తాను అవ్యక్త_రూపంలో వ్యాపించి ఉన్నానని' శ్రీకృష్ణ భగవానుడు 'గీతా సందేశం'లో చెప్పాడు.

ఇది రహస్య జ్ఞానం. ప్రతి జీవి హృదయంలో తాను పరమాత్ముని రూపంలో నిలిచి ఉండి, అతని జీవనగతులను నిర్దేశిస్తున్నానని, ఎవరైతే ఆ రూపాన్ని శరణు పొందుతారో వారు పరమశాంతిని, పరమపదాన్ని సైతం పొందగలరని' గీతాచార్యుడు ఉద్ఘాటించాడు. ఇది 'రహస్యతర' జ్ఞానం. అయితే, తననే స్మరించడం, తనకు భక్తులు కావడం, తనను పూజించడం, నమస్కరించడమనేది 'రహస్యతమ' జ్ఞానమని శ్రీకృష్ణుడు అన్నాడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ. సమస్త ధర్మాలను త్యజించి కేవలం నన్ను శరణు పొందు' అని శ్రీకృష్ణుడు పలికిన విషయమే 'రహస్యతమ' జ్ఞానం.

## అణువణువునా భగవత్ప్రేమ

భగవంతుడు నిరాకార బ్రహ్మ రూపంలో సర్వత్రా వ్యాపించి ఉన్నాడనే 'రహస్యజ్ఞానం' ద్వారా మనిషి పాపభీతితో జీవిస్తాడు. నిజానికి ధర్మాచరణలోనే ఉంటాడు. పుణ్యకార్యాలనే చేపడతాడు. ఆ విధంగా అతని జీవితం పురోగమిస్తుంది. సకల జీవుల హృదయాలలో ఉన్న పరమాత్ముని రూపజ్ఞానమే 'రహస్యతర' జ్ఞానం.

దానిని తెలుసుకోవడం ద్వారా మనిషి జగత్తులో అభయత్వాన్ని పొందుతాడు. తన కార్యాలలో నిశ్చయంగా విజయాన్ని సాధిస్తాడు. సర్వదా ఉన్నత జన్మలనే పొందుతాడు. బుద్ధిమంతుడు కోరుకునేవి ఇవేగా! ఇక సచ్చిదానంద విగ్రహుడైన శ్రీకృష్ణుని గురించి సంపూర్ణంగా తెలుసుకొని, ఆయనను శరణాగతి పొందడం ద్వారా మనిషి మానవజన్మను సఫలం చేసికొని, మోక్షాన్ని పొందుతాడు. భగవత్ప్రేమను తన అణువణువులోనూ నింపుకొంటాడు. సకల మానవాళికి శ్రేయోభిలాషి అవుతాడు. తరతరాలకు మార్గదర్శకుడవుతాడు. ఈ 'రహస్యతమ' జ్ఞానాన్ని తెలుసుకొన్న వారికి 'రహస్య, రహస్యతర జ్ఞానాల వల్ల కలిగే ప్రయోజనాలు కూడా నిశ్చయంగా కలుగుతాయి.

## అనివార్యం.. గీతా శ్రవణం!

మనిషి బతికి ఉండాలంటే శ్వాస తీసుకోవడం అనివార్యం. అది ఇష్టముంటే చేసేది, ఇష్టం లేకపోతే ఆపే పని కాదు కదా. అలాగే, మానవజన్మను సఫలం చేసుకొని, ఇహపరాలలో విజయం సాధించాలంటే భగవత్సందేశ రూపంలోని 'భగవద్గీత'ను విని, ఆచరించవలసిందే. వినకపోతే వినాశనం తప్పదని గీతాచార్యుడే హెచ్చరించాడు.

'నువు నాపట్ల చిత్తం కలవాడవైతే నా అనుగ్రహంతో జీవితంలోని అన్ని ఆటంకాలనూ దాటుతావు. కానీ, నా మాటలు వినకుండా, నేను చెప్పినట్లు చేయకుండా, నీ ఇష్టప్రకారం పనిచేస్తే.. నశిస్తావు' (భగవద్గీత: 18-58) అని శ్రీకృష్ణుడు తీవ్రంగా పలికాడు. కాలాతీతమైన గీతా సందేశాన్ని ప్రామాణిక పరంపరలో తెలుసుకొని, నేర్చుకొని నిత్య జీవితంలో ఆచరించాలి.

గీతా సంస్కృతిని అలవరచుకోగలిగితే సర్వాభీష్టాలను పొందగలం. జీవితంలోని సర్వరంగాలలోనూ విజయాలను సాధించగలం. ఈ స్వానుభవంతో గీతాసందేశ మహిమను సమస్త ప్రపంచానికి చాటి చెప్పవచ్చు. అప్పుడు ప్రపంచ జనులంతా సుఖజీవులవుతారు. సర్వేజనా సుఖినోభవంతు!

# రాశిఫలాలు



**మేషం...**
నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ప్రయత్నకార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభం ఏర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. రుణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహసాలతో ముందుకువెళ్తారు.

**వృషభం...**
వృత్తిలో ఇబ్బందులను అధిగమిస్తారు. ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. మీరు చేసే ప్రతిపనిలో వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. నూతనకార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్యసాహసాలతో నూతనకార్యాలు ప్రారంభిస్తారు.

**మిథునం...**
గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు. బంధు, మిత్రులతో జాగ్రత్తగా ఉండటం మంచిది. చేసే పనులలో ఇబ్బందులు ఉంటాయి. కొత్త పనులను ప్రారంభించడం మంచిదికాదు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

**కర్కాటకం..**
కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. శుభకార్యప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందంగా ఉంటారు. ప్రతయ్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు.

**సింహం..**
పక్కదోవ పట్టించేవారి మాటలు వినకూడదు. క్రీడాకారులకు, రాజకీయరంగాల్లోని వారికి మానసిక ఆందోళన తప్పదు. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంది. స్థిరాస్తుల విషయంలో మిక్కిలి జాగ్రత్త అవసరం. నూతన కార్యాలు వాయిదావేసుకోవడం మంచిది.

**కన్య...**
కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. కఠిన సంభాషణవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్తవహించడం అవసరం. నూతన కార్యాలకు ఆటంకాలు ఏర్పడతాయి. ఇతరులకు హానితలపెట్టే కార్యాలకు దూరంగా ఉంటారు.

**తుల..**
విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. కుటుంబ కలహాలకు దూరంగా ఉంటే మేలు. ఆరోగ్యం గురించి జాగ్రత్తపడటం మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. డబ్బును పొదుపుగా వాడుతారు.

**వృశ్చికం...**
నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభం ఉంటుంది. వినోదాల్లో పాల్గొంటారు. చర్చలు, సదస్సులు మిమ్మల్ని ఆకర్షిస్తాయి. మనోధైర్యాన్ని కలిగి ఉంటారు. శుభవార్తలు వింటారు.

**ధనుస్సు...**
పిల్లలవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. అధికారులతో గౌరవింపబడుతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయడం మంచిది. నూతన వ్యక్తులు పరిచయమవుతారు.

**మకరం...**
ఆకస్మిక ధనలాభం ఉంటుంది. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయడానికి వెనుకాడరు. రుణబాధలు తొలగిపోతాయి. శత్రుబాధలు ఉండవు.

**కుంభం...**
బంధు, మిత్ర విరోధం ఏర్పడకుండా జాగ్రత్త పడటం మంచిది. మానసిక ఆందోళన అధికమవుతుంది. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. అనవసర నిందలతో అపకీర్తి వస్తుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. నూతన కార్యాలకు ప్రణాళికలు వేస్తారు.

**మీనం...**
ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాల వల్ల లాభం చేకూరుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. అన్నివిధాలా సుఖాన్ని పొందుతారు.

# హరే రామ హరే రామ - రామ రామ హరే హరే ?



'బ్రహ్మాండ పురాణం'లోని ఈ 'మహామంత్రం'తో కూడిన బృహత్ 'జపయజ్ఞం'లో భక్తులు అధికసంఖ్యలో భాగస్వాములు కావాల్సిందిగా ఒడిశా జగన్నాథపురి స్వామి చిన్మయ కృష్ణదాస ఇటీవల పిలుపు నిచ్చారు. ఈ మంత్రం గొప్పతనం పై పురాణంలో ఎంతో వివరంగా ఉన్నట్టు ఆయన చెప్పారు. '1000 విష్ణు నామాలూ 1 రామ నామం, 3 రామ నామాలూ 1 కృష్ణనామం. ఈ 'మహామంత్రం'లో కృష్ణని నామం 4 మార్లు వుంది. కనుక, 4 కృష్ణ నామాలూ 12 రామ నామాలు. అలాగే, ఇందులో రామ నామం కూడా 4 మార్లు వున్నందున, 12ం4ా 16 రామ నామాలూ 1 'మహామంత్రం'. ఒక రామ నామం వెయ్యి విష్ణు నామాలకు సమానం కాబట్టి, 16 రామ నామాలూ 16,000 విష్ణు నామాలు. ఈ లెక్కన, 1 మాల (108 పూసలూ౯ 16,000 %ఇ% 108ా 17,28,000 విష్ణు నామాలు. 16 మాలలూ 17,28,000%ఇ% 16ా 2,76,48,000 విష్ణు నామాలు.'మంత్రాలన్నిటిలోకీ రాజువంటిది ఈ మహామంత్రం. అందువల్లే, కలియుగంలో మానవులకు మోక్షాన్ని చేకూర్చే అత్యంత శక్తివంతమైన మంత్రంగా దీనినే శాస్త్రాలు పేర్కొన్నాయి' అని కృష్ణదాస తెలిపారు. ఈ జపయజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, ఎవరికి వారు తమ శక్తి కొలది 'హరే కృష్ణ' మంత్రాన్ని జపించాలని ఆయన చెప్పారు. 'ప్రతి రోజూ కనీసం 10 నిమిషాలపాటు మంత్రాన్ని జపించవలసిందిగా ఆయన సూచించారు. 2021 ఏప్రిల్ 21 శ్రీరామనవమి వరకు అంతా కలిసి 108 కోట్లమేర జపయజ్ఞంలో భాగస్వాములను చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ జపయజ్ఞంలో పాల్గొనాలను కొనేవారు తత్సంబంధ 'జప క్లబ్' గ్రూప్‌లో చేరవలసి వుంటుంది. ఈ జప ప్రభావం వల్ల కరోనా మహమ్మారి నుంచి విముక్తి మనకు లభించగలదని కూడా కృష్ణదాస విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని ఎక్కడివారైనా ఈ జపయజ్ఞం బృందంలో చేరవచ్చు. వాట్సాప్ నంబర్: 89197 17982. లింక్స్: ,

# ఇచ్చేది, ఇప్పించేదీ భగవంతుడే!



పూజలు, వ్రతాలు, నోములు, దానాలు వంటి పుణ్యకార్యాలు ఏవి చేసినా కర్త ఏదో ఫలాన్ని ఆశించడం సర్వసాధారణం. కోర్కెలు లేకుండా ఎవ్వరూ సాధారణంగా పుణ్యకార్యాలు చేయరు. ఎవరైనా నిష్కామంగా అవి చేస్తున్నారంటే నిజంగానే వాళ్లు 'భగవద్విజ్ఞానం' పూర్తిగా అర్థమైనవారని తెలుసుకోవాలి. అటువంటివారు చాలా అరుదు. కోర్కెల కోసం పూజా వ్రతాదులు చేసేవారికి తాము పూజిస్తున్నది దేవతలనో, భగవంతుడినో కూడా తెలియని స్థితి ఉంటుందంటే పొరపాటు కాదు. 'ఎవరిని పూజించినా ఆ పరమేశ్వరునికే చేరుతుంది. అందరూ ఒక్కటే. అన్ని మార్గాలూ చివరికి మనలను చేర్చేది ఒకే గమ్యానికి..' ఇటువంటి మాటలు ఈ విషయాన్నే నిరూపిస్తాయి. 'భగవద్గీత'లో శ్రీకృష్ణ భగవానుడు 'దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి' (7-23) అన్న అసలు రహస్యం చెప్పారు. అంటే, 'దేవతలను పూజించేవారు దేవతాలోకాలకు వెళతారు. కానీ, నా భక్తులు నాదైన పరమలోకానికి చేరుకుంటారు' అన్నారాయన. 'అల్పబుద్ధి కలిగిన మానవులే దేవతలను పూజిస్తారు. కానీ, ఆ దేవతలు ఇచ్చే ఫలాలు పరిమితమైనవి, తాత్కాలికమైనవి' అన్న పలుకులు స్వయాన ఆ దేవదేవునివే అంటే మనందరం తప్పక విశ్వసించాలి. 'దేవతారాధకులది అల్పబుద్ధి' అని శ్రీకృష్ణుడు ఎందుకన్నట్టు? నానారకాల దేవతలను పూజించేవారంతా ఎంతో శ్రద్ధతో, ఏకాగ్రతతో, తపస్సుతోనే తమలోని భక్తిని చాటుతుంటారు. దృఢదీక్షలూ చేపడుతుంటారు. వారి భక్తికి, ఉపాసనకు తగ్గట్లుగానే కోర్కెలు సైతం తీరుతూనే ఉంటాయి. దానితో ఆ దేవతల పట్ల వారిలోని శ్రద్ధ మరింత పెరుగుతుంది. కానీ, ఇక్కడ మనం గ్రహించవలసిన సత్యమొకటున్నది. దానినే శ్రీకృష్ణ భగవానుడు వెల్లడించాడు.'ఎవరేని ఒకానొక దేవతను పూజించగోరగానే నేనే వారి శ్రద్ధను సుస్థిర పరుస్తాను. అలా వారు ఆ దేవతకు అంకితమయ్యేటట్లు చేస్తాను (7-21)'. 'ఇంతటి శ్రద్ధతో వారు ఒక ప్రత్యేకమైన దేవతను పూజించి తమ కోర్కెలను ఈడేర్చుకుంటారు. కానీ, నిజానికి ఆ వరాలన్నీ కేవలం నా ద్వారానే ఇవ్వబడతాయి (7-22)'. చాలామంది ఈ వాస్తవాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అందుకే, వారిని 'అల్పబుద్ధి పరులు'గా దేవదేవుడు 'భగవద్గీత'లో అభివర్ణించాడు. పిల్లలు అమ్మను డబ్బు అడిగితే 'నాన్న ఇచ్చిన డబ్బునే' ఆమె వారికిచ్చినట్టు. ఇదీ అలాంటిదే. తనకు 'అమ్మనే డబ్బు ఇస్తున్నదన్న' అమాయకత్వం ఆ పిల్లలది. కానీ, ఎప్పుడైతే వారు జ్ఞానవంతులవుతారో అప్పుడు నాన్నకు ఆధీనులవుతారు. నాన్న నుంచే నేరుగా అన్నీ పొందుతారు. అయినా, ఆ వేళలోనూ అమ్మపట్ల అనురాగంతో, గౌరవంతోనే ఆ పెరిగిన పిల్లలుంటారు. (ఈ రోజుల్లో ఆడవారూ సంపాదిస్తున్నారు అదే వేరే విషయం). అనేకమంది భక్తుల నైజం ఇలానే ఉంటుంది. వారు అందరు దేవతలను ఆరాధించినా పూజించేది భగవంతుడినే. భగవంతుడు- దేవతల సంబంధం గురించిన ఈ విషయాన్ని తెలుసుకోగలగడమే ఇక్కడ ముఖ్యం. ఫలితంగా మనలోని అల్పబుద్ధిని అధిగమించవచ్చు.ఏకో బహూనాం యో విదధాతి కామాన్ జీవులందరు నిత్యులే. వారిలో మానవులు, దేవతలు కూడా వస్తారు. వారంతా చైతన్యపూర్ణులే. అయితే, నిత్యులలో పరమని త్యుడు, చైతన్యులలో పరమ చైతన్యపూర్ణుడు భగవంతుడే. ఆతడు మాత్రం ఒక్కడే. మిగిలినవారంతా అనంతసంఖ్యలో ఉంటారు. ఆ ఒక్క భగవంతుడే మిగిలిన అందరి అభీష్టాల (కోరికలు)ను తీరుస్తుంటాడు. నిజానికి సర్వుల సకల అభీష్టాలను తీర్చేది, తీర్చగలిగేది దేవదేవుడైన భగవంతుడు మాత్రమే. ఆయన ఇచ్చిన వాటినే దేవతలు తమ చేతుల మీదుగా భక్తులకు ఇస్తుంటారు. ఇటువంటి 'పరమాద్భుత కర్మలు' చేసే భగవంతుడిని తెలుసుకోవాలంటే 'భగవద్గీత' ను ఆశ్రయించవలసిందే. అప్పుడు 'భగవద్విజ్ఞానం'తో కూడిన భగవదాశ్రయం మనకు లభిస్తుంది. ఫలితంగా ఇహపరాలలో సమస్తాభీష్టాలూ నెరవేరుతాయి.

# కర్మ ఫలితమే అదృష్టం

"మనం జీవితంలో ఆచరించే కర్మను బట్టే మన అదృష్టం ఆధారపడి ఉంటుంది. ఇదే జీవిత రహస్యం. అందుకే ఎవరి అదృష్టం వారి చేతల ద్వారానే నిర్ణయించబడుతుంది కానీ మరేది కాదు" అంటారు మహాత్మా కబీరు. శక్తి వంచన లేకుండా చేసే కృషి వల్లే అదృష్టం కలుగుతుందనేది కబీరు అభిప్రాయం. కష్టేఫలే, కృషితో నాస్తి దుర్భిక్షం అని మన పెద్దలు చెప్పిందీ ఇదే.మనిషి జీవితం ఎన్నెన్నో మలుపులు తిరుగుతుంటుంది. ప్రతి మలుపూ ఏదో ఒక ప్రభావాన్ని చూపుతుంది. మనం చేసే మంచి పనులు మన అదృష్టాన్ని నిర్ణయిస్తాయని కొందరంటే మనం గతంలో చేసుకున్న దాన్ని బట్టే ఈ స్థితి అని మరికొందరంటారు. విష్ణుమూర్తి ఈ భూమ్మీద రామునిగా అవతరించి.. తనకు ఎదురైన కష్టాలను సహనంతో ఎదుర్కొని, నిరంతరం సత్కర్మలను ఆచరించి పురుషోత్తముడయ్యాడు. శ్రీకృష్ణుడు కూడా.. అదృష్టం కోసం ముక్కుమూసుకుని తపస్సు చేయాలని చెప్పలేదు. పూజలు, వ్రతాలు, ఉపవాసాలు చేయాలని బోధించలేదు. సంసారం దుఃఖసాగరమని నిరాశపడకుండా మనిషి సహజ స్వభావమైన కర్మ చేయాలని, ఆ చేసేదేదో మంచి కర్మ చేయాలని అర్జునికి బోధిస్తాడు. అంటే మంచి పనులే మనిషికి అదృష్టాన్ని తెచ్చిపెడుతూ మనిషి సుఖసంతోషాలతో జీవించే అవకాశం కల్పిస్తుందని పరమాత్ముని బోధనసారం."మనిషి నిస్వార్థంతో చేసే మంచి పనుల వల్లే మంచి ఫలితం సిద్ధిస్తుంది. సిద్ధాంతాలు, మతాచారాలకు అతీతంగా.. అనుక్షణం స్వార్థ రహితమైన కర్మను ఆచరించడమే ప్రతి మనిషి పరమావధి. అలా చేయడంవల్ల ఒనగూరే ఫలితాలెన్నో!" అన్నారు స్వామి వివేకానంద. ఒక్కొక్కప్పుడు మంచి పనులతో మనిషి కష్టాలెదుర్కొనే పరిస్థితి రావచ్చు. అలాంటి సందర్భాల్లో ధైర్యంగా వాటిని ఎదుర్కొంటే అంతిమంగా మంచి ఫలితమే లభిస్తుంది. సత్య హరిశ్చంద్రుడు తాను ఇచ్చిన మాటను నెరవేర్చడం కోసంఅష్టకష్టాలను భరించడమే గాక, భార్యాబిడ్డలను సైతం అమ్ముకున్నాడు. తాను కాటికాపరిగా మారాడు. ఎన్ని కష్టాలెదురైనా.. సత్యాన్ని విడువకుండా ప్రయత్నించి భగవత్ సాక్షాత్కారాన్ని పొందాడు. అదీ సత్కర్మల శక్తి.

# గురితప్పిన కత్తి



**విక్రమార్క చక్రవర్తి కుమారుడు కీర్తికేతుడు పరమలోభి. అతడి కుమారుడు విజయభాస్కరుడు.. తాతలా దయాపరుడు. తండ్రి విధించిన మరణశిక్ష నుంచి తప్పించుకుని తల్లితో కలిసి వెళ్తూ, దారిమధ్యలో కలభాషిణి అనే రాచకన్యను రక్షించాడు. ఆ యువతిని కాపాడినందుకు ఆమె తండ్రి ఇచ్చే బహుమానాన్ని నిగమశర్మ అనే బ్రాహ్మణునికి వచ్చేలా చేశాడు. ఆ తర్వాత, రత్నకూట నగరానికి చేరుకున్నాడు. అక్కడ రాజు ఇవ్వజూపిన బంగారానికి ఆశపడి, దేవభట్టు అనే బ్రాహ్మణ దంపతులు తమ కుమారుణ్నే బలివ్వబోయారు."అన్నా! చూశావా ఈ దారుణం. నా తండ్రి చివరికి నన్ను బలివ్వడానికి సిద్ధపడ్డాడు" అన్నాడు గుణసాగరుడు గోలుగోలున ఏడుస్తూ. విజయభాస్కరుడు అతణ్ని ఓదార్చాడు. దేవభట్టు ముందుకు వెళ్లి.. "అయ్యవారూ! నేను మీ కుమారునికి అభయమిచ్చాను. అతనికి బదులుగా నన్ను రాజుగారి దగ్గరికి తీసుకు వెళ్లండి. మీ కుమారుడినని చెప్పండి. నన్ను బలి ఇచ్చి, ఆ బంగారు విగ్రహాన్ని పొందండి" అన్నాడు.దేవభట్టుకు ఆశ్చర్యం, ఆనందం ముప్పిరిగొన్నాయి. అతడి భార్య ఈ పనికి ముందు ఒప్పుకోలేదు. కానీ, విజయభాస్కరుని పట్టుదల వల్ల ఆమెకూడా సరేనన్నది.**

చివరిలో విజయభాస్కరుడు ఒక షరతు పెట్టాడు. దానిప్రకారం.. 'రాబోయే బహుమతిలో సగభాగం గుణసాగరునికి ఇవ్వాలి. అతణ్ని కూడా మిగిలిన పిల్లలతో సమానంగా చూడాలి'. అందుకు దేవభట్టు దంపతులు ఒప్పుకొన్నారు. ఆ మరునాడు తల్లికి తెలియకుండా దేవభట్టు దంపతుల వెంట వెళ్లాడు విజయభాస్కరుడు. వాళ్లు ముగ్గురినీ తీసుకుని మర్రిచెట్టు వద్దకు వెళ్లాడు చంద్రావలోకుడు. అక్కడ విజయభాస్కరుణ్ని వెల్లకిలా పడుకోబెట్టి, కాళ్లూ చేతులను దేవభట్టు దంపతులు పట్టుకున్నారు. మరోక్షణంలో కత్తివేటు పడబోతున్నదనగా.. "ఆగు" అన్న అరుపు వినిపించింది. అప్పుడు ఆ బ్రహ్మరాక్షసుడు.. "రాజా! చూశావా.. ఆ దంపతులిద్దరి కన్నుల్లో చుక్కనీరు లేదు. పైగా వాళ్ల ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి. నాకేదో అనుమానంగా ఉంది. ఈ కుర్రాడు వాళ్ల కొడుకేనా? సరిగ్గా కనుక్కో" అన్నాడు హుంకరిస్తూ. చంద్రావలోకుడు కత్తి ఝళిపించాడు. దేవభట్టు దంపతులు గడగడ వణికిపోయారు. అప్పుడు విజయభాస్కరుడు కల్పించుకుని.. "అయ్యా! నన్ను కొడుకుగా భావించమని నేనే వాళ్లతో చెప్పాను. నేను స్వచ్ఛందంగానే బలి కావడానికి వచ్చాను. ఇందులో వారి తప్పేమీ లేదు" అని చెప్పాడు. "బలి కావడానికి స్వచ్ఛందంగా వచ్చావా? ఎవడవురా నువ్వు" అన్నాడు బ్రహ్మరాక్షసుడు విస్తుపోతూ. "నేను విక్రమార్క మహారాజుగారి మనవడిని. నాపేరు విజయభాస్కరుడు" చెప్పాడతను.

ఆ మాటలు వింటూనే బ్రహ్మరాక్షసుడు కూర్చున్న చోటునుంచి గబుక్కున లేచాడు. విజయభాస్కరుని ముందు సాగిలపడ్డాడు.

"దేవా! బేతాళుడు మా ఏలిక. ఆయనకు ప్రభువు విక్రమార్కులవారు. వారి మనుమలంటే.. మీరు మాకు పూజనీయులు. నా తప్పిదాన్ని మన్నించండి. ఈ చంద్రావలోకుడి వల్లే నాకు మీ దర్శనం కలిగింది. ప్రభూ! నాకు మీ పాదస్పర్శను అనుగ్రహించండి. దానివల్ల శాపవిమోచనం పొందుతాను" అని వేడుకున్నాడు.విజయభాస్కరుని పాదాలను తాకగానే బ్రహ్మరాక్షసుడు తేజోరూపాన్ని ధరించి, అక్కడినుంచి వెళ్లిపోయాడు.

అప్పుడు చంద్రావలోకుణ్ని ఉద్దేశించి.. "రాజా! మీరు చెప్పిన ప్రకారం ఆ బంగారు విగ్రహాన్ని ఈ దంపతులకు ఇప్పించండి" అన్నాడు భాస్కరుడు.

చంద్రావలోకుడు ఆనందంగా అంగీకరించాడు.

"కుమారా! నువ్వు మాకు మహోపకారం చేశావు. నాతోపాటు నా రాజ్యానికి వస్తే నిన్ను సోదరునిలా చూసుకుంటాను" అన్నాడు.

కానీ, ఆ ప్రతిపాదనకు విజయభాస్కరుడు అంగీకరించలేదు. దేవభట్టు ఇంటికి వెళ్లి, తన తల్లిని తీసుకుని ఆ రాజ్యంనుంచి నిష్క్రమించాడు. కొద్దిరోజుల ప్రయాణం తరువాత శోభావతి అనే పట్టణానికి చేరుకున్నాడు.

ఆ పట్టణాన్ని ఏలే యశస్కరుడు సహృదయుడు అని తెలుసుకుని, ఒకనాడు కొలువు కూటానికి వెళ్లాడు విజయభాస్కరుడు. అతని రూపురేఖలను గమనించిన ఆ రాజు.. "కుమారా! ఎవరు నువ్వు? నీది ఏ దేశం? నీ తల్లిదండ్రులెవ్వరు? ఏపని మీద ఇక్కడికి వచ్చావు?" అని ఔదార్యంతో ప్రశ్నించాడు.

అందుకు సమాధానంగా..

"నా పేరు విజయభాస్కరుడు. నేను క్షత్రియుణ్ని. ఒక కారణం చేత తండ్రికి దూరమై, నా తల్లితో కలిసి ఈ పట్టణానికి వచ్చాను. ప్రస్తుతం ఉద్యోగం కోరి మీ కొలువుకు వచ్చాను. నెలకు నూరు వరహాలు వేతనంగా ఇచ్చి, నీచపు పనులకు వినియోగించకుండా ఉంటే మీ కొలువులో ఉండగలను" అని విజయభాస్కరుడు చెప్పాడు.

"సరే.. నువ్వు కోరినంత వేతనం ఇస్తాను. నీకేం ఉద్యోగం ఇవ్వాలో తరువాత ఆలోచిద్దాం" అని అప్పటికి యశస్కరుడు కొలువు చాలించాడు.

ఆనాటినుంచి రాజోద్యోగులకు ఉచితమైన వేషాన్ని ధరించి, ప్రతిరోజూ కొలువుకు వెళ్లేవాడు విజయభాస్కరుడు. అతనికి ఏ పనీ చెప్పకుండా తన ఎదురుగా కూర్చోబెట్టుకునేవాడు యశస్కరుడు.

అలా కొంతకాలం గమనించిన తరువాత, విజయభాస్కరుని గుణశీలాలను గురించి యశస్కరుడు ఒక అంచనాకు వచ్చాడు. అంతఃపుర రక్షణాధికారిగా నియమిస్తూ ప్రకటన పత్రాన్నిచ్చాడు. విజయభాస్కరుడు బాధ్యతలు చేపట్టాడు. ఆనాటినుంచి అంతఃపురంలో భద్రత కట్టుదిట్టం అయింది. కొద్దిరోజులు అంతా బాగానే గడిచింది.

యశస్కరునికి ముగ్గురు రాణులు ఉన్నారు. మూడురోజులకు ఒకరి వద్ద చొప్పున రాజు తన భార్యలతో గడుపుతుంటాడు. విజయభాస్కరుని రాక తరువాత అంతఃపురంలో పోతుటీగకు కూడా ప్రవేశం లేకుండా పోయింది. స్త్రీలకు సైతం రాకపోకలు సాగించాలంటే అనుమతి తప్పనిసరి అయింది.

యశస్కరుని చిన్నభార్య పేరు మంజువాణి. ఆమెకు సుముఖుడనే మంత్రితో సంబంధం ఉండేది. భర్త తన వద్దకు రానిరోజుల్లో సుముఖుణ్ని రహస్యంగా తనవద్దకు రప్పించుకునేది. కానీ, విజయభాస్కరుని వల్ల మంజువాణి ప్రేమ కలాపాలకు ఆటంకం ఏర్పడింది.దాంతో ఒకరోజు సుముఖుడు స్త్రీవేషం ధరించి, కొన్ని నకిలీ పత్రాలు తయారుచేసి.. అతికష్టం మీద మంజువాణి వద్దకు వెళ్లాడు. తెల్లవారుజామున మళ్లీ స్త్రీవేషంలోనే తిరిగి బయటికి వెళ్లడానికి ప్రయత్నించబోతే.. "తెల్లవారే వరకు బయటికి వెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదు" అని విజయభాస్కరుడు అడ్డుకున్నాడు.

అప్పుడు మంజువాణి కలగచేసుకోవాల్సి వచ్చింది. స్వయంగా తానే విజయభాస్కరుడు ఉండేచోటుకు తరలివచ్చి, మంత్రిని ఎలాగో బయటికి పంపగలిగింది. కానీ, విజయభాస్కరుడి రూపలావణ్యాలను చూసేసరికి ఆమెకు కన్ను చెదిరిపోయింది. ఆ రోజంతా ఆమెకు మనసు మనసులో లేదు. రాత్రివేళ పనేమీ లేకపోయినా విజయభాస్కరుడు ఉన్నచోటుకు వెళ్లి, ఏదో ఒకటి కల్పించుకుని మాట్లాడటం మొదలుపెట్టింది. రెండర్థాలు వచ్చే మాటలతో అతణ్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించింది. కానీ, అనుభవ లేమితో విజయభాస్కరుడు ఆమె చెప్పేది సరిగా అర్థం చేసుకోలేకపోయాడు.

"అతడికి ముల్లోకాలనూ మోహింప చేయగలిగిన సౌందర్యం ఇచ్చిన బ్రహ్మదేవుడు.. కాస్తంత రసికత్వాన్ని కూడా ఇచ్చి ఉంటే నాకీ పాట్లు లేకపోవును కదా!" అన్నది రాణి.. దాసిముందు గోడు వెళ్లబోసుకుంటూ.

"మాటలతో లాభం లేనప్పుడు క్రియలోకి దిగడమే!" అని సలహా చెప్పింది దాసి.ఆమె సలహాను అనుసరించి మరునాటి రాత్రి, విజయభాస్కరుడు కత్తి చేతబట్టుకుని పహరా కాస్తుండగా వెనుకమాటుగా వెళ్లి అతణ్ని కౌగిలించుకుంది మంజువాణి. విజయభాస్కరుడు అతిప్రయత్నం మీద ఆమె పట్టు విడిపించుకున్నాడు.

"ద్రోహురాలా! ఎంత పనిచేశావు? నిన్నేం చేసినా పాపం లేదు" అంటూ కత్తి ఎత్తి.. చంపడానికి చేతులురాక దాన్నక్కడే పడేసి విసవిసా వెళ్లిపోయాడు.

కామం తీరకపోతే క్రోధం ఆవేశిస్తుంది. అటువంటి క్రోధం మానవుణ్ని మూఢుణ్ని చేస్తుంది. మంజువాణి అనాలోచితంగానే కిందపడ్డ కత్తిని చేతిలోకి తీసుకుంది. వెళ్లిపోతున్న విజయభాస్కరునిపైకి విసిరింది.

ఆమె దురదృష్టం.. కత్తి గురి తప్పింది. వెనుకవాటున కత్తి వస్తున్నదని గమనించని విజయభాస్కరుడు ముందుకు వెళ్లిపోయాడు. మంజువాణి మందిరంలో దూరడానికి అక్కడే కాచుకుని కూర్చున్న సుముఖుడి గుండెల్లో దిగింది ఆ కత్తి. ఆ దృశ్యం చూసి, మంజువాణి మ్రాన్పడిపోయింది. ఆమె దాసి రంగప్రవేశం చేసి.. మంత్రి సుముఖుని మృతదేహాన్ని ఎత్తి కందకంలో పడదోసింది. ఆ తతంగమంతా పూర్తయ్యేసరికి తెల్లవారింది.

అప్పుడు యశస్కరుని వద్దకు వెళ్లి..

"మహారాజా! విజయభాస్కరుడు చేసిన దుష్కృత్యం చూశారా? మహారాణిగారిపై అత్యాచారం చేయబోయాడు. మాకేం చేయాలో తోచక, మంత్రి సుముఖులవారికి కబురు చేశాం. అతగాడు ఆయనతో ఘర్షణ పడుతున్నాడు. ఏం చేస్తాడో ఏమో.. మీరే కాపాడాలి" అన్నది దాసి.

యశస్కరుడు పరుగు పరుగున వచ్చాడు. అక్కడ ఎవరూ లేరు. ఇంతలో భటులు వచ్చి.. 'సుముఖుల వారి శవం కందకంలో తేలుతున్నది' అని వార్తను అందించారు. దాంతో కోపోద్రిక్తుడైన రాజు సూటిగా విజయభాస్కరుని ఇంటికి వెళ్లాడు. అప్పటికే తన తల్లితో కలిసి, ఆ రాజ్యం విడిచిపెట్టి పోవడానికి సిద్ధమవుతున్న భాస్కరుణ్ని బంధించాడు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టాడు. తన కళ్లముందే దాసి చెప్పిన సాక్ష్యాన్ని విన్న విజయభాస్కరుడు నిశ్చేష్టుడయ్యాడు.

"దీనికి నీ సమాధానం ఏమిటి? నువ్వు నేరం చేయలేదని నిరూపించుకోగలవా?" అన్నాడు యశస్కరుడు.

తను నిరపరాధినని నిరూపించే సాక్ష్యమేదీ లేదు. 'సుముఖుడు ఎలాగూ చనిపోయాడు. ఇకనుంచైనా మంజువాణి బుద్ధి తెచ్చుకుని తన ప్రవర్తన చక్కదిద్దుకుంటే అంతే చాలు!' అనుకున్నాడు విజయభాస్కరుడు. రాజు అడిగినదానికి సమాధానం చెప్పకుండా మౌనం దాల్చాడు. "ఇతడు మౌనంగా ఉండటాన్ని బట్టి నేరం చేసినట్లు తెలుస్తున్నది. ఈ తప్పునకు సరైన దండన ఉరిశిక్ష" అని తన అభిప్రాయం చెప్పాడు న్యాయ మంత్రి.

కానీ, యశస్కరునికి మనసు ఒప్పలేదు.

"ఇతడి ముఖంలో ఎక్కడా అపరాధభావం లేదు. నేరం చేసి ఉంటాడంటే అంగీకరించ లేకపోతున్నాను. ప్రత్యక్ష సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుని, ఇతడికి ద్వీపాంతరవాస శిక్ష విధిస్తున్నాను" అని తీర్పు చెప్పి, సింహాసనం నుంచి పైకి లేచాడు యశస్కరుడు. బంధితుడైన విజయభాస్కరుణ్ని భటులు సముద్రతీరానికి తీసుకుపోయి ఓడ ఎక్కించారు.

అన్నెంపున్నెం ఎరుగని తన కుమారునికి అంతటి శిక్షపడిందని తెలిసి చారుమతీదేవి కన్నీరు మున్నీరుగా విలపించసాగింది.

ఆ రాత్రికి యశస్కరునికి నిద్రపట్టలేదు. మారువేషం ధరించి పట్టణంలో తిరుగాడసాగాడు. ఒక ఇంటి అరుగుమీద కూర్చుని ఉండగా లోపలినుంచి వినిపించిన ఆ ఇంటివారి మాటలు అతణ్ని ఆలోచనలో పడేశాయి.

"ఆ పిల్లవాణ్ని శిక్షించడం అన్యాయం" అన్నది ఓ స్త్రీ గొంతు.

"అన్యాయం అంటావేమిటి? మహారాణినే చెరబట్టాలని ప్రయత్నించినవాణ్ని శిక్షించరా? రాజుగారింకా మంచివాడు కాబట్టి ఉరి తీయించలేదు" అన్నాడు భర్త.ద"ఆ మంజువాణికి సుముఖుడికి ఉన్న సంబంధం.. మీ మహారాజుకి తప్ప లోకానికంతటికీ తెలుసు. అర్ధరాత్రిపూట అత్యాచారం జరిగితే అంతఃపురంలో ఎవరూ లేనట్లు ఎక్కడో ఉన్న మంత్రిగారికి కబురు చేశారట. ఎక్కడన్నా విన్నామా ఈ విడ్డూరం?! మీకూ, మహారాజుకూ మతి లేకపోతే సరి. నాకే గనక న్యాయాధికారం ఇస్తే తేల్చి ఉండేదాన్ని వీళ్ల సంగతి" అన్నది భార్య. ..ఆ మాటలన్నీ జాగ్రత్తగా విన్న యశస్కరుడు తిరిగి అంతఃపురానికి వచ్చాడు. మరునాడు తెల్లవారుతూనే ఆ భార్యాభర్తలను, విజయభాస్కరుని పొరుగువారిని కూడా కొలువుకూటానికి రప్పించాడు.

ముందుగా పొరుగువారిని ప్రశ్నించి, విజయభాస్కరుని ప్రవర్తన గురించి తెలుసుకున్నారు. వాళ్లంతా ముక్తకంఠంతో అతడు సత్యసంధుడని, ఏ మచ్చలేని గుణశీలాలు కలవాడని చెప్పారు.ఆ తరువాత గతరాత్రి తనకు జ్ఞానోదయం కలిగించిన స్త్రీమూర్తికి నమస్కరించి.. "తల్లీ! నేను న్యాయం చేయలేని అసమర్థుడినయ్యాను. దయచేసి ఈ సమస్య తీర్చు. నీకు అన్ని అధికారాలూ అప్పగిస్తున్నాను" అన్నాడు.ఆమె ముందుగా తబ్బిబ్బు పడ్డా, రాజు ప్రోత్సాహంతో కార్యరంగంలోకి దూకింది. మంజువాణి మందిరంలో శోధించి, సుముఖుడు ఆమెకు రాసిన ప్రేమలేఖలు వెలికి తీసింది. ఆ తరువాత దాసీలను విడివిడిగా ప్రశ్నించి.. వారి సాక్ష్యాలన్నీ ఒకదానికొకటి పొంతన లేవని తేల్చింది. దాంతో యశస్కరుడు హతాశుడైపోయాడు. ద్వీపాంతరానికి పంపిన ఓడను హుటాహుటిన వెనక్కి పిలిపించండని ఆజ్ఞలు జారీ చేశాడు. కానీ, అప్పటికే పరిస్థితి చేయిజారిపోయింది.

## ఎవ్వల కర్మ ఆల్లదే.. అత్యాశకు పోయి బిచ్చపాయినెకు

## బదులు ముక్కు, శెవులు కోయించుకున్న మంత్రి



ఒక రాజ్యానికి రాజు, మంత్రి ఉండెటోల్లు. ఇద్దరు మంచోల్లే! కాకుంటే.. మంత్రే జర ఆశపోతు. పైస అత్తందంటే.. పానం బోయినా వాయె గానీ పైస గావాలనెటోడు. ఆల్ల రాజ్యంలనే ఒక బిచ్చపాయినె ఉంటుండే. చిన్నప్పుడే ఆని అవ్వ – అయ్య సచ్చిపేయిండ్లు. ఎన్క ముంగట ఎవ్వలు లేకపోయెటాల్లకు.. ఆల్లనీల్లను అడుక్కుంట బతుకుతుండె. పొద్దుగాల లేవంగనే.. ఇల్లిల్లు తిరుక్కుంట, గంట గొట్టుకుంట అడుక్కుంటుండె. ఇక ఆ రాజ్యానికి రాజు.. కవులు, పండితులు, ఆల్లు ఈల్లు ఎవ్వల్లచ్చినా.. ఉత్తి చేతులతోని వంపెటోడు గాదు. గీ ముచ్చట ఎరుకైన ఆ బిచ్చపాయినె ఎట్లనన్న రాజుతానికి వోయి దానం బట్టాలెనని అనుకున్నడు. పొద్దుగాలనే రాజు తానికి వోయి, గనగన గంట గొట్టిండు. "దానం బట్టనీకి ఎవలో అచ్చిండ్లు. ఆల్లను తోల్క రా!" అంట సిపాయికి జెప్పిండు రాజు. ఆన్ని రాజు తానికి దోల్కవోయిండు సిపాయి. అయితే.. బిచ్చపాయినెకు ఓ ఊతపదముంది. ఎవ్వలు దానం జేసినా.. 'ఎవ్వల కర్మ ఆల్లదే' అంటడు. రాజు తానగూడ గట్లనే అంట చెయ్యి జాపిండు. రాజుకు ఆని మాటలు కొత్తగ గొట్టినయి. బటులకు జెప్పి ఆనికి బొచ్చెనిండ పైసలిప్పిచ్చిండు. ఇదంత జూత్తున్న మంత్రికి ఎట్లనో అనిపిచ్చింది. 'ఉత్తి పుణ్యానికి బొచ్చెడు పైసలు దొబ్బుక వోయిండు! ఎట్లనన్న ఆయిన్ని పోతం బెట్టాలె!' అనుకున్నడు. ఆన్ని దగ్గరికి విల్సుకొని.. "రేపు మల్ల రా!" అంట జెప్పిండు. తెల్లారిగూడ రాజు తానికి అచ్చిండు బిచ్చపాయినె. ఆడు అచ్చేది దూరంకెల్లి జూశిన మంత్రి.. ఆన్ని దగ్గరికి విల్సుకున్నడు. "అరేయ్! నీ నోట్లెకెల్లి కంపు ఆసనత్తందట. నువ్వు రాజుగారి మొకం సూసుకుంట మాట్లాడకు" అంట జెప్పిండు. రాజు తానికి వేయినంక, ఈడు రాజు ఈపుకెల్లి మొకం బెట్టి.. 'ఎవ్వల కర్మ ఆల్లదే' అంట మొదలువెట్టిండు. ఎన్కకు తిర్గి మాట్లాడుట్ల రాజుకు కోపం నశాలానికి అంటింది. గదే ముచ్చట మంత్రితోని అన్నడు. మోక ఎప్పుడు దొర్కుతదా అని సూత్తున్న మంత్రి.. "అయ్యా! మీ నోట్లెకెల్లి కంపు ఆసనత్తందట. గందుకే ఈపు దిక్కు దిర్గి మాట్లాడుతుండు" అంట జెప్పిండు. ఆ మాటినంగనే ఆని మీద రాజుకు మస్తు కోపమచ్చింది. పాపమంట దానంజేత్తె.. పతీజంత తీశిండని, ఆనికి బుద్ధి జెప్పాల్నని అనుకున్నడు. ఆన్ని విలిశి.. 'ఈ కాయిదం దెచ్చినోల్ల ముక్కు, శెవులు కోయిండ్రి' అంట రాశి, మడ్తవెట్టి ఆనికి ఇచ్చిండు. "దీన్ని దీస్కవోయి తలారికియ్యి. నూరు ఎండి రూపాలిత్తడు" అంట జెప్పిండు రాజు.

ఇగ 'ఎప్పుడా !?' అని కాసుగ్గాసున్న మంత్రి.. ఆడు అవుతలికి రాంగనే ఆని తానికెల్లి కాయితం గుంజుకున్నడు. "చల్!" అంట ఆన్ని అవుతలికి ఎల్లగొట్టిండు. శేతులకచ్చిన కొత్తలు ఎటుగాకుంట వాయెనన్న బాధతోని.. 'ఎవ్వల కర్మ ఆల్లదే' అనుకుంట వేయిండు ఆ బిచ్చపాయినె. మన మంత్రి.. ఎంటనే కాయితం దీస్కోని తలారి తానికి వోయిండు. ఆ తలారాయినె కొత్తోడు. ఆ దినాన్నె కొలవుల జేరిండు.. ఆనికి మంత్రి ఎవలో దెల్వది. మంత్రి ఇచ్చిన కాయితం సదివి.. ఎంటనే ముక్కు, శెవులు గోసి శేతుల వెట్టిండు. లబోదిబో అనుకుంట మంత్రి నెత్తీనోరు గొట్టుకుంట మొత్తుకున్నడు. ఎప్పటి తీర్గనే తెల్లారి అడుక్కునేందుకు రాజు తానికి వోయిన బిచ్చపాయినె ముక్కు, శెవులు మంచిగుండె వరకు రాజు పరేశానైండు. అంతట్లకే ముక్కు, శెవులకు పట్టీలు గట్టుకొని అచ్చిన మంత్రిని సూడంగనె.. ముచ్చటంత అర్తమైంది. 'ఎవ్వల కర్మ ఆల్లదే' అనుకుంట బిచ్చపాయినె రాజు ముంగట శెయ్యి జాపిండు. కతంత ఎరుకైన రాజు పకపక నవ్విండు.

# అమ్మే తొలి గురువు



పుస్తకాలనూ, మనుషులనూ, పరిసరాలనూ, జీవితాలనూ.. అన్నిటినీ, అందరినీ.. చదవడం మాకు నేర్పింది అమ్మే. అందుకే.. ఆమే మా తొలి గురువు. ఎవరి అమ్మ వాళ్లకు గొప్ప. అలాగే మా అమ్మలా ఏ తల్లీ ఉండదేమో అన్నంత గొప్ప.. మాకు మా అమ్మ!చిన్నప్పుడు మాకు ఆటల్లో (నే అనుకోండి) ఎవరితోనైనా చిన్నపాటి గొడవొస్తే.. వెంటనే కాకపోయినా, తరువాతైన అమ్మ దగ్గరికి పరిగెత్తి వెళ్లి చెప్పేవాళ్లం. ఫలానా శ్యామల ఇట్లా అన్నదని చెబితే.. అమ్మ ఎందుకనో వెంటనే స్పందించేది కాదు. పనంతా అయ్యాక.. "ఆఁ! ఇప్పుడు చెప్పు.. ఏమైంది?" అని అడిగేది. అప్పటికి మా కోపమో, బాధో సగం చల్లబడేది. మేం మళ్లీ.. 'శ్రీరాముని చరితమునూ తెలిపెదమమ్మా!' అన్నట్టుగా.. శ్యామల అన్న మాటలు చెప్పేవాళ్లం. అప్పుడు అమ్మ.. ప్రాసిక్యూషన్ లాయర్ లా.. "అసలు ఎక్కడ మొదలైందో చెప్పు! నువ్వు ఏమనకుండనే శ్యామల గట్లెందుకంటది? ముందు లొల్లి ఎట్ల పుట్టిందో చెప్పు!" అనడిగేది. మేం మొత్తం చెప్పాక.. మా తప్పయితే.. "గదే మరి, గట్ల చెప్పు! నువ్వన్న మాట మొదలే చెప్పవేంది? నువ్వు అట్ల అంటె.. గా పిల్ల గిట్లన్నది. నువ్వు అట్ల మాట్లాడుడు తప్పు గాదా! రేపు బడికి పోయినంక శ్యామలతోని చెప్పు.. 'నాదే తప్పయింది' అని సరేనా?" అనేది. ఒకవేళ అవతలి వాళ్లది తప్పయితే.. "సరేలే! నీదేం తప్పు లేదు. ఆ పిల్లకు అట్ల ఎందుకు అనిపించిందో! ఎందుకు అన్నదో! ఇగ ఆ సంగతి ఒదిలిపెట్టు. అట్లని మాటలు గిన బంజేసేవు.. అదింకా తప్పు!" అని చెప్పేది. మాకు శత్రువులే లేరు. ఎవరినైనా కలుపుకొని పోవడమే తప్పు.. గొడవ పెట్టుకోవడం, మాటలు మానేయడం మాకు తెలియదంటే.. అది అమ్మ పెంపకంలోని గొప్పదనమే! అమ్మ మాకు రకరకాల కథలు చెప్పేది. జంతువుల కథలు, రాజుల కథలు, దేశభక్తి కథలు, నీతి కథలు.. ఇలా ఎన్ని చెప్పినా, అందులో మాకు ఉపయోగపడే ఏదో ఒక విషయం తప్పకుండా ఉండేది. అలా లేని మూసకథలు అసలు చెప్పేదే కాదు. మా పిల్లలను కూడా కథలు చెప్పింది అమ్మ. సహజంగా అమ్మకు హాస్యం ఇష్టం. అక్బర్ బీర్బల్, తెనాలి రామకృష్ణ, మౌల్వీ నసీరుద్దీన్ కథలు బాగా చెప్పేది. ప్రతి మామూలు సందర్భంలోంచి ఎంతో కొంత హాస్యం వెతుకుతుంది. ఏ విషయమైనా ఆమె చెప్పే విధానంలోనే నవ్వు వస్తుంది. ఒకసారి మా ఇంటికి బాగా రాత్రయ్యాక బంధువులొచ్చారు. అన్నం అయితే వండుతారు గానీ.. పల్లెటూర్లో అప్పటికప్పుడు కూరలేముంటాయి? ఆపద్బంధువుల్లాగా వడియాలు, మామిడి వరుగులు, చల్ల మిరపకాయలు, చిట్లపొడి, కందిపొడి, ఊరగాయలు ఇలాంటి సందర్భాల్లో పనికి వచ్చేవి. ఉన్న కూరలు మగవాళ్లకు వేసి.. అదనంగా చింతకాయ పచ్చడి వడ్డించింది అమ్మ. వెంటనే అందులో పెద్దాయన.. "ఆహాఁ! గింత రాత్రి అయినా ఎంతమంచి భోజనం పెట్టినవే శకుంతలా! నీచేత ఏది చేసినా అమృతం! గీ చింతకాయ తొక్కు ఇంట్ల ఉంటె ఏ రంది ఉండది. కన్నతల్లి ఉన్నట్టె!" అన్నాడు లొట్టలేసుకుని తింటూ. "అట్లనే గీ కన్నతండ్రిని గూడ తిని చెప్పండి, బాగున్నదో లేదో!" అంటూ మామిడికాయ నిలువ పచ్చడిని కంచంలో వేసింది అమ్మ. కొంచెం సేపటికి ముసలాయనకు విషయం అర్థమై పకాలించి నవ్వాడు. "ఏమి జోకు ఏసినవే మనుమరాలా! పోతన వంశస్తురాలివైతివి. నీక్కూడా కవిహృదయం ఉన్నది" అని అమ్మను మెచ్చుకున్నాడు. ఎవరింటికీ.. వాళ్లు పిలవకుండా భోజనాల సమయంలో వెళ్లొద్దని అమ్మ చెప్పేది. ఎందుకంటే వాళ్లు మనల్ని తినమనకుండా ఉండలేరు. ఒకవేళ అంటే గనక.. అందుకు సరిపడా భోజనం ఉండకపోతే వాళ్లను ఇబ్బంది పెట్టినవాళ్లం అవుతాం! అదే మనింట్లో మనం ఏది తింటున్నా.. ఆ సమయంలో ఎవరైనా వస్తే, వాళ్లకు ఇవ్వకుండా తినొద్దని ఇప్పటికీ చెబుతుంది. మేం ఎవ్వరితోనూ ఒక్కమాట కూడా అనిపించుకోకుండా ఉండాలని అమ్మ కోరిక. చిన్నప్పుడు ఏ ఊరెళ్లినా, బయల్దేరే ముందే..'అక్కడ పిచ్చి వేషాలు వెయ్యం! ఎవ్వరితోనూ లొల్లి పెట్టుకోం! ఏది పెడితే అదే తింటం! గిదే కావాల్నని సతాయించం! పెద్దోళ్లు మాట్లాడుకుంటుంటె అక్కడ ఉండం!' ఇలాంటి ఎన్నో వాగ్దానాలు మా చేత చేయించేది. మేం ఆ లక్ష్మణ రేఖ కొంచెం దాటినా.. అమ్మ చూపులకే భయం వేసి సర్దుకునేవాళ్లం.'మన పిల్లల తప్పులు మనం తెలుసుకుని మందలించి, బుజ్జగించి, తెలియజెప్పి సరిచేయాలి. పిల్లల్ని ఏమీ అనొద్దు అనుకుంటే.. భవిష్యత్తులో లోకం వాళ్లను ఏదైనా అంటుంటే, అప్పుడు మనం చూస్తూ ఉండాల్సి వస్తుంది' అనేది అమ్మచెప్పే సూత్రం. మనవళ్లపైనా, మనవరాలిపైనా ఎంతప్రేమ చూపుతుందో.. అంతగానూ వాళ్లమీద జోకులేసి నవ్వడానికి అమ్మవెనుకాడదు. అమ్మకు జ్ఞాపకశక్తి చాలా ఎక్కువ! ఇప్పటికీ తొంభై ఏళ్ల వయసులో కనీసం ఎనభై అయిదేళ్ల కిందటి సంగతులు, వ్యక్తుల పేర్లు, ఊర్ల పేర్లు సహా చెబుతుంది. మాన్యులనుంచి సామాన్యులవరకు.. అందరూ, అన్నీ ఆమెకు గుర్తే! అమ్మకు చెట్లంటే ప్రాణం. నీళ్లు చేది పోసి మరీ ఎన్ని చెట్లను పెంచిందో! పుట్టిన పదిహేను రోజులకే తల్లిని పోగొట్టుకున్న అమ్మ.. తండ్రి ప్రేమకూ నోచుకోలేదు. కానీ, తన ప్రేమను నిండుగా, మెండుగా మాకందించింది.

# శరీర శ్రమ



పరగణాలపల్లిలో నివసించే ప్రతాప్ పెద్ద సోమరి. ఏ పనీ చేసేవాడు కాదుబీ ఎక్కడికీ వెళ్ళేవాడు కాదుబీ ఏ బాధ్యతా మోసేవాడు కాదు. ఇంట్లోనే కూర్చుని, భార్య మంగమ్మతో రుచికరంగా వంటలు చేయించుకొని తింటూ, కాలం గడిపేవాడు.మంగమ్మ ఓర్పు గల ఇల్లాలు. భర్తను పల్లెత్తు మాట అనకుండా, అతను చెప్పినట్లల్లా వింటూ ఉండేది– 'ఏదో ఒకనాడు భర్తలో మార్పు రాకపోతుందా' అని ఆశగా ఎదురు చూస్తూ ఉండేది.'కూర్చొని తింటే కొండంత ఆస్తులైనా కరిగిపోతాయి' అని సామెత. 'పనీ పాటా లేకుండా తింటూ పోతే వచ్చే పాట్లు తప్పుతాయా?' అని ఆమె చాలా రోజుల పాటు మథనపడింది, చివరికి ఒక రోజున కచ్చితంగా నిర్ణయించుకొని, ఉదయాన్నే లేచి పెద్ద మార్కెట్టుకు వెళ్ళింది. తన దగ్గరున్న డబ్బులకు సరిపడా కాయగూరల్ని పెద్ద మొత్తాల్లో హెూల్–సేల్ ధరల్లో కొన్నదిబీ ఆటోలో వేసుకొని వచ్చింది !ఆ మూటల్ని ఆమె ఒక్కతే ఆటోలోంచి దింపుతుంటే, భర్త ప్రతాప్ ఊరికే చూస్తూ కూర్చున్నాడు తప్ప, కనీసం దగ్గరకు వెళ్ళి చేతి సాయం కూడా చెయ్యలేదు.మంగమ్మ ఒక్కతే వాటిని అన్నిటినీ మోసుకొచ్చి, ఇంటి ముందు వసరాలోకి చేర్చి, తక్షణమే అక్కడ అంగడి ప్రారంభించింది. కొద్ది రోజులు గడిచేసరికి చుట్టుప్రక్కల ఇళ్లవాళ్లంతా కూరగాయల కోసం ఆమె దగ్గరికే రాసాగారుబీ కానీ ప్రతాప్ మటుకు ఆ పని తనది కానట్లు, వసారాలో ఉన్న అరుగుమీదనుండి కదలకుండా గుండ్రాయిలాగా కూర్చుని ఉండేవాడు. మంగమ్మ వంటపనిలో ఉన్నప్పుడు ఎవరైనా ఇరుగు పొరుగులు వచ్చి, తమకు కావలసిన కాయగూరలేంటో చెప్పినా, అతను వినీ విననట్లు ఊరుకునేవాడు తప్ప ఆ కూరలు తూచి ఇచ్చేవాడు కాదు. ఒక్కోసారి వాళ్ళు గొడవకు కూడా దిగేవాళ్ళు– "ఏం మనిషివయ్యా నువ్వు? భార్య కష్టపడుతుంటే కూర్చొని తినడమేనా, నీ పని?! అంగట్లో కూర్చోవటం కూడా చేతకాదా, నీకు? ఛీ! ఏం బతుకయ్యా?!" అని ముఖం మీదే తిట్టేవాళ్ళు. అలాంటి సందర్భాలలో కూడా ప్రతాప్ లేచి పని చేసేవాడు కాదు: మంగమ్మే, తను చేస్తున్న పనిని ఆపుకొని వచ్చి, వాళ్ళకు కావలసిన కూరగాయలు ఇచ్చి పంపేది!అయినా, కాయగూరలు అందరికీ అవసరమే కాబట్టి, మంగమ్మ మాట తీరు బాగుంటుంది కాబట్టి, ఆమె వ్యాపారం బాగానే సాగింది.రాను రాను ప్రతాప్ బరువు పెరగసాగాడు. నడిస్తే కూడా ఆయాసం అవుతున్నది. మంగమ్మకు భర్త ఆరోగ్య విషయమై భయం వేసింది. దీనికోసం ఏంచేయాలో చెప్పమని తనకు పరిచయం ఉన్న ఓ డాక్టర్ గారిని సలహా అడిగింది.ఆ డాక్టరుగారు స్థానికుడు,బీ ప్రతాప్ గురించి చిన్నప్పటినుండి బాగా తెల్సినవాడు– కనుక అతనితో చనువుగా "ప్రతాప్! మీ ఇంటి ముందు చాలా స్థలముంది కదా, అక్కడ ఆకు కూరలో, కాయగూరలో పండించకూడదూ? నీకూ బాగుంటుంది, మంగమ్మ కూరగాయల అంగడికీ కొంత ఆదాయం వస్తుంది?!" అని చెప్పి చూసాడు. కానీ ప్రతాప్‌కు ఆయన మాటలు చెవికి ఎక్కలేదు.చూస్తూ చూస్తూండగానే ఒకనాడు ప్రతాప్ జబ్బు పడ్డాడు. మంగమ్మ అతన్ని ఆస్పత్రిలో చేర్చింది. డాక్టరుగారు రకరకాల పరీక్షలు చేయించి, 'శరీరంలో చెడు క్రొవ్వు చాలా పేరుకుపోయింది ప్రతాప్! నీ రక్తనాళాలు మూసుకుపోతున్నాయి.

రక్తపోటు ఎక్కువైంది. నువ్వు ఇట్లాగే ఉంటే తొందరలో గుండెజబ్బుతోపాటు, చక్కర రోగం లాంటివి కూడా వచ్చే ప్రమాదం ఉంది! దీనికి గాను నీ శరీరానికి బాగా ఎక్సర్‌సైజులు అవసరం. రోజూ ఉదయం పూట చకచకా నడవాలి, చెమట ఓడ్చే పనులు చెయ్యాలి, పట్నంలో నాకు తెలిసిన జిమ్ ఒకటి ఉన్నది. వాళ్ళు డబ్బులు తీసుకొని, నీకు చెమటలు తెప్పిస్తారు' అన్నాడు.'శరీరంలో కొవ్వు పేరుకోవటంబీ పట్నం, జిమ్, ఎక్సర్‌సైజు, డబ్బులు' అనగానే ప్రతాపుకు తెలివి మేలుకున్నది. "నేను ఇక్కడే బాగా శ్రమ పడతాను డాక్టరు గారు, మూటలు మోస్తాను, చెమటలు వచ్చేట్లు నేలను దున్నటం, కలుపు తియ్యటం, నీళ్ళు కట్టటం చేస్తాను. పట్నం వెళ్లకుండా సరిపోదా?" అన్నాడు."ఇక్కడ ఉంటే నువ్వు పని చేయవు ప్రకాశ్‌బీ చూస్తున్నాను కదా. ఇంట్లో ఉన్న చోటినుండి లేవవు నువ్వు. జిమ్ వాళ్లకైతే నీలాంటి వాళ్లచేత ఎట్లా ఎక్సర్ సైజులు చేయించాలో బాగా తెలుసు. నువ్వు వాళ్ల దగ్గరికి వెళ్తేనే నయం" అన్నారు డాక్టరు గారు. "ఈసారి ఆ మాటలు ప్రతాప్ మనసులో బాగా ప్రభావం చూపాయి. ఇంటికి వెళ్లగానే అతను పూనుకొని, పెరడునంతా బాగా గుల్ల చేసి, చదును చేసి, పాదులు కట్టి, తడి పెట్టాడు. సాయంత్రం కాగానే విత్తనాల అంగడికి పోయి. అక్కడ ఆకుకూరల, కాయకూరల విత్తనాలు తెచ్చి నాటాడు..ఆ రోజు అతను చాలా అలసిపోయాడు. శారీరక శ్రమ చేయటం వల్ల అతనికి ఇప్పుడు బాగా చెమట పట్టింది. రాత్రంతా కదలకుండా పడుకున్నాడు. మామూలుగా రాత్రిళ్ళు అసలు నిద్ర అన్నది ఎరుగక అలమటించే ప్రతాప్, ఆ రోజున ఒళ్ళు మరచి నిద్రించాడు. నిద్ర సుఖం ఎంత తియ్యనిదో అతనికి ప్రత్యక్షంగా తెలిసి వచ్చింది.ఇక అలా అతను ప్రతిరోజూ అతను ఉత్సాహంగా పనిచేయసాగాడు. చూస్తుండగానే వారాలు గడిచిపోయాయి. ఆకుకూరలు కోతకు వచ్చాయి. బీర, వంగ, మిరప, టమేటా వంటి కాయగూరల చెట్లన్నీ ఏపుగా పెరిగినై. కాత మొదలైంది. రోజులు గడిచే కొద్దీ వారికి వచ్చే ఆదాయం కూడా బాగా పెరిగింది. అంతకుముందు మజ్జుగా, సోమరిగా ఎక్కడబడితే అక్కడ కూలబడే ప్రతాప్ ఇప్పుడు తన పనిని తాను కల్పించుకుంటున్నాడు.

ఉత్సాహంగా కూడ ఉన్నాడు. మూడు నెలల తర్వాత మంగమ్మ అతను కలిసి డాక్టరు గారి దగ్గరికి వెళ్ళారు మళ్ళీ. ఈసారి పరీక్షల్లో అతను పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు తేలింది!"శ్రమ చేసే శరీరం చూసావా, ఇలా చలాకీగా ఉంటుంది" అని డాక్టరుగారు అంటే మంగమ్మ, ప్రతాప్ ఒకరినొకరు చూసుకొని నవ్వుకున్నారు.

# వాటికి ఐదు కళ్లు... ఆరు కాళ్లు!

తేనె ఎలా వస్తుందో మీ అందరికీ తెలుసు. మరి ఆ తేనెటీగల విశేషాలు తెలుసా! తెలియకపోతే ఇదిగో చదవండి. పక్షులు, జంతువులు, చిన్న చిన్న ఎగిరే కీటకాలు....ఇలా అన్నింటికి రెండే కళ్లు ఉంటాయి. కానీ తేనెటీగలకు మాత్రం ఐదు కళ్లు ఉంటాయి. ఆరు కాళ్లు ఉంటాయి. తేనెటీగలు నివసించే ప్రదేశాన్ని హైవ్స్(కాలనీస్) అంటారు. ఈ కాలనీలలో నివసించే తేనెటీగలు మూడు రకాలుగా విభజించబడి ఉంటాయి. ఒకటి క్వీన్, రెండోది వర్కర్స్, మూడోది డ్రోన్స్. తేనెటీగలలో 20వేలకు పైగా రకాలున్నాయి. తేనెటీగలు ఎరుపు తప్ప అన్ని రంగులు చూడగలవు. వాసన ద్వారా పూలను గుర్తిస్తాయి.ఒక తేనెతుట్టెలో 50వేల వరకు తేనెటీగలు ఉంటాయి. వర్కర్ బీస్ పువ్వుల నుంచి మకరందాన్ని సేకరిస్తాయి. అవి ఒక ట్రిప్‌లో 50 – 100 పువ్వుల నుంచి మకరందాన్ని సేకరిస్తాయి. క్వీన్ బీస్ గుడ్లు పెడుతుంది. అవి సీజన్‌లో ఒకరోజుకి 2500 గుడ్లు పెడుతుంది. తేనెటీగలు గంటకు 25 కి.మీ వేగంతో ఎగరగలవు. రెక్కలను సెకనుకు 200 సార్లు ఆడించగలవు.



# భలే గుడ్లగూబ





## కావలసినవి

ఫోమ్ షీట్లు – ఏడు (పింక్, బ్లూ, వైట్, బ్లాక్, రెడ్, ఎల్లో, గ్రీన్), కత్తెర, జిగురు, గూగ్లీ కళ్లు, స్కెచ్‌పెన్ను.

తయారీ విధానం

ముందుగా బొమ్మలో చూపించిన విధంగా ఫోమ్ షీట్‌పై స్కెచ్ పెన్ను సహాయంతో బొమ్మగీయండి.

గుడ్లగూబ శరీరం కోసం అవుట్‌లైన్ గీయండి.

బ్లూ షీట్‌పై ముఖం, మెడ గీయండి.

పింక్ షీట్‌పై గుండె బొమ్మ గీసి కత్తిరించండి. రెండు వైట్ సర్కిల్స్, రెండు గ్రీన్ సర్కిల్స్, రెండు పసుపు పాదాలు, రెండు చిన్న త్రిబుజాలు గీసి కత్తిరించండి. ఒకటి ఎరుపు, మరొకటి పుసుపు షీట్‌పై గీయండి. పింక్, బ్లూ షీట్‌ను జుట్టు కోసం కత్తిరించండి.

టేబుల్‌పై రెడ్ అవుట్‌లైన్ షీట్‌ను పెట్టండి. దానిపైన కిందిభాగంలో పింక్ హార్ట్‌ను అతికించండి.

ఇప్పుడు వాటిపై బ్లూ కట్‌అవుట్‌ను బొమ్మలో చూపించిన విధంగా అతికించండి.

పైభాగంలో జుట్టుకోసం కత్తిరించిన పింక్, బ్లూ షీట్‌లు అతికించండి.

కళ్ల కోసం తెలుపు సర్కిల్స్ అతికించండి. వాటిపై గ్రీన్ సర్కిల్స్ అంటించండి. తరువాత వాటిపై గూగ్లీ కళ్లు అంటించండి.

ఎరుపు, పసుపు త్రిభుజాలతో ముక్కు తయారుచేయండి.

కింద పసుపు పాదాలు అంటిస్తే గుడ్లగూబ బొమ్మ రెడీ.

# మూడు కోతుల కథలు

కొత్తపల్లిలో వచ్చిన మూడు కోతుల బొమ్మ గుర్తుందా? ఇవిగో, పోరంకి వికాస విద్యావనంనుండి వచ్చిన మూడు కోతుల కథలు, ఒక నాలుగు.. వీటిలో మీకు ఏ కథ నచ్చిందో చెప్పండి?

అనగనగా ఒక అడవిలో రాము, చింటూ, కిట్టూ అనే మూడు కోతులు ఉండేవి. అవి చాలా అల్లరివి. అడవిలో అంతటా తిరుగుతూ, ఇష్టం వచ్చినట్లు అడుకుంటూ, కనబడ్డ పండునల్లా తింటూ ఉండేవి ఎప్పుడూ.

చెట్లకు చాలా వాటికి బంక ఉంటుంది, కదా? ఒకరోజున ఈ మూడు కోతులూ అట్లా అడవిలో చెట్ల మీద ఆడుకుంటూ ఉంటే, వాటి చేతులకు ఆ బంక అంటుకుంది. దాంతో వాటికి చేతులు కట్టేసినట్లు అయ్యిందిబీ ఒళ్ళంతా కంపరం మొదలైందిబీ మనసంతా 'కిచకిచ' మొదలైంది.రాముకు కళ్ళ దురద పుట్టాయి. అది కళ్ళు నలుచుకునే సరికి, ఏముంది, చేతులు కాస్తా కళ్ళకు అతుక్కుపోయాయి! ఎంత పీక్కున్నా చేతులు విడిపోలేదు! దాంతో అది 'కుయ్ కుయ్' మని గట్టిగా అరవటం మొదలు పెట్టింది.ఆ అరుపులు విని చింటూకి భయం వేసింది. 'అరవకు! అరవకు! నాకు భయం వేస్తున్నది!' అని తను కూడా గట్టిగా అరుస్తూ, చేతులకున్న బంక సంగతి మర్చిపోయి గట్టిగా చెవులు మూసుకున్నది. అంతే– దాని చేతులు కాస్తా చెవులకి అతుక్కుపోయాయి! సరిగ్గా ఆ సమయానికి 'ఏయ్! చేతులు.. జాగ్రత్త..' అని అరవబోయింది కిట్టూ. దాని మాటలు గొంతులో ఉండగానే చింటూ చేతులు చెవులకు అతుక్కుపోయాయి! దాంతో 'అయ్యో, పాపం!' అనుకుంటూ తన చేతులతో నోరు మూసుకున్నది చింటూ. ఇంకేమున్నది, చేతులు కాస్తా దాని నోటికి అతుక్కుపోయాయి! అట్లా చేతులు కట్టేసుకున్న మూడు కోతులూ వాటిని విడిపించుకుందామని ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ రోజు సాయంత్రం గాంధీ గారు అటుగా పోతూ వాటిని చూసారు. సరిగ్గా ఆ సమయానికి అక్కడికి దగ్గర్లోనే ఒక నక్క, ఎలుగు బంటి చనిపోయిన జింకను తినడానికి గొడవ పడుతూ కనిపించాయి. ఆ సమయంలో గాంధీ గారికి మన మూడు కోతులనూ చూసి చాలా ముచ్చట వేసింది. "అరే! మన మానవుల కంటే ఇవి ఎంతో మంచివే! చెడు చూడటం లేదుబీ అవి తిట్టుకునే తిట్లు వినటంలేదుబీ వాటిని తిట్టి తమ మనసును పాడు చేసుకోకుండా ఎంచక్కా నోరు మూసుకున్నాయి! మనకు ఎంత చక్కని పాఠాన్ని నేర్పుతున్నాయో కదా!" అనుకున్నారు. అట్లా మనందరికీ 'చెడు వినకు, చెడు చూడకు , చెడు మాట్లాడకు' అని ఒక సూక్తి పెట్టారు.ఇంతకీ మూడు కోతులకూ ఏమైంది, ఆ తర్వాత? అవి వాళ్ల అమ్మా వాళ్ల దగ్గరికి పోయినై. వాళ్ల అమ్మలు కొంచెం ఆలోచించి, వాటి చేత స్నానం చేయించాయి. స్నానంలో తేమకు వాటి చేతులు మళ్ళీ వాటి స్వాధీనంలోకి వచ్చేసినై!

**రచన– ఎ.సూర్యతేజ్, ఆరవ తరగతి**

## తగిన శిక్ష

అనగనగా మూడు కోతులు. చెడు వినటం, చెడు మాట్లాడటం, చెడు చూడటం– ఇవే వాటి పనులు. ఇంకేమీ లేవు. అందుకని ఏ జంతువూ వాటిని పట్టించుకునేది కాదు. ఒక రోజున వాటికో కుందేలు కనిపించింది.

చెడు మాట్లాడే కోతి దానిని ఆపి, 'నువ్వెందుకే, ఉండేది అడవిలో?! ఎందుకూ పనికిరావు నువ్వు!' అని హేళన చేసింది. చెడు వినే కోతి అది విని, ఇంకా ఎగతాళిగా ఇకిలించింది. కుందేలు ముఖం చిన్నబోయింది.

చెడుని చూసే కోతి దాన్ని చూసి చప్పట్లు కొట్టింది. కుందేలు ఆ మూడింటికేసీ కోపంగా చూసి, ఏమనాలో చేతగాక, పొదలోకి దూరింది.

మూడు కోతులూ నవ్వుకుంటూ ముందుకు పోయినై. ఈసారి వాటికి ఒక ఏనుగు ఎదురైంది.

మూడు కోతులూ దాన్ని ఆపినై.

"ఏంటి సంగతి?" అన్నది ఏనుగు.

"నువ్వు ఎందుకురా, ఈ అడవిలో?! ఒట్టి గడ్డి దండగ. ఎందుకూ పనికి రావు. పైగా అంత బండగా ఉంటావు" అన్నది చెడు మాట్లాడే కోతి.

"అహ్హహ్హహ్హ! భలే అన్నావు!" అంటూ ఇకిలించింది చెడు వినే కోతి. వాటిని చూసి ఏనుగు ముఖం ఎర్రబడింది.

"ఎంత మంచి దృశ్యం! చూస్తే దీన్నే చూడాలి! దీని ముఖం కందిరీగలకంటే ఎర్రగా ఉంది!" అన్నది చెడుని చూసే కోతి. ఏనుగు ఒక్క దూకు దూకి, మూడుకోతులనీ తొండంతో చుట్టి పైకెత్తింది. గిరగిరా తిప్పింది. అప్పటివరకూ ఎగతాళిగా నవ్వుతూన్న కోతులు మూడూ ఇప్పుడు భయంతో హాహాకారాలు చేసాయి.

అంతలోనే అక్కడికొచ్చిన కుందేలు ఏనుగును ఆపి– "ఏనుగు మామా! వీటికి శిక్ష వేయాల్సింది నువ్వు కాదు– సింహరాజు దగ్గరికి తీసుకుపోదాం. తప్పు చేసినవాళ్ళను శిక్షించే అధికారం రాజుగారికి ఒక్కరికే ఉంది" అంది.

ఏనుగు ఒక్క క్షణం ఆలోచించింది. మూడు కోతులనూ కట్టగట్టి రాజుగారి దగ్గరకు ఈడ్చుకెళ్ళింది. జరిగిందంతా చెప్పింది. రాజుగారు మూడు కోతులకూ తగిన శిక్ష వేసాడు: చెడు మాట్లాడే కోతి వారం రోజులపాటు నోటిమీద చేతులు వేసుకొని కూర్చోవాలి. చెడు వినే కోతి అన్ని రోజులపాటూ చెవులు మూసుకొనే ఉండాలి. చెడు చూసే కోతి వారం రోజులపాటు చేతుల్తోటి కళ్ళు మూసుకొనేఉండాలి.

వారం రోజుల్లో కోతులు మూడూ మంచివైపోయాయి! ఇంక అప్పటి నుంచి చాలా బుద్ధిగా ఉండటం మొదలు పెట్టాయి.

చెడుని వినాలి, చూడాలి, పోరాడాలి!

ఒక అడవిలో మూడు కోతులు ఉండేవి. మూడు కోతులూ ఒకసారి 'చెడు వినకూడదుబీ చెడు మాట్లాడకూడదుబీ చెడు చూడకూడదు' అని నిర్ణయించుకున్నాయి.

సరిగ్గా ఆ సమయానికి ప్రక్క కొమ్మ మీద గూడు కట్టుకొని ఉన్న కోకిలమ్మ తన పిల్లలను గూటిలోనే వదిలి, మేతకోసం బయటికి వెళ్ళింది. అది అటు వెళ్ళగానే పరదేశం నుండి వచ్చిన గద్ద ఒకటి ఆ పిల్లల్ని ఎత్తుకు పోయేందుకు వచ్చి వాలింది. "ఓ! చెడు! చెడు! నేను దీన్ని చూడలేను!" అని ఒక కోతి కళ్ళు మూసుకున్నది."ఉం.. ఉం... బెబు!! బెబు!" అంటూ నోరు మూసుకున్నది మరొక కోతి."నేను ఈ అరుపులు వినలేను! వినలేను!" అంటూ చెవులు మూసుకున్నది మూడో కోతి.సంతోష పడిన గద్ద కోకిల పిల్లలకు ఇంకా దగ్గరికి వచ్చింది. కోకిల పిల్లలు ప్రాణ భయంతో అరవటం మొదలెట్టాయి. అంతలో మూడు కోతులకూ చాలా సిగ్గు వేసింది. "అసలు మంచి అంటే ఏమిటి?! చెడు అంటే ఏమిటి?! ఇతర జంతువులకూ, పక్షులకూ, కీటకాలకూ అబద్ధాలు చెప్పడం చెడు. అట్లాగే తోటి పక్షులను, జంతువులను ఆపదల్లోకి నెట్టటం చెడు. అసలు అక్రమాలను చూడకుండా, వాటిని గురించి వినకుండా, వాటిని గురించి మాట్లాడకుండా ఉండకూడదు! చెడును అర్థం చేసుకొని, ఎన్ని కష్టాలెదురైనా సరే, పోరాడి చెడును అరికట్టాలి! మనం 'చెడును వినకూడదు,చెడు మాట్లాడ కూడదు, చెడును చూడకూడదు' అనుకోవడం అసలు సరైనది కాదు! పోరాటమే మేలు!" అనుకున్నాయి. చటుక్కున కోకిల పిల్లలను అవి ఉండే గూటితో సహా– తీసుకెళ్ళి చెట్టు తొర్రలో పెట్టి, తొర్రకు అడ్డంగా నిలబడ్డాయి. బెదిరించబోయిన గద్దను మూడూ కలిసి తరిమేసాయి. కోకిల పిల్లల్ని కాపాడాయి.




## మారిన కోతులు

అనగనగా మూడు కోతులు ఉండేవి. అవి ఎప్పుడూ చెడ్డ పనులే చేసేవి. రోడ్డు మీద వెళ్ళే వాళ్ళ మీద రాళ్ళు వేసేవిబీ అరటి తొక్కలు విసిరేవిబీ పిల్లల చేతుల్లోంచి పదార్థాలన్నీ ఎత్తుకుపోయేవిబీ వాళ్లని కొరికేవిబీ ఇళ్ళలోంచి గిన్నెలు, చెంచాలు ఎత్తుకెళ్ళేవి– ఎప్పుడూ ఏదో ఒక తుంటరి పని చేస్తూనే ఉండేవి. మిగిలిన కోతులు వాటికి నచ్చ జెప్పేందుకు ప్రయత్నించినై. "మీ మూలంగా కోతులన్నిటికీ చెడ్డ పేరు వస్తున్నది" అని చెప్పినై. అయినా అవి ఎట్టించుకోలేదు. తమ దారిన తాము అల్లరి చేస్తూ 'రౌడీ కోతులు' అని పేరు తెచ్చుకున్నై.అకస్మాత్తుగా ఒక రోజున "జూ" నుండి కోతుల్ని పట్టుకునేవాళ్ళు వచ్చారు. వలలు వేసారు. తాళ్ళు వేసారు. కనిపించిన కోతినల్లా వ్యాన్ ఎక్కించి తీసుకెళ్ళారు. 'వాళ్ళ నుండి తప్పించుకుందాం' అని రకరకాల ప్రయత్నాలు చేసాయి మన మూడు కోతులూనూ. ఒక్క ప్రయత్నం కూడా ఫలించలేదు సరికదా, 'ఇవే, దొంగ కోతులు!' అని జూలో పని చేసేవాళ్ళు వాటిని గుర్తించారు. వాటిని మూడింటినీ వేరుగా ఉంచి, తిండి పెట్టకుండా మాడ్చి, రకరకాలుగా సతాయించారు. అయినా అవి వాళ్లకు ఏమాత్రం లొంగలేదు. చివరికి ఒకరోజున ఓ సర్కస్ వాళ్ళు వచ్చారు. 'మా సర్కస్‌లో పని చేసేందుకు కొన్ని కోతులు ఇవ్వండి' అని జూ వాళ్లను అడిగారు. జూ వాళ్ళకి వాళ్లంటే ఇష్టం లేదుబీ కానీ వాళ్ళు మన మూడు కోతులతోటీ బాగా విసిగిపోయి ఉన్నారు. ఎట్లాగైనా వాటికి బుద్ధి రావాలని, ఆ మూడు కోతుల్నీ సర్కస్ వాళ్లకి అమ్మేసారు.

మూడు కోతులూ చాలా సంతోషపడ్డాయి. స్వేచ్ఛ దొరికినట్లే ననుకున్నాయి. కానీ వాటికి తెలీదు– సర్కస్‌లో పని చేయటం అంటే నరకమేనని. సర్కస్ వాళ్ళు వాటికి అన్నం పెట్టకుండా మాడ్చారు. కొరడాతో కొట్టి తాము చెప్పిన పనల్లా చేసేట్లు వాటి చేత సాధన చేయించారు. అవి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ మరిన్ని శిక్షలు వేసారు.కొన్ని వారాలు గడిచే సరికి కోతులు మూడింటికీ బుద్ధి వచ్చింది. "ఊళ్ళో అల్లరి చేయకుండా ఉండి ఉంటే హాయిగా ఉందుము కదా! మన అల్లరి వల్ల మనకి మనం కష్టాలు తెచ్చుకున్నాంబీ మిగిలిన కోతులకీ కష్టం తెచ్చి పెట్టాం!" అని చాలా బాధ పడ్డాయి.చివరికి ఒకరోజున అవకాశం చూసుకొని మూడూ పారిపోయి, మెల్లగా ఊరు చేరుకున్నాయి. ఇప్పుడవి మంచి కోతులైపోయాయి. అల్లరి అస్సలు చేయలేదు. చెడు చెయ్యద్దు, చెడువినద్దు, చెడు మాట్లాడద్దు'ని సంపూర్ణంగా అమలులో పెట్టాయి! రచన–యువ సాయి తేజ,ఐదవ తరగతి